www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price): Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 31
శనివారం | 17-5-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: పంచమి పూర్తి, నక్షత్రం: పూర్వాషాఢ సా.5:44 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.2:06 నుంచి తె.3:47, దుర్ముహూర్తం: ఉ.5:46-7:29, అమృతఘడియలు:: మ.12:36-2:19, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 5:46, సూర్యాస్తమయం: 6:37
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


ధనుంజయ్ రెడ్డి

లిక్కర్ 'బాసులు' అరెస్టు


కృష్ణమోహన్‌రెడ్డి

ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అదుపులోకి

నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న అధికారులు.. లిక్కర్ స్కామ్ కేసులో కీలక మలుపు

ఇద్దరూ జగన్ మనుషులే
మాజీ సీఎం కార్యదర్శిగా ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీగా కృష్ణమోహన్‌రెడ్డి స్కామ్‌లో భూమిక
అరెస్టు తప్పించుకునేందుకు విశ్వ ప్రయత్నం
హైకోర్టు, సుప్రీంకోర్టులో ఇద్దరికీ చుక్కెదురు
మూడోరోజు విచారణలో అదుపులోకి..
'సిట్' తర్వాతి అడుగు తాడేపల్లి వైపేనా?

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసును చేపట్టినప్పటి నుంచి సిట్ సాగిస్తున్న అరెస్టుల పరంపరలో 2 పెద్ద వికెట్లు పడ్డాయి. వరుసగా 3 రోజులు రిటైర్డు ఐఏఎస్ అధికారి, జగన్ మాజీ కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని విచారించిన సిట్ అధికారులు, శుక్రవారం పొద్దుపోయాక వారిద్దరినీ అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించారు. ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేసిన వారిద్దరికీ అంతకుముందు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. సిట్ విచారణలో ఉండగానే వారిద్దరి పిటిషన్‌ను కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం

మిగతా 14వ పేజీలో...

జగన్ షాడో..
మీటింగ్స్, డీలింగ్స్‌లో ధనుంజయ్ దిట్ట
సర్వాంతర్యామిలా ఎదిగిన అధికారి
ఐదేళ్లూ పాలనపై పెత్తనం ఆయనదే
జగన్ సొంత పనుల పర్యవేక్షణ
పోస్టింగుల్లో అస్మదీయులకే అందలం
ప్రశ్నించేవారికి వెయిటింగే
అధికారిగా ఉంటూ వైసీపీకి రాజకీయ సేవలు
14
వైసీపీ ఎమ్మెల్యేల నుంచే ఆరోపణలు
ఆ కుటుంబంలో ఒకడిగా కృష్ణమోహన్‌రెడ్డి
మద్యం ముడుపుల గుట్టు ఆయనకే ఎరుక!

వారిద్దరికీ వ్యతిరేకంగా సాక్ష్యాలు!
వారిపై తీవ్ర అభియోగాలు.. కీలక దశలో విచారణ.. ముందస్తు బెయిలిస్తే దర్యాప్తు అధికారి చేతులు కట్టేసినట్లే: బెంచ్ వ్యాఖ్య
ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి సుప్రీం షాక్.. పిటిషన్ డిస్మిస్
ఖజానాకు రూ.3 వేల కోట్లకు పైగా నష్టం.. ముందస్తు బెయిలిస్తే కేసుపై ప్రభావం.. హైకోర్టు అన్నీ పరిశీలించే నిరాకరించింది
ఏపీ ప్రభుత్వ వాదన.. థర్డ్ డిగ్రీ ప్రయోగించొద్దని కోర్టు ఆదేశం



లక్షకు ఐదు వేలు

అమెరికా నుంచి డబ్బు పంపితే ఇకపై పన్ను బాదుడే

విదేశాలకు నగదు బదిలీలపై 5% పన్ను విధిస్తూ బిల్లు
తిరస్కరించిన ప్రతినిధుల సభ బడ్జెట్ కమిటీ
సవరణలు చేసి మళ్లీ ప్రవేశపెడతామన్న స్పీకర్
బిల్లు అమలైతే ప్రవాస భారతీయులకు భారమే
ప్రస్తుతం అమెరికాలో 45 లక్షల మంది భారతీయులు
కొత్త పన్నుతో వీరిపై రూ.13,688 కోట్ల మేర భారం
అమెరికా నుంచి దేశంలోకి తగ్గనున్న నగదు బదిలీలు
భారత రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం


యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ నుంచి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం అందుకుంటున్న ట్రంప్

న్యూఢిల్లీ, మే 16: అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు అక్కడి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పెద్ద షాకిచ్చింది. అమెరికా నుంచి ఇతర దేశాలకు జరిగే నగదు బదిలీలపై 5 శాతం పన్ను వసూలు చేసేందుకు వీలుగా "బిగ్ బ్యూటిఫుల్ బిల్" పేరిట బిల్లును తీసుకొచ్చింది. అయితే, ప్రతినిధుల సభ బడ్జెట్ కమిటీ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టేందుకు 21-16 ఓట్ల తేడాతో వ్యతిరేకించింది. అయిదుగురు రిపబ్లికన్లు కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. దాంతో సవరణలు చేసి బిల్లును తిరిగి ప్రతినిధుల సభలో ప్రవేశపెడతామని స్పీకర్ మైక్ జాన్సన్ తెలిపారు. ఒకవేళ బిల్లు ఆమోదం పొందితే .. అమెరికాలో సంపాదించిన డబ్బును.. వేరే దేశాల్లో ఉన్న తమ వారికి పంపే విదేశీయులు పన్నుల రూపంలో భారీగా

మిగతా 2వ పేజీలో...

ట్రంప్ మిస్టరీ!
భారత్ విషయంలో చర్చనీయాంశంగా వైఖరి
మోదీకి ప్రాధాన్యమిస్తూనే పన్ను మోత
వాణిజ్య చర్చలు జరుగుతుండగానే జీరో ట్యాక్స్ అంటూ వ్యాఖ్యలు
ఐఫోన్ యూనిట్లను భారత్ నుంచి తరలించాలని యాపిల్‌కు సూచన
భారత్, పాక్‌లను ఒకేగాటన కట్టే వైఖరి
అమెరికాలోని భారతీయులకు భారంగా మారేలా వరుస నిర్ణయాలు
2

సైనికుల పోరాటానికి సెల్యూట్: సీఎం

సెలబ్రిటీల నుంచి దేశభక్తి ఆశించకండి.. దేశభక్తికి మురళీనాయక్ లాంటి వారిని చూపండి: డిప్యూటీ సీఎం పవన్.. విజయవాడలో ఘనంగా తిరంగా ర్యాలీ


విజయవాడ బందర్ రోడ్‌లో శుక్రవారం నిర్వహించిన తిరంగా యాత్రలో జాతీయ జెండాలతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి 13


తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ప్రఖ్యాత పిల్లలమర్రి చెట్టు వద్ద ప్రపంచ సుందరి పోటీదారులు

పిల్లలమర్రిని చూసి.. ఎకోపార్క్‌లో కలియదిరిగి
2
ఆస్పత్రిలో పిల్లలకూ ప్రపంచ సుందరి పోటీదారుల పరామర్శ

బాబు సారథ్యంలో.. ట్రెండ్ సెట్ చేస్తున్నాం!
భారీ పెట్టుబడులతో కలల సాకారం 12
8 నెలల వ్యవధిలోనే దిగ్గజాలను తీసుకొచ్చాం
దేశంలో క్లీన్ ఎనర్జీ విప్లవానికి పునాదిరాయి 'రెన్యూ'
త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్: లోకేశ్
22 వేల కోట్లతో రెన్యూ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



అనంతపురం జిల్లా బేతాపల్లి వద్ద 'రెన్యూ' శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్. చిత్రంలో మంత్రి గొట్టిపాటి రవి, 'రెన్యూ' చైర్మన్ సుమంత్ సిన్హా, ఎమ్మెల్యే జయరాం



నీరజ్.. మరో చరిత్ర
90 మీటర్ల మార్క్ దాటిన భారత జావెలిన్ స్టార్
ఈ ఘనత సాధించిన మూడో ఆసియా అథ్లెట్
10

'పోలవరం'పై 28న సీఎంలతో ప్రధాని సమావేశం
12
పాల్గొననున్న ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సీఎంలు

5 లక్షల మందితో యోగా డే
విశాఖ కార్యక్రమానికి మోదీ
సీఎం సమీక్ష.. కీలక ఆదేశాలు
13

రక్షణ రంగానికి మరో 50 వేల కోట్లు!

ఆపరేషన్ సిందూర్ నేపథ్యమే కారణం.. మొత్తం రక్షణ బడ్జెట్ 7 లక్షల కోట్లు దాటే అవకాశం
పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఆమోదం!

న్యూఢిల్లీ, మే 16: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశ రక్షణ రంగానికి అదనంగా రూ.50వేల కోట్ల నిధులు కేటాయించాలని కేంద్రం యోచిస్తోంది. సప్లిమెంటరీ బడ్జెట్ ద్వారా అందించనున్న ఈ మొత్తంతో రక్షణ రంగానికి కేటాయింపులు రూ.7లక్షల కోట్లు దాటనుందని

మిగతా 11వ పేజీలో...



విజయ్ షాపై చర్యలు తీస్కోండి
మోదీకి కర్నల్ సోఫియా బంధువుల వినతి
తుర్కియే ఉత్పత్తులు వద్దు!
యాపిల్ల దిగుమతిని నిలిపేసిన ఢిల్లీ మండి
ఆభరణాలు కొనబోమన్న లక్నో వ్యాపారులు
పాక్ నుంచి అఫ్గాన్ సరకు రవాణా ట్రక్కులకు అనుమతి
తాలిబన్ మంత్రితో జైశంకర్ ఫోన్ సంభాషణ
2, 11లో

గాలివాన బీభత్సం
విద్యుత్తు రంగం విలవిల.. సీపీడీసీఎల్‌పై తీవ్ర ప్రభావం
గుంటూరు, బాపట్లలో నేలకొరిగిన చెట్లు, స్తంభాలు
గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేత
యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ
3


గుంటూరులో నేలకొరిగిన భారీ వృక్షం



ఐసీయూలో పిల్లలతో.. అందాల భామల ముచ్చట్లు!

హైదరాబాద్ సిటీ/ మహబూబ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల కోసం వచ్చిన అందాల భామలు శుక్రవారంగచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. ఆస్పత్రిలో పిల్లల ఐసీయూ వార్డును సందర్శించి.. కాలేయ, జీర్ణకోశ తదితర సమస్యలతో బాధపడుతున్న పిల్లలను పలకరించారు. వారి పేరు, చదువు, ఇతర వివరాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్వీట్లు, బహుమతులు అందజేశారు. ఆ పిల్లల జబ్బులు, అందుతున్న చికిత్స వివరాలను వైద్యుల నుంచి తెలుసుకున్నారు. అంతకుముందు ఆస్పత్రికి వచ్చిన సుందరీమణులకు ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి బతుకమ్మలను అందించి స్వాగతం పలికారు. వారు ఏఐజీ ఆస్పత్రిలో అత్యాధునిక ఎండోస్కోపీ సౌకర్యాలు, ఇన్నోవేషన్ సెంటర్, క్లినికల్ స్కిల్ ల్యాబ్, రీసెర్చ్ ల్యాబ్, ఆధునిక అంకాలజీ, పిల్లల సంరక్షణ విభాగాలను పరిశీలించారు. వాటి పనితీరును డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఏఐజీ ఆస్పత్రి వైద్య రంగంలో కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించడాన్ని సుందరీమణులు ప్రశంసించారు. ఇక, ఏడు శతాబ్దాల చరిత్ర కలిగిన పాలమూరులోని పిల్లలమర్రి వద్ద అందాల భామలు శుక్రవారం సందడి చేశారు. తొలుత రాజరాజేశ్వర ఆలయంతోపాటు, పురావస్తు నిపుణుడు ఈమని శివనాగిరెడ్డి నిర్వహిస్తున్న మ్యూజియాన్ని సందర్శించారు. తర్వాత పిల్లలమర్రి ప్రాంగణానికి చేరుకున్నారు. వారికి చెట్టు విశిష్టతను అటవీ అధికారులు వివరించారు. ఆ ప్రాంగణంలో అందాల భామలు మొక్కలు నాటారు. కూచిపూడి, భరతనాట్యం, బంజారా నృత్యాలను వీక్షించారు. తామూ కాలు కదిపారు. హస్తకళలు, చేనేత స్టాళ్లను సందర్శించారు. పలువురు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు.

ఎకో పార్క్‌లో ఉత్సాహంగా పర్యటన

ప్రపంచ సుందరి పోటీలో ఉన్న అందాల భామలు.. హైదరాబాద్ శివార్లలోని ప్రొద్దుటూరులో ఉన్న ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌ను సందర్శించారు. బ్యాటరీ వాహనాల్లో పార్కు మొత్తం కలియదిరిగారు. దాదాపు 150 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్క్‌లో ఎన్నో దేశాలకు చెందిన 25వేలకుపైగా రకాల మొక్కలు ఉన్నాయి. వాటిని ఆసక్తిగా పరిశీలించారు. తమ దేశాల మొక్కలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. ఉత్సాహంగా సెల్ఫీలు తీసుకున్నారు. పార్క్‌లో సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్న చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. ఈజిప్షియన్ రాక్ స్పాట్ వద్ద నాటు నాటు పాటకు ఉత్సాహంగా కాలు కదిపారు. పార్క్ అద్భుతంగా ఉందని కొనియాడారు. భావితరాల భవిష్యత్ కోసం ప్రకృతిని కాపాడాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు.

పాక్ నుంచి అఫ్గాన్ సరుకు ట్రక్కులకు అనుమతి

న్యూఢిల్లీ, మే 16: ఆపరేషన్ సిందూర్ కారణంగా సరిహద్దులు మూసివేయడంతో పాకిస్థాన్‌లో నిలిచిపోయిన 150 అఫ్గాన్ సరకు రవాణా ట్రక్కులను వాఘా-అట్టారీ సరిహద్దు ద్వారా భారత్ వచ్చేందుకు అనుమతించారు. వీటిలో అధిక శాతం డ్రై ఫ్రూట్స్ తీసుకువచ్చేవే. ఇప్పటికే 8 ట్రక్కులు భారత్ చేరుకున్నట్లు వ్యాపార సంఘాల ప్రతినిధులు తెలిపారు. మరోవైపు అఫ్గానిస్థాన్ తాలిబన్ల పాలనలోకి వెళ్లాక తొలిసారిగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆ దేశ తాత్కాలిక విదేశాంగ మంత్రి ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో గురువారం ఫోన్‌లో సంభాషించారు. ఈమేరకు జైశంకర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించినందుకు ధన్యవాదాలు తెలిపినట్లు పేర్కొన్నారు. అంతేగాక తప్పుడు, నిరాధార వార్తలతో భారత్, అఫ్గానిస్థాన్ల మధ్య విభేదాలు సృష్టించేందుకు జరిగిన ప్రయత్నాలను తిప్పికొట్టడాన్ని స్వాగతించారు. సుదీర్ఘ కాలంగా రెండు దేశాల మధ్య ఉన్న సంబంధాలను గుర్తుచేసినట్లు జైశంకర్ పేర్కొన్నారు.

ట్రంప్ మిస్టరీ!



భారత్ విషయంలో చర్చనీయంగా అమెరికా అధ్యక్షుడి వైఖరి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు అనుకూలమా!? ప్రతికూలమా!? ఆయన నిర్ణయాలు మన దేశానికి మంచి చేసేవా!? చెడు చేసేవా!? ప్రస్తుతం ప్రతి ఒక్కరి మదిలోనూ వెన్నాడుతున్న ప్రశ్నలివి! నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించినట్లు ఇటీవలికాలంలో ఆయన నిర్ణయాలు ఉండడమే ఇందుకు కారణం. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్లారు. అప్పుడు మోదీకి ట్రంప్ ఘన స్వాగతం పలికారు. ఒప్పందాలపై సంతకాలు చేసే సమయంలో మోదీ కుర్చీ లాగి మరీ ఆయనను కూర్చోబెట్టారు. దీంతో, ట్రంప్ వచ్చినా భారత వాణిజ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, రెండు దేశాల మధ్య సుహృద్భావ వాతావరణమే ఉంటుందని వాణిజ్యవర్గాలు భావించాయి. అంతలోనే ట్రంప్ పరస్పర సుంకాల వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ఏప్రిల్ 4న భారత్‌పైనా 26శాతం సుంకాలను ప్రతిపాదించారు. దీంతో మన స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. వారం రోజుల్లోనే ఈ సుంకాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మిగిలిన దేశాలతో పాటు భారత్‌కూ సుంకాలపై 90 రోజుల విరామం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈలోపులో సంప్రదింపులు జరుగుతాయని ప్రకటించారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుండగానే.. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తన బృందంతో అమెరికా పర్యటనకు వెళ్లడానికి ఒక్క రోజు ముందు తమ దిగుమతులపై సుంకాలన్నీ ఎత్తేస్తామంటూ భారత్ సూపర్ ఆఫర్ ఇచ్చిందని ట్రంప్ ప్రకటించారు. అయితే చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని విదేశాంగమంత్రి జైశంకర్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. భారత్ తమకు ప్రాధాన్య దేశమని, ఆ దేశంతో వాణిజ్యం కీలకమంటూనే భారత్‌లోని ఐఫోన్ తయారీ యూనిట్లను అమెరికాకు తరలించాలని యాపిల్ సీఈవో టిమ్‌కుక్‌కు ట్రంప్ సూచించారు. వాణిజ్య యుద్ధంలో భాగంగా చైనాపై ట్రంప్ భారీ సుంకాలు వేశారు. దాంతో అక్కడ తయారు చేసిన ఐఫోన్లను దిగుమతి చేసుకోవడం అమెరికాకు భారంగా పరిణమించనుంది. దీంతో చైనా నుంచి ఫోన్ల తయారీ యూనిట్లను భారీగా భారత్‌కు తరలించాలని యాపిల్ నిర్ణయించింది. అంతలోనే ట్రంప్ బాంబు పేల్చారు. భారత్‌కు బదులుగా అమెరికాలోనే ఐఫోన్ల తయారీ యూనిట్లను నిర్మించాలని టిమ్ కుక్‌కు సూచించానని స్వయంగా ఆయనే వెల్లడించారు. ట్రంప్ నిర్ణయంతో సంబంధంలేదని, భారత్‌లో ఐఫోన్ల తయారీ యూనిట్ల కార్యకలాపాలను కొనసాగిస్తామని యాపిల్ ప్రకటించినా.. ట్రంప్ వ్యాఖ్యలు భారత్‌కు ప్రతికూలమనే వాదన వెల్లువెత్తుతోంది. పహల్గాం ఉగ్రదాడి ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో.. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ ఇచ్చే ఆర్థిక సాయాన్ని నిలిపివేయాలని భారత్ విజ్ఞప్తి చేసింది. కానీ, పాకిస్థాన్ 7బిలియన్ డాలర్లు అడిగితే తొలి విడతగా 1బిలియన్ డాలర్లు ఇచ్చింది. దీనిపై తీవ్రస్థాయిలోనే భారత్ మండిపడింది. అమెరికా మద్దతులేకుండా ఐఎంఎఫ్ ఈ రుణాన్ని మంజూరు చేయదనే విశ్లేషణలూ అప్పట్లో వెలువడ్డాయి. దీనిపై అమెరికా మిలటరీ వ్యూహకర్త, పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రుబిన్ కూడా ట్రంప్ సర్కారును తీవ్రంగా తప్పుబట్టారు. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం ఇవ్వకుండా నిలుపు చేయకపోవడం తీవ్ర తప్పిదమని, పాకిస్థాన్‌కు సాయం చేయడం ద్వారా చైనాకూ సాయం చేసినట్లేనన్నారు. ఇక ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ట్రంప్ వైఖరి ఇలాగే ఉంది. రెండు దేశాల మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. మరోవైపు పాకిస్థాన్‌ను భారత్‌ను; మోదీని, షెహబాజ్‌ను ఒకే గాటన కట్టారు. రెండూ గొప్ప దేశాలని, ఇద్దరూ చరిత్రాత్మక, వివేచిత నిర్ణయాలు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. రెండు దేశాలతోనూ వాణిజ్యాన్ని భారీగా పెంచుతానని ప్రకటించారు. వాణిజ్యం ఆపేస్తానని బెదిరించి పాకిస్థాన్‌తో భారత్ యుద్ధం చేయకుండా ఆపానన్నారు. యుద్ధసమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే మద్దతుగా డ్రోన్లు, క్షిపణులు అందజేసిన విషయం తెలిసిందే. తుర్కియేకు 304మిలియన్ డాలర్ల క్షిపణులను విక్రయించే ఒప్పందానికి అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇటీవలికాలంలో అమెరికాలోని భారతీయులకు భారం గా పరిణమించే నిర్ణయాలు తీసుకుంటున్నారు. అక్ర మ వలసదారులను అత్యంత అమానవీయంగా భారత్‌కు తిరిగిపంపడంపై అప్పట్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. తాజాగా ప్రవాస భారతీయులు ఇండియాలోని తమ తల్లిదండ్రులకు పంపే నిధులపైనా పన్ను విధిస్తామని ప్రకటించారు. ఇక తొలుత చైనాతో ఢీ అంటే ఢీ అన్నట్లుగా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఆ దేశంపై ఏకంగా 145% సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించి ఆ తర్వాత వెనక్కి తగ్గి 30% సుంకాలను యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు. చైనా, పాక్‌లతో సానుకూలంగా.. భారత్ విషయంలో ట్రంప్ ప్రతికూల వైఖరి కనబరచడం తీవ్రచర్చనీయాంశంగా మారింది. - సెంట్రల్ డెస్క్

లక్షకు ఐదు వేలు

(మొదటి పేజీ తరవాయి)

చెల్లించాల్సి ఉంటుంది. ప్రతిపాదిత విధానం ప్రకారం.. అమెరికాలో ఉన్న భారతీయులు.. స్వదేశంలో ఉన్న తమ వారికి 1160 డాలర్లు అనగా దాదాపు రూ.లక్ష పంపిస్తే అందులో ఐదు శాతం.. రూ.5000ను పన్నుగా చెల్లించాలి. ఈ పన్నును నగదు బదిలీ సేవలను అందించే వెస్టర్న్ యూనియన్, మనీగ్రామ్ లేదా అమెరికా ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకులు వసూలు చేస్తాయి. హెచ్-1బీ, ఎఫ్-1 లేదా జే-1 తదితర వీసాదారులు, గ్రీన్ కార్డుదారులు, తగిన గుర్తింపు పత్రాలు లేనివారు నగదు బదిలీలు చేసినప్పుడు ఈ పన్ను చెల్లించాల్సిందే. గుర్తింపు పొందిన అమెరికా పౌరులకు మాత్రం ఈ పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. పౌరసత్వ నిర్ధారణ సదుపాయం ఉండి ప్రభుత్వ గుర్తింపు కలిగిన సర్వీస్ ప్రొవైడర్ ద్వారా నగదు బదిలీ చేస్తేనే వారికి కూడా మినహాయింపు లభిస్తుంది. కాగా, ఈ నూతన విధానం అమలులోకి వస్తే ప్రవాస భారతీయులపైన, భారత రియల్ ఎస్టేట్ రంగంపైనా ప్రభావం చూపనుంది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం 2023-24లో భారతదేశానికి విదేశాల నుంచి 118.7 బిలియన్ డాలర్ల మేర నగదు బదిలీలు జరిగాయి. ఇందులో 32 బిలియన్ డాలర్లు.. 28 శాతానికి పైగా మొత్తం అమెరికా నుంచి వచ్చినవే. భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం దాదాపు 45 లక్షల మంది భారతీయులు(ఇందులో 32 లక్షల మంది భారత సంతతి వారు) అమెరికాలో ఉన్నారు. వీరంతా భారత్‌లోని తమ కుటుంబసభ్యులకు గృహ, విద్య, వైద్య అవసరాలకు, పెట్టుబడులు పెట్టేందుకు డబ్బు పంపిస్తుంటారు. ఎప్పట్లానే వీరు నగదు బదిలీలు కొనసాగిస్తే 5 శాతం పన్ను నిబంధన కింద వీరంతా 1.6 బిలియన్ డాలర్లు నష్టపోనున్నారు. దీంతో నూతన పన్ను విధానం అమలులోకి వస్తే అమెరికా నుంచి భారత్‌కు జరిగే నగదు బదిలీలు తగ్గుతాయి. ఇది భారత రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులపై ప్రభావం చూపనుంది. విదేశాల్లో ఉన్న తమ వారు పంపే డబ్బును భారత్‌లో చాలామంది ముంబై, హైదరాబాద్, కొచ్చి తదితర నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడిగా పెడుతుంటారు. అనరాక్స్ 2024 వార్షిక రెసిడెన్షియల్ నివేదిక ప్రకారం.. కొత్త హౌసింగ్ ప్రాజెక్టుల్లో న్యూఢిల్లీ ఎన్‌సీఆర్‌లోని 59 శాతం, హైదరాబాద్‌లో 18 శాతం, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 12 శాతం విలాసవంతమైన ఇళ్ల ధరలు రూ.2.5 కోట్లకు పైగానే పలుకుతున్నాయి. ధనిక వర్గాలు ఎక్కువ ఆసక్తికి చూపే ఈ ప్రాజెక్టుల్లో ఎన్ఆర్ఐల పెట్టుబడులే చాలా కీలకం. అయితే, అమెరికా 5 శాతం పన్ను విధానం అమలు చేస్తే ఎన్ఆర్ఐల పెట్టుబడులు తగ్గుతాయి.

లోకం తీరు



'బ్రహ్మోస్' భళా!

- దీనిముందు పాక్, చైనా రక్షణ వ్యవస్థలు దిగదుడుపే
- అమెరికా యుద్ధ నిపుణుడు స్పెన్సర్

న్యూఢిల్లీ, మే 16: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణి పనితీరును అమెరికాకు చెందిన యుద్ధరంగ నిపుణుడు, రిటైర్డ్ కల్నల్ జాన్ స్పెన్సర్ ప్రశంసించారు. పాక్‌తో యుద్ధంలో అటు దాడి చేయడంలోనూ, ఇటు రక్షణాత్మకంగా వ్యవహరించడంలోనూ భారత్ స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని కొనియాడారు. దాయాది దేశంలోని ఏ ప్రాంతాన్ని అయినా, ఏ సమయంలో అయినా సునాయాసంగా ఛేదించగలమనే సందేశాన్ని భారత్ పంపిందని 'ఇండియా టుడే'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. పాక్ ఉపయోగించిన చైనా వైమానిక రక్షణ వ్యవస్థలు బ్రహ్మోస్ క్షిపణుల ధాటికి నిలబడలేకపోయాయని తెలిపారు. అసలు వాటికి బ్రహ్మోస్‌తో పోలికే లేదని తేల్చేశారు. పాక్‌లోని ఉగ్ర స్థావరాలు, ఎయిర్ బేస్‌లను భారత్ సునాయాసంగా ధ్వంసం చేయడంలో బ్రహ్మోస్ కీలక పాత్ర పోషించింది. పాకిస్థాన్ వ్యాప్తంగా దాడులు చేయడమే కాకుండా శత్రుదేశం చేసిన డ్రోన్ దాడులు, క్షిపణులను సమర్థంగా అడ్డుకోవడంలో భారత్ విజయవంతమైందని స్పెన్సర్ వివరించారు. పాక్ ఉపయోగించిన చైనా రక్షణ వ్యవస్థల్లోకి బ్రహ్మోస్ చొచ్చుకుపోవడం భారతదేశ అధునాతన సైనిక సామర్థ్యాలకు నిదర్శనమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ పాక్ సైన్యానికి భారీ నష్టాలను మిగిల్చిందని తెలిపారు. భవిష్యత్తులో సైనిక వ్యూహకర్తలు, విద్యార్థులకు ఈ ఆపరేషన్ ఒక అధ్యయనాంశంగా మారుతుందని స్పెన్సర్ అభిప్రాయపడ్డారు. సింధు జలాలపై భారత్ తెలివైన నిర్ణయం తీసుకుందని, ఉగ్ర సంస్థలకు ఇస్తున్న మద్దతుపై పాక్ పునరాలోచించుకొనేలా చేసిందని స్పెన్సర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

గాలమేసి.. గురిచూసి..

పాక్ ఎయిర్‌బేస్‌లపై దాడి కోసం భారత్ వినూత్న వ్యూహం



- పైలట్ రహిత విమానాలను ఎరగా పంపి సుఖోయ్, మిగ్-29లుగా భ్రమింపజేసి..
- తమ రక్షణ వ్యవస్థలు, రాడార్లను పాక్ యాక్టివేట్ చేసేలా ఉసిగొల్పి..
- ఆ వ్యవస్థలను, ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసిన భారత వాయుసేన

న్యూఢిల్లీ, మే 16: భారత్ ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టగానే.. పాక్ విచ్చలవిడిగా డ్రోన్లు, స్వల్ప శ్రేణి క్షిపణులతో దాడులు మొదలుపెట్టింది. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్న భారత్.. పాక్ మళ్లీ ఆ పనిచేయకుండా, ఆ దేశంలోని కీలక ఎయిర్‌బేస్‌లను దెబ్బతీయాలని నిర్ణయించింది. ఇందుకు బ్రహ్మోస్ క్షిపణులు, హారోప్ సూసైడ్ డ్రోన్లు వంటి అత్యాధునిక ఆయుధాలు వినియోగించాలి. కానీ పాక్ గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్లు వాటిని గుర్తించి అడ్డుకుంటే నష్టం జరగడంతోపాటు మన లక్ష్యమూ నెరవేరదు. ఆ రక్షణ వ్యవస్థలు, రాడార్లను మొదట ధ్వంసం చేస్తే.. ఎయిర్‌బేస్‌లపై దాడి సులువు అవుతుంది. కానీ పాక్ తన రక్షణ వ్యవస్థలను, రాడార్లను ఎక్కడ మోహరించినదీ తెలియదు. వాటిని యాక్టివేట్ చేస్తే తప్ప వాటి ఉనికిని గుర్తించలేని పరిస్థితి. ఇక్కడే మన వాయుసేన వినూత్న ఆలోచన చేసింది. మే 9న అర్ధరాత్రి 'లక్ష్య, బన్షీజెట్ 40 ప్లస్' వంటి పైలట్ రహిత విమానాలను రంగంలోకి దింపింది. పాక్‌లో దాడి చేయాలనుకున్న ఎయిర్‌బేస్‌లకు దూరంగా, వేర్వేరు ప్రాంతాల్లోకి వాటిని పంపింది. ఆ పైలట్ రహిత విమానాలను.. సుఖోయ్ ఎంకేఐ30, మిగ్-29 విమానాలుగా, భారీగా ఆయుధాలతో దాడికి వస్తున్నట్టుగా భ్రమింపజేసింది. ఈ గాలానికి చిక్కిన పాక్.. తాను వినియోగించే చైనా తయారీ హెచ్‌క్యూ9 రక్షణ వ్యవస్థను, సామ్ (సర్ఫేస్ టు ఎయిర్) బ్యాటరీ వ్యవస్థలను, రాడార్లను యాక్టివేట్ చేసింది. పైలట్ రహిత విమానాలను అసలైన సుఖోయ్, మిగ్ విమానాలుగా భావించి.. వాటిని కూల్చేందుకు యుద్ధ విమానాలను పంపింది. క్షిపణి వ్యవస్థలనూ అటువైపే టార్గెట్ చేసింది. దీంతో ఆ రక్షణ వ్యవస్థలు, రాడార్లు, వాటిని నియంత్రించే కమాండ్ కంట్రోల్ వ్యవస్థలు ఎక్కడున్నాయో భారత వాయుసేనకు తెలిసింది. మరుక్షణంలోనే మన వాయుసేన అసలు పని మొదలుపెట్టింది. ఇజ్రాయెల్ తయారీ హారోప్ లాయిటరింగ్ మ్యూనిషన్లను (సూసైడ్ డ్రోన్లుగా పిలుస్తారు) ప్రయోగించి.. రాడార్లు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థలను ధ్వంసం చేసింది. పాక్ గగనతల రక్షణ వ్యవస్థ నిర్వీర్యమైంది. ఇదే అదనుగా మన వాయుసేన 15 బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించి.. పాకిస్థాన్‌లోని 12 కీలక ఎయిర్‌బేస్‌లలో 11 ఎయిర్‌బేస్‌లను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేసింది. మనవైపు నష్టమేమీ లేకుండా అత్యాధునిక యుద్ధ తంత్రాల్లో అత్యంత కీలకమైన వ్యూహాన్ని విజయవంతంగా అమలు చేసింది.

అసలైన యుద్ధ విమానాలుగా.. అలా ఎలా?

భారత్ వద్ద సొంతంగా అభివృద్ధి చేసిన 'లక్ష్య'తో పాటు యూకే తయారీ 'బన్షీజెట్ 40 ప్లస్' పైలట్ రహిత విమానాలు ఉన్నాయి. వీటిని యుద్ధ విమాన పైలట్లకు శిక్షణ ఇచ్చే సమయంలో, యుద్ధ విమానాల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు లక్ష్యాలుగా వినియోగిస్తుంటారు. నిజానికి ఇవి రాడార్లపై సరిగా గుర్తించలేనంత చిన్న పరిమాణంలోనే ఉంటాయి. కానీ వీటిలోని వివిధ పరికరాలు.. అసలైన యుద్ధ విమానాల తరహాలో వివిధ రకాల సిగ్నళ్లను.. యుద్ధ విమానాల ఇంజన్లు, బాడీ నుంచి వెలువడే తీవ్ర ఉష్ణాన్ని పోలినట్టుగా 'ఇన్‌ఫ్రారెడ్ సిగ్నేచర్ల'ను విడుదల చేస్తాయి. వీటికి డమ్మీ క్షిపణులను కూడా అమర్చవచ్చు. దీనితో శత్రుదేశాల రాడార్లు.. అసలైన యుద్ధ విమానం దూసుకువస్తున్నట్టు భ్రమించి శత్రుదేశాలు వాటిపైకి క్షిపణులు ప్రయోగించడమో, యుద్ధ విమానాలను పంపడమో చేస్తాయి. ఈ పైలట్ రహిత విమానాల్లోని పరికరాల నుంచి వెలువడే సిగ్నళ్లు, సిగ్నేచర్లను వేర్వేరుగా మార్చుకోవచ్చు. శత్రుదేశాల రాడార్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలను గందరగోళానికి గురిచేయగల 'ఈసీఎం (ఎలక్ట్రానిక్ కౌంటర్‌మెజర్స్)' వ్యవస్థలను అమర్చవచ్చు. మన వాయుసేన వీటిలో సుఖోయ్-30ఎంకేఐ, మిగ్-29 విమానాలు, క్షిపణులతో సహా వస్తున్నట్టుగా సిగ్నళ్లు వెలువర్చేలా ఏర్పాట్లు చేసిందని రక్షణ వర్గాల సమాచారం.

విజయ్ షాపై చర్యలు తీసుకోండి

- ప్రధానికి కర్నల్ సోఫియా బంధువుల వినతి

భోపాల్, మే 16: ఆపరేషన్ సిందూర్‌లో ప్రముఖ పాత్ర పోషించిన కర్నల్ సోఫియా ఖురేషీ ఉగ్రవాదుల సోదరి అని మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా అభివర్ణించడంపై ఆమె కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రధాని, రక్షణ మంత్రి, కేంద్ర హోం మంత్రిలకు విజ్ఞప్తి చేశారు. ఆమె బంధువు బంటీ సులేమాన్ మాట్లాడుతూ 'ఆమె మా కుమార్తె కాదు..దేశం కుమార్తె..ఆర్మీ కుమార్తె' అని అన్నారు. ఛత్తర్‌పూర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భన్వర్ రాజా తమ ఇంటికి వచ్చారని, మంత్రిపై ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

అభ్యర్థులను గుర్తించడానికి ఆధార్ ప్రామాణీకరణ

- ఎన్ఆర్ఏకు కేంద్రం అనుమతులు

న్యూఢిల్లీ, మే 16: వివిధ పోటీ పరీక్షలు నిర్వహించే నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ (ఎన్ఆర్ఏ)కి అభ్యర్థుల గుర్తింపును స్వచ్ఛందంగా గుర్తించడానికి ఆధార్ ఆధారిత ప్రామాణీకరణను నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. పరీక్ష నిర్వహణ పరంగా నెలకొనే సమస్యలను ఇది పరిష్కరిస్తుందని, పరీక్షలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి కూడా దోహదపడుతుందని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ గతంలోనే పేర్కొన్నారు. ఇక యూపీఎస్సీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్‌లకు కేంద్రం ఆధార్ ఆధారిత ప్రామాణికతను నిర్వహించడానికి ఇదివరకే అనుమతులిచ్చింది.

ఆకాశ్‌తీర్‌తో ఆటకట్టు

పాక్‌కు అడ్డుగోడగా నిలిచిన రక్షణ వ్యవస్థ



- దాయాది ఎన్నడూ చూడని అస్త్రంతో దెబ్బ

న్యూఢిల్లీ, మే16: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని వ్యూహాత్మక ప్రదేశాల్లో ఎనిమిది వైమానిక స్థావరాలు సహా 13 లక్ష్యాలను భారత్ అత్యంత కచ్చితత్వంలో ఎలా ఛేదించగలిగింది ? ఈ దాడులను అడ్డుకోవడంలో పాక్ ఎందుకింత ఘోరంగా విఫలమైంది ? ప్రపంచవ్యాప్తంగా అనేక మంది నిపుణులు ఈ ప్రశ్నలకు సమాధానాల కోసం వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ కొన్ని కీలక అంశాలను వెల్లడించింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) రూపొందించి, అభివృద్ధి చేసిన ఆకాశ్‌తీర్ అనే గగనతల రక్షణ వ్యవస్థ పాక్ ఆటకట్టించిందని, వాళ్లు ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులు, మైక్రో యూఏవీలను సమర్థవంతంగా కూలగొట్టడంలో కీలక పాత్ర పోషించిందని వివరించింది. దేశీయంగా తయారైన ఆకాశ్‌తీర్ అంచనాలకు మించి రాణించిందంటూ దీని సత్తాను తెలియజేసింది.

ఆకాశ్‌తీర్ ప్రత్యేకతలివే...

- ఈ నెల 9, 10వ తేదీల్లో భారత్‌లోని సైనిక, పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకుని పాక్ డ్రోన్, క్షిపణి దాడులకు తెగబడింది. అయితే, దేశీయంగా అభివృద్ధి చేసిన గగనతల రక్షణ వ్యవస్థ ఆకాశ్‌తీర్ రక్షణగోడగా నిలిచి ఆ దాడులను అడ్డుకుంది.
- పాక్ నుంచి దూసుకొచ్చే డ్రోన్లు, క్షిపణులు, మైక్రో యూఏవీ (మానవరహిత వైమానిక వాహనాలు)లు భారత భూభాగంలో పడకుండా ఆకాశ్‌తీర్ నిరోధించింది. దీనిలో ఉన్న అత్యంత విధ్వంసక అంశం ఏమిటంటే.. భూమిపై ఉన్న రక్షణ వ్యవస్థలను అనుసంధానం చేయడం ద్వారా వాతావరణం, భూభాగం, రాడార్ ఇంటర్‌సెప్ట్‌ల నుంచి డేటాను సంగ్రహించి.. రియల్‌టైమ్‌లో నిర్ణయాలు తీసుకోగలదు. స్వయంప్రతిపత్తితో దాడులు అమలుచేసే సామర్థ్యం దీనిలో ఉంది. ఇలాంటి వ్యవస్థను ఎన్నడూ చూడలేదని పాక్ రక్షణ రంగ నిపుణులే అన్నారంటే దీని సత్తా అర్థం చేసుకోవచ్చు.
- ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రూపొందించిన ఆకాశ్‌తీర్.. భారత పరాక్రమాన్ని ప్రదర్శించే స్వదేశీ ఉత్పత్తి. ఆకాశ్‌తీర్‌కు పోటీగా చెప్పుకునే.. పాకిస్థాన్ వైమానిక రక్షణ (ఏడీ) నెట్‌వర్క్‌లో చైనాకు చెందిన హెచ్‌క్యూ-9, హెచ్‌క్యూ-16 అనే గగనతల రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. అవి మన వైమానిక దాడులను అడ్డుకోవడంలో విఫలమయ్యాయి.
- ఆకాశ్‌తీర్ అనేది పూర్తిగా స్వయంప్రతిపత్తి కలిగిన రక్షణ వ్యవస్థ. దీనిలో భాగస్వామ్యమైన అన్ని వ్యవస్థల (కంట్రోల్ రూమ్, రాడార్లు, ఎయిర్ డిఫెన్స్ గన్స్) కు పరిస్థితి తీవ్రతను రియల్‌టైమ్‌లో అందిస్తుంది. ఇది శత్రు విమానాలు, డ్రోన్లు, క్షిపణులను గుర్తించి, ట్రాకింగ్ చేసి, వాటిపై చర్యలు తీసుకునేలా ఎయిర్ డిఫెన్స్‌ను అందిస్తుంది.
- ఈ ప్లాట్‌ఫామ్ రాడార్ వ్యవస్థలు, సెన్సర్లు, కమ్యూనికేషన్ టెక్నాలజీలను ఒకే కార్యాచరణ చట్రంలోకి తీసుకువస్తుంది.
- ఆకాశ్‌తీర్ విస్తృతమైన సీ4ఐఎస్ఆర్ (కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్స్, సర్వేలెన్స్, రికనైసెన్స్) ఫ్రేమ్‌వర్క్‌లో భాగం. ఇది ఇతర వ్యవస్థలను సమన్వయం చేసుకుని పనిచేస్తుంది. శక్తితో కాక బుద్ధి బలంతో యుద్ధం చేస్తుంది.
- ఆకాశ్‌తీర్ ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల ఎయిర్ డిఫెన్స్‌పై స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శిస్తుందనే నమ్మకం ఇచ్చింది.
- ఆకాశ్‌తీర్‌తో భారత్ కూడా పూర్తిగా ఆటోమేటెడ్, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్, సీ అండ్ ఆర్ సామర్థ్యం కలిగిన దేశాల జాబితాలో చేరింది. ఆకాశ్‌తీర్ ఊహించినదాని కంటే వేగంగా శత్రువుని గుర్తిస్తుందని, వేగంగా నిర్ణయాలు తీసుకుంటుందని, వేగంగా దాడి చేస్తుందని నిరూపితమైంది. ఆకాశ్‌తీర్ వ్యవస్థను వాహనంపై అమర్చవచ్చు. ప్రతికూల వాతావరణంలోనూ సులువుగా నిర్వహించవచ్చు.





ఆభరణాలను టీటీడీ అదనపు ఈవోకు అందజేస్తున్న దాత సంజీవ్ గోయెంకా

శ్రీవారికి రూ.3.63 కోట్ల విలువైన బంగారు కటి, వరద హస్తాలు విరాళం

తిరుమల, మే 16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి రూ.3.63 కోట్ల విలువైన బంగారు కటి, వరద హస్తాలు శుక్రవారం విరాళంగా అందాయి. కోల్‌కతాకు చెందిన సంజీవ్ గోయెంకా వజ్రాలు, రత్నాలు పొదిగిన ఈ బంగారు కటి, వరద హస్తాలను ప్రత్యేకంగా తయారు చేయించి సమర్పించారు. వీటి బరువు 5.267 కిలోలు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి రంగనాయక మండపంలో దాత ఈ ఆభరణాలను అందజేశారు.

చిన వెంకన్న సేవలో జస్టిస్ సుబ్బారెడ్డి



జస్టిస్ సుబ్బారెడ్డికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో మూర్తి

ద్వారకాతిరుమల, మే 16(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి కుటుంబసమేతంగా శుక్రవారం రాత్రి దర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

గాలివాన బీభత్సం

విద్యుత్తు రంగం విలవిల.. సీపీడీసీఎల్‌పై తీవ్ర ప్రభావం

- గుంటూరు, బాపట్లలో నేలకొరిగిన చెట్లు, స్తంభాలు
- గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేత
- యుద్ధ ప్రాతిపదికన కరెంటు పునరుద్ధరణ
- బర్లీ పొగాకు తడిసి రైతుల ఆందోళన



గుంటూరు నగరంలో రోడ్డుపై అడ్డంగా కూలిన రేకుల షెడ్డు

అమరావతి, గుంటూరు, బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు దక్షిణకోస్తా జిల్లాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. అనేక చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. ఏలూరు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా కుండపోత వాన, కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీనివల్ల విద్యుత్ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. కొన్ని ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగం గా కరెంటు నిలిపివేసినా, అనేక చోట్ల విద్యుత్తు తీగలు తెగిపడడం, ఫీడర్లు దెబ్బతిని విద్యుత్తుకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈపీడీసీఎల్ పరిధిలోని అనకాపల్లి, పాయకరావుపేట, నర్సీపట్నం, యలమంచిలి ప్రాంతాల్లో పాక్షికంగా విద్యుత్తు ఫీడర్లు దెబ్బతిన్నాయి. ఇక సీపీడీసీఎల్ పరిధిలోని బాపట్ల, సీఆర్‌డీఏ, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో చెట్లు విరిగిపడి విద్యుత్తు తీగలు తెగిపోయాయి. సీపీడీసీఎల్ పరిధిలో 33 కేవీ ఫీడర్లు 37, 11 కేవీ ఫీడర్లు 493 ఫెయిల య్యాయి. వాటిలో 33 కేవీ ఫీడర్లు 35, 11 కేవీ ఫీడర్లు 470 పునరుద్ధరించారు. తెగిపడిన వైర్లను సరిచేశారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. జరిగిన నష్టంపై రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక వస్తుందని ఇంధనశాఖ వర్గాలు వెల్లడించాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీభత్సం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో శుక్రవారం వేకువజామున ప్రారంభమైన పెనుగాలుల తీవ్రతకు విద్యుత్ స్తంభాలు, చెట్లు, హోర్డింగ్‌లు నేలకూలాయి. ఎక్కడికక్కడ విద్యుత్ తీగలు తెగిపోయాయి. ముందస్తుగా రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిపేయడంతో ప్రజలు జాగారం చేయాల్సి వచ్చింది. విద్యుత్ ఫీడర్లపై చెట్లు కూలిపడటంతో వాటిని బాగు చేయడానికి గంటల తరబడి పవర్ బ్రేక్ డౌన్ తీసుకొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉదయానికి, మరికొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నానికి సప్లై ఇచ్చారు. శివారు ప్రాంతాల్లో సాయంత్రానికి కూడా పునరుద్ధరణ కాలేదు.

అమరావతి పనులకు ఆటంకం!

అమరావతి రాజధానిలోనూ వర్షం ప్రతాపం చూపించింది. జోరుగా కురిసిన వర్షంతో నేలంతా చిత్తడిగా మారి శరవేగంగా జరుగుతున్న నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. పనులు తిరిగి ప్రారంభం కావడానికి మూడు, నాలుగు రోజుల సమయం పడుతుందని అక్కడివారు తెలిపారు. బాపట్ల జిల్లాలోనూ ఇదే తీరున విద్యుత్ అంతరాయంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అత్యధికంగా పర్చూరు నియోజకవర్గంలో పొగాకు రైతులకు ఈ వర్షం మరింత దెబ్బకొట్టినట్లు చెబుతున్నారు. ఇప్పటికే సరైన ధర లేక విలవిల్లాడుతుండగా, ఇప్పుడు వర్షాలతో పంట నాణ్యతపై ప్రభావం చూపి, నష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. చీరాల పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం కాగా నిజాంపట్నం మండలం అడవులదీవిలో ఆలయ ధ్వజ స్తంభం నేలకొరిగింది.

ఎండా.. వానలతో అవస్థ!

- నేడు ఉత్తర కోస్తాకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు ఆనుకొని పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఆగ్నేయ బంగాళాఖాతంలో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. వాయువ్యభారతం నుంచి కోస్తాంధ్ర వరకు పొడిగాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో రాష్ట్రంలో ఓవైపు ఎండలు, ఉక్కపోత, మరోవైపు ఈదురుగాలులతో వర్షాలు కురుస్తూ భిన్నవాతావరణం నెలకొంది. వర్షం కురిసిన ప్రాంతాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత, ఉక్కపోతకు జనం అవస్థలు పడ్డారు. శుక్రవారం రాయలసీమ, కోస్తాలో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షం కురిసింది. రాత్రికి ఎక్కువచోట్ల పిడుగులతో వర్షాలు, రెండు, మూడుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. శనివారం కోస్తా, రాయలసీమలో ఎక్కువచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఉత్తరకోస్తాలో రెండు, మూడుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆ తర్వాత రెండు రోజుల్లో రాయలసీమలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతుందని, మధ్యాహ్నం సమయంలో ఆరు బయట పనిచేసే కార్మికులు, వ్యవసాయ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

పర్చూరులో కుంభవృష్టి

ఏలూరు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా బాపట్ల జిల్లా పర్చూరులో 105.74, కృష్ణా జిల్లా తేలప్రోలులో 97, గుంటూరులో 82, ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో 73.5 మిల్లీమీటర్ల వాన పడింది. అనకాపల్లి, కోనసీమ, కడప తదితర జిల్లాల్లో అనేక చోట్ల మోస్తరు వర్షాలు పడ్డాయి. దీంతో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు తగ్గాయి. చాలా చోట్ల 31-38.5 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం జగతిపల్లి బూర్జగూడ, పాలకొండ ఎన్ఎస్ఎన్ కాలనీలలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందారు.

టీటీడీ వేద పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుమల, మే 16(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి టీటీడీ వేదపాఠశాలల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను టీటీడీ ఆహ్వానించింది. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం(తిరుమల), కీసరగుట్ట, విజయనగరం, భీమవరం, నల్గొండ, కోటప్పకొండలో వివిధ కోర్సుల్లో ప్రవేశం కోసం అర్హులైన బాలుర నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొంది. కోర్సుల వివరాలు, అర్హత, ఆవశ్యకత, దరఖాస్తు వంటి ఇతర వివరాల కోసం టీటీడీ వెబ్‌సైట్ 'తిరుమల.ఓఆర్జీ'ని సంప్రదించాలని, ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని టీటీడీ స్పష్టం చేసింది.

హత్య కేసులో ఏడుగురికి జీవితఖైదు

- సీసీఎల్ కోర్టుకు మరో ఇద్దరు మైనర్ల తరలింపు

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇంటికి భోజనానికి పిలిచి, ఓ వ్యక్తిని దారుణంగా హత్యచేసిన కేసులో నేరం నిరూపణ కావడంతో ఏడుగురికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాలు...బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవుకి చెందిన మోసా సూరిబాబు(30), అదే గ్రామానికి చెందిన పిక్కి సింహాద్రికి రూ.3లక్షలు అప్పు ఇవ్వగా, తిరిగి ఇవ్వకపోవడంతో మనస్పర్థలు చెలరేగాయి. అదేసమయంలో సింహాద్రి భార్యతో సూరిబాబుకు వివాహేతర సంబంధం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈక్రమంలో సింహాద్రి, తన భార్య శాంతి, కుమార్తె, కుమారుడు(మైనర్‌లు) సహాయంతో సూరిబాబును అంతమొందించాలని పన్నాగం పన్నాడు. బంధువులైన వైజాగ్‌కు చెందిన బొంది డేవిడ్, గ్రామానికి చెందిన పిక్కి రాజు, పిక్కి ఆనంద్, పిక్కి సత్తెమ్మ, ఓరుపుల మాణిక్యంను ఆశ్రయించాడు. కుమార్తెను ఇచ్చి పెళ్లి చేస్తామని సూరిబాబుతో రెండు, మూడు రోజులు మాట్లాడారు. 2023 అక్టోబర్ 10 రాత్రి ఇంటికి భోజనానికి పిలిచారు. సూరిబాబు కూడా అంగీకరించి వెళ్లాడు. అప్పటికే ఇంట్లో నక్కిన ఐదుగురు, సింహాద్రి కుటుంబ సభ్యులు ఇనుప రాడ్లు, పైపులతో సూరిబాబుపై దాడిచేశారు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం నిరూపణ కావడంతో ఒంగోలు అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఏ.పూర్ణిమ ఏడుగురికి జీవితఖైదుతోపాటు, రూ.2వేలు జరిమానా విధించారు. అయితే కేసులో అప్పట్లో మైనర్లుగా ఉన్న సింహాద్రి కుమార్తె, కుమారుడుకు సీసీఎల్ కోర్టులో చార్జ్‌షీటు వేయనున్నారు.

గుంటూరు మిర్చి యార్డులో అవినీతిపై కొరడా

- వైసీపీ హయాంలో రూ.347 కోట్ల అవినీతి జరిగిందని విజిలెన్స్ నివేదిక
- అధికారులు, ఉద్యోగుల పాత్రపై రిపోర్టు
- చర్యలకు ఆదేశిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



అమరావతి/గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)లో వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో కుటుంబానికి నాలుగైదు మిర్చి యార్డులు లైసెన్సులు జారీ చేశారని, జీరో బిజినెస్, కటింగ్ బిజినెస్ వల్ల యార్డు ఆదాయం కోల్పోవటానికి ఉద్యోగులు కారణమనే ఫిర్యాదులతో విజిలెన్స్ విభాగం గతేడాది విచారణ జరిపి, సుమారు రూ.347 కోట్ల అవినీతి జరిగిందని తేల్చింది. ఈ మేరకు సమగ్ర నివేదికను ప్రభుత్వానికి గత ఏడాది నవంబరులో అందజేసింది. నివేదిక ఆధారంగా మిర్చి యార్డు పూర్వపు కార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరెడ్డి, కె.శివారెడ్డి, సహాయ కార్యదర్శులు కె.జయరామిరెడ్డి, వి.ఆనంద్‌భాస్కర్, 11 మంది సూపర్‌వైజర్లు, ఇద్దరు జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్లు, ఒక డ్రైవర్‌పై అభియోగాలు నమోదయ్యాయి. ఉమ్మడి విచారణలో భాగంగా ఈ 18 మందిపై క్రమశిక్షణ చర్యలతో పాటు జరిమానాలు విధించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్జితసేవా టికెట్ల కోటా 19న విడుదల

తిరుమల, మే 16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆగస్టు నెల ఆర్జిత సేవా టికెట్ల కోటా (ఎలక్ట్రానిక్ డిప్)ను ఈ నెల 19న టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు భక్తులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. 24 ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో గదులు కోటా విడుదల చేస్తారు.

పలు ఏపీపీఎస్సీ పరీక్షలు వాయిదా

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షల నేపథ్యంలో పలు నోటిఫికేషన్ల పరీక్షలను ఏపీపీఎస్సీ వాయిదా వేసింది. జూన్ 6 నుంచి 26వ వరకు నిర్వహించాల్సిన పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్, టీటీడీ డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టుల రాత పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజాబాబు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే జూన్ 6 నుంచి 12 వరకు జరగాల్సిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలను కూడా వాయిదా వేసినట్టు తెలిపారు.

'పది' రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలు విడుదల

పదో తరగతి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలను విడుదల చేసినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలిపారు. 66,421 మంది రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోగా వాటిలో 47,484 జవాబు పత్రాల ఫలితాలను ఇప్పుడు ప్రకటించామని, మిగిలినవి త్వరలో విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 3,62,392 దరఖాస్తులు

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ: సెట్ చైర్మన్

జేఎన్టీయూకే, మే 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్-2025కు 3,62,392 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని సెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఇంజనీరింగ్‌కు 2,80,578 మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 81,814 మంది.. రెం డింటికీ 912 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఏపీలో 143, హైదరాబాద్‌లో 2 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్లను ఏపీఈఏపీసెట్‌కు సం బంధించిన https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌తో పాటు, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 నంబరు ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. 19, 20 తేదీల్లో అగ్రికల్చర్ ఫార్మసీ, 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి నిమిషం ఆలస్యంగా హాజరైనా అనుమతించబోరని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆ ప్రశ్నల అంతర్యం

ప్రశ్న మంచిదే. అయితే, ఏ ఉద్దేశంతో, ఏ ప్రయోజనాలకోసం? రాష్ట్రపతి సుప్రీంకోర్టును పద్నాలుగు ప్రశ్నలు వేశారు. బిల్లుల ఆమోదానికి గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితులు విధిస్తూ సుప్రీంకోర్టు గతనెల తీర్పు వెలువరించినప్పుడు, అధికారపక్షం నుంచి ఏ స్థాయిలో విమర్శలు వచ్చాయో తెలిసిందే. ఇలా రాష్ట్రపతిని రంగంలోకి తెచ్చి ఇంకా యుద్ధం కొనసాగించడం ఎందుకూ, సుప్రీంకోర్టు తీర్పుమీద అంత కోపం ఉంటే, రాజ్యాంగాన్నే మీకు నచ్చినట్టుగా మార్చేసుకోండి అని కొందరు న్యాయకోవిదులు ఆగ్రహంతోనో, అభిమానంతోనో ప్రభుత్వానికి సలహా ఇస్తున్నారు. న్యాయవ్యవస్థకూ, కార్యనిర్వాహక వ్యవస్థకూ మధ్య వివాదం కొనసాగడం, అగాధం పెరగడం అధికులకు నచ్చడం లేదు. ప్రశ్నించినంత మాత్రాన సవాలు చేసినట్టు కాదు, వివరణ అడిగితే విమర్శించినట్టూ కాదు. కానీ, ఈ ప్రెసిడెన్షియల్ రిఫెరెన్స్ లక్ష్యం అంత సున్నితంగా, ఉన్నతంగా కనిపించకనే ఈ అనుమానాలు, విమర్శలు.

రాజ్యాంగంలో లేని కాలపరిమితులను గవర్నర్లమీదా, రాష్ట్రపతిమీదా విధించడమేమిటంటూ, న్యాయసలహా పేరిట పద్నాలుగు ప్రశ్నలు సుప్రీంకోర్టుకు సంధించి రాష్ట్రపతి దానిని జవాబుదారీని చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇప్పటివరకూ పద్నాలుగుసార్లు మాత్రమే ఈ న్యాయసలహా ప్రయోజనాన్ని రాష్ట్రపతి వినియోగించుకున్నందున, మొన్నటి తీర్పు విషయంలో కార్యనిర్వాహక వ్యవస్థ ఎంత పట్టుదలగా ఉన్నదో అర్థమవుతుంది. రాజ్యాంగపరమైన హద్దులు, అధికారాల విభజన ఇత్యాది అంశాలకు సంబంధించి సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి చక్కని ప్రశ్నలు వేశారు. గవర్నర్ల అధికారాలు, రాష్ట్రపతి విచక్షణాధికారాల గురించి ఆరాతీశారు. గట్టిగా గుదిగుచ్చిన ఆ ప్రశ్నల మధ్యన మీ తీర్పు ఎలా చెల్లుబాటవుతుందన్న అసలు ప్రశ్న కూడా వేశారు. రాష్ట్రపతి సంధించిన ఈ ప్రశ్నలకు సుప్రీంకోర్టు విలవిలలాడి, ఈ వివాదానికి మూల కారణమైన తీర్పును సమీక్షించుకుంటుందనీ, రద్దుపరుచుకుంటుందనీ కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. కొత్త ప్రధాన న్యాయమూర్తి రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసి, సమాధానాలు సిద్ధం చేయవచ్చునని వార్తలు వస్తున్నాయి. రాష్ట్రపతి ఆమోదించని బిల్లులను సైతం రాజ్యాంగ అధికరణం 142ద్వారా తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని చెల్లుబాటైనట్టుగా నిర్ధారించిన సుప్రీంకోర్టును 143వ అధికరణం కింద రాష్ట్రపతి ప్రశ్నించడం బాగున్నది కానీ, ఈ ప్రశ్నలు కొత్తవీ కావు, వీటిని తెరవెనుక నుంచి అడుగుతున్నవారికి సమాధానాలు తెలియనిదీ కాదు.

ఆర్టికల్ 142ను న్యూక్లియర్ మిసైల్‌గా అభివర్ణించిన ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ సహా ఆ నాటి తీర్పును తూర్పారబట్టిన నాయకులంతా బిల్లుల ఆమోదానికి నిర్దిష్టమైన గడువు విధించడాన్ని సహించలేకపోతున్నారు. ఈ తీర్పు తమిళనాడు గవర్నర్‌కో, అధికారపక్షంతో ఆయన క్రీడించిన ఓ డజను బిల్లులకో పరిమితమైనది కాదు. ఆర్.ఎన్. రవి తరహాలో వ్యవహరిస్తున్న విపక్షపాలిత రాష్ట్రాల గవర్నర్లందరికీ లక్ష్మణరేఖ దాటవద్దన్న ఘాటైన హెచ్చరిక అది. రాజ్యాంగం ఆశయాలకు అనుగుణంగా, ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేసిన తీర్పు ఇది. బిల్లుల ఆమోదానికి గవర్నర్లకు, రాష్ట్రపతికి రాజ్యాంగం గడువులేమీ విధించలేదు కనుకనే, ఆ పని మొన్నటి తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం చేసింది. గడువు లేని కారణంగా గవర్నర్లు విపక్షపార్టీల ప్రభుత్వాలతో ఆడుకుంటున్నారు కనుకనే, ప్రజాభీష్టాన్ని పరిరక్షించడానికి వీలుగా కాలపరిమితులు విధించింది. గడువుదాటిన గవర్నర్ల చర్యలు న్యాయసమీక్షకు నిలవాల్సివస్తుందని హెచ్చరించింది. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న రవి వంటివారిని వల్లనే ఇదంతా చేయవలసి వచ్చింది. ఇప్పుడు సుప్రీంకోర్టును ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రాష్ట్రపతి ఎప్పటికప్పుడు రవి వంటివారిని హద్దుల్లో ఉంచివుంటే ఈ గొడవే ఉండేదికావు. కాలపరిమితి దాటిన బిల్లులను కూడా తెలివిగా రాష్ట్రపతిబరిలోకి తోసినప్పుడే రవిని ఆ రాజ్యాంగాధిపతి కన్నెర్ర చేసివుంటే బాగుండేది.

సుప్రీంకోర్టు తీర్పును మన పాలకులు పలు రకాల పిటిషన్లతో పునఃపరిశీలించమని అడగవచ్చు, విస్తృత ధర్మాసనం కోసం విజ్ఞప్తిచేయవచ్చును. కానీ, ఇవేమీ కాకుండా ఇలా ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌తో ప్రశ్నించి, దాని హద్దులను తెలియచెప్పాలని కోరుకుంటున్నట్లుంది. ఈ అంశంలో సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని నివేదించినప్పటికీ, దానికి కట్టుబడాలన్న నియమం ఏమీ లేదు కనుక, కార్యనిర్వాహక వ్యవస్థ తనకు తోచిన విధంగా వ్యవహరించవచ్చు. కాకపోతే, రాష్ట్రాల హక్కులు, గవర్నర్ల విధులకు సంబంధించి కొన్ని కొత్త అంశాలతో లోతైన చర్చ జరిగేందుకు ఈ పరిణామం ఉపకరించవచ్చు.

ట్రంప్ దౌత్య రాజకీయం!

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత వ్యవహారాలలో ప్రమేయం పెట్టుకోకుండా దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరుకుంటున్నారు. అయితే ట్రంప్ మహాశయుడు మోదీ అభీష్టాన్ని నెరవేరుస్తారా? నెరవేర్చరు, సందేహం లేదు. ఏప్రిల్ 22, 2025న పహల్గాంలో ఉగ్రవాద దాడితో ప్రారంభమైన ఇండియా-పాకిస్థాన్ సంఘర్షణలో అమెరికా ప్రమేయం పెట్టుకుని తీరాలని డోనాల్డ్ ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఈ ఘర్షణపై తాను మాట్లాడిన ప్రతిసారీ, ట్వీట్ చేసిన ప్రతిసారీ తానూ భాగస్తుడినని మరీ మరీ స్పష్టం చేస్తున్నారు. ట్రంప్ అత్యుత్సాహానికి మౌనమే ఇంతవరకూ మోదీ ప్రతిస్పందన. సెప్టెంబర్ 2019లో హ్యూస్టన్‌లో 'అబ్కీ బార్, ట్రంప్ సర్కార్' అని పిలుపు ఇచ్చినందుకు మోదీ ఇప్పుడు కలవరపడుతూ ఉండవచ్చని నేను అనుమానిస్తున్నాను.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఏప్రిల్ 22న, ఇతర ప్రపంచ నాయకుల వలే ట్రంప్ కూడా పహల్గాం ఘాతుకంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ఘటనను తీవ్రంగా ఖండించారు. మే 7న పాకిస్థాన్‌లో ఎంపిక చేసిన లక్ష్యాలపై భారత్ మిస్సైళ్ళ, డ్రోన్ల దాడి ప్రారంభించింది. పూర్తి స్థాయి యుద్ధానికి దిగే ఉద్దేశం తమకు లేదని ఇండియా స్పష్టం చేసింది. భారత్ పాకిస్థాన్‌ల మధ్య సాయుధ ఘర్షణ శీఘ్రగతిన ముగుస్తుందని ఆశిస్తున్నానని ట్రంప్ ట్వీట్ చేశారు. ఆ మరుసటి రోజు 'తాను ఏమైనా సహాయం చేయగలుగుతానని భావిస్తే అక్కడ ఉంటాను' అని ఆయన అన్నారు.

మే 8/9 రాత్రి ఆయన వైఖరిలో ఏదో మార్పు చోటుచేసుకున్నది. చైనా ఉత్పత్తి చేసిన యుద్ధ విమానాలు, మిస్సైళ్ళ, టర్కీలో తయారైన డ్రోన్స్‌ను పాకిస్థాన్ ఉపయోగిస్తున్న విషయం తెలియడం వల్లే ఆ మార్పు సంభవించి ఉంటుందని నేను భావిస్తున్నాను. పాకిస్థాన్ ప్రయోగించిన మిస్సైళ్ళ, డ్రోన్‌లు అన్నిటినీ కూల్చివేసినట్టు మన సీనియర్ సైనికాధికారులు ధ్రువీకరించారు. రెండు రోజుల అనంతరం భారత్‌కు కొంత 'నష్టం' సంభవించినట్టు అధికారికంగా అంగీకరించారు. యుద్ధంలో రెండు పక్షాలకు నష్టం వాటిల్లడం సహజమే కదా. జరిగిన నష్టానికి ఇండియా ఏమీ ఆందోళన చెందలేదు. భారత ప్రజలూ కలవరపడలేదు. మే 10న ట్రంప్ తన వ్యక్తిగత సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్‌'లో చేసిన ట్వీట్‌తో కలవరం మొదలయింది. ఆ రోజు సాయంత్రం 5.25 గంటలకు ట్రంప్ తన ట్వీట్‌లో అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా జరిగిన చర్చల గురించి ప్రస్తావిస్తూ భారత్, పాకిస్థాన్‌లు తక్షణమే, పూర్తి స్థాయిలో కాల్పుల విరమణ పాటించేందుకు అంగీకరించాయని ప్రకటించేందుకు సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. ఇరు దేశాలను అభినందించారు. కొద్ది నిమిషాల అనంతరం అమెరికా విదేశాంగ కార్యదర్శి ఒక 'తటస్థ' ప్రదేశంలో చర్చలకు భారత్, పాకిస్థాన్‌లు సమావేశమవనున్నాయని ట్వీట్ చేశారు. అంతకు ముందు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు వ్యాన్స్ మోదీతో టెలిఫోన్‌లో జరిపిన సంభాషణల్లో ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని తెలియజేసినట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఈ ట్వీట్‌లు అన్నీ ఆసక్తికరంగానూ, దిగ్భ్రాంతికరంగాను ఉన్నాయి.



ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య సాయుధ సంఘర్షణపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ట్వీట్‌లు ఆసక్తికరంగాను, దిగ్భ్రాంతికరంగాను ఉన్నాయి. ఈ ఘర్షణ వ్యవహారాలకు ఆయన దూరంగా ఉండరు, ఉండబోరు. ఇబ్బంది కలిగించే ప్రకటనలు చేస్తూనే ఉంటారు. ఇంకా అనేక ప్రశ్నలకు ఆస్కారమిచ్చే విపుల సమాచారాన్ని ఆయన తప్పకుండా ఇస్తారు. అది లేవనెత్తే ప్రశ్నలు అన్నిటికీ మనకు సమాధానాలు లభిస్తాయా? లేక మౌనమే సమాధానమా?

మే 10 మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్ డీజీఎమ్ఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్)ల మధ్య చర్చలు జరిగాయని, సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని అదే రోజు సాయంత్రం 6 గంటలకు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి ధ్రువీకరించారు.

మే 12న 'అణు యుద్ధ' ప్రమాదాన్ని నివారించామని ట్రంప్ పేర్కొన్నారు. 'ఆ భయంకర యుద్ధానికి పాల్పడవద్దు. మీరు సంయమనంతో వ్యవహరిస్తేనే మీతో మేము వాణిజ్యం చేస్తామ'ని ఆయన అన్నారు. 'మీరు గనుక యుద్ధాన్ని ఆపకపోతే మేము ఎటువంటి వాణిజ్యమూ చేయం' అని ఆయన పేర్కొన్నారు. (సౌదీ అరేబియా, ఖతర్ పర్యటనలలో కూడా అధ్యక్షుడు ట్రంప్ తన ప్రకటనలను పునరుద్ఘాటించారు). మే 13న 'కొత్త సాధారణ పరిస్థితి' గురించి మోదీ ప్రస్తావించారు. 'అణు బ్లాక్ మెయిల్‌కు తాము భయపడమని, తలొగ్గమని స్పష్టం చేశారు.

కొన్ని సహేతుకమైన ప్రశ్నలు: మూడు అంశాల సూత్రంలో 'కొత్త' విషయమేమీ లేదు. ఉగ్రవాద దాడికి దీటుగా ప్రతిస్పందించడం; అణు బ్లాక్‌మెయిల్‌ను సహించకపోవడం; రాజ్య ఉగ్రవాదం, ఉగ్రదాడుల వ్యూహ ప్రజ్ఞాధురీణుల మధ్య వ్యత్యాసాన్ని పాటించకపోవడం. ఈ సువ్యవస్థిత సిద్ధాంతాన్నే కదా మోదీ పునరుద్ఘాటించింది? (2) ఉపాధ్యక్షుడు వ్యాన్స్, విదేశాంగ కార్యదర్శి రూబియో మే 8, 9న కాల్పుల విరమణ గురించి మాట్లాడారా? అదే సమయంలో వారు పాకిస్థాన్ నేతలతో కూడా మాట్లాడారా? మాట్లాడి ఉన్నట్టయితే అది మధ్యవర్తిత్వం కిందకు వస్తుంది కదా. (3) మే 9న మోదీతో 'ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని' ఉపాధ్యక్షుడు వ్యాన్స్ పంచుకున్నారా? అణ్వస్త్రాలను ప్రయోగిస్తామన్న పాకిస్థాన్ బెదిరింపునకు సంబంధించినదేనా ఆ సమాచారం? కానట్టయితే ప్రధానమంత్రి (మే 12), రక్షణ మంత్రి (మే 15) అణు బ్లాక్‌మెయిల్ గురించి ఎందుకు ప్రస్తావించారు? (4) మే 10న మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్‌ల డీజీఎమ్ఓలు కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చినట్టు ట్రంప్‌కు ఎలా తెలిసింది? ఆ విషయాన్ని అదే రోజు సాయంత్రం 5.25 గంటలకు తన ట్వీట్‌లో ఆయన ఎలా ప్రకటించారు? (5) ట్రంప్ ఏప్రిల్ 2న సుంకాల సమరాన్ని ప్రారంభించిన తరువాత భారత్ మారు ప్రతిపాదనలు పంపలేదా? ఉపాధ్యక్షుడు వ్యాన్స్ తన ఇండియా పర్యటనలో మోదీతో జరిపిన సంభాషణల్లో 'వాణిజ్య ఒప్పందం' విషయాన్ని ప్రస్తావించిందా? (6) భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం చేశామని, వాణిజ్యం అంశాన్ని ఉపయోగించుకుని కాల్పుల విరమణ పాటించేలా బలవంతం చేశామని ట్రంప్ పదే పదే చెప్పుతుండడంపట్ల అమెరికాకు ఇండియా నిరసన తెలిపిందా? పాకిస్థాన్‌కు ఐఎమ్ఎఫ్ రుణం మంజూరుకు సంబంధించిన సమావేశానికి ఇండియా ఎందుకు గైర్హాజరయింది? ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేయలేదు? ఇంకా వివిధ ప్రశ్నలు ఉన్నాయి. అయితే వాటిని ప్రస్తావించేందుకు తగిన సమయం ఆసన్నమవలేదు. డోనాల్డ్ ట్రంప్ ఎవరికీ లొంగే వ్యక్తి కాదు. భారత్, పాకిస్థాన్ ఘర్షణ వ్యవహారాలకు ఆయన దూరంగా ఉండరు, ఉండబోరు. ఇబ్బంది కలిగించే ప్రకటనలు చేస్తూనే ఉంటారు. ఇంకా అనేక ప్రశ్నలకు ఆస్కారమిచ్చే విపుల సమాచారాన్ని ఆయన తప్పకుండా ఇస్తారు. అది లేవనెత్తే ప్రశ్నలు అన్నిటికీ మనకు సమాధానాలు లభిస్తాయా? లేక మౌనమే సమాధానమా?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

తిరోగమనంలో పురోగామి భారత్!

భారత్, పాకిస్థాన్‌లు ఏకోదరులు. బ్రిటిష్ వలస పాలన నుంచి ఏకకాలంలో విముక్తమై స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించాయి. ఉమ్మడి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వారసత్వమున్నప్పటికీ ఎనిమిది దశాబ్దాల స్వతంత్ర అస్తిత్వంలో అవి భిన్న బాటలలో నడిచాయి. భారత ఆర్థిక వ్యవస్థ శీఘ్రగతిన అభివృద్ధి చెందింది. భారత్ తలసరి ఆదాయం పాకిస్థాన్ తలసరి ఆదాయం కంటే రెండు రెట్లు ఎక్కువ. ఇండియా సమైక్యంగా ఉన్నది. పాకిస్థాన్ 1971లో, అత్యధిక జనాభా ఉన్న తన తూర్పు విభాగాన్ని కోల్పోయింది. తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా ప్రభవించింది. ఇండియా విధిగా ప్రతి ఐదేళ్ల కొకసారి ఎన్నికలు నిర్వహిస్తోంది. అధికారానికి వివిధ రాజకీయ పార్టీలు తీవ్రంగా పోటీపడుతున్నాయి. పాకిస్థాన్‌లో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలి, ఫలితాలు ఎలా ఉండాలన్న విషయాన్ని సైనికాధికారులు నిర్ణయిస్తారు!

పాకిస్థాన్ కంటే ఇండియా ఎందుకు మెరుగ్గా, సమున్నతంగా ఉన్నది? తమ మత ఔన్నత్యం ఉత్కృష్టమైనది కనుక ఇస్లాంపై స్వతస్సిద్ధ, ఆధిక్యత కలిగి ఉన్నదని, ఇదే భారత్ సమున్నతికి కారణమని హిందూ మత దురభిమానులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. సత్యమేమిటి? అది భిన్నంగా ఉన్నది. భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య (భారత రిపబ్లిక్) పితామహులు, మాతృమూర్తులు మత దురభిమానాన్ని తోసిపుచ్చారు. మత ప్రాతిపదిక ఆధిక్యతావాదాలను తిరస్కరించారు. ఇదే మనలను పాకిస్థాన్‌కు భిన్నంగా ప్రగతిశీల బాటలో నిలిపింది. భారత రాజ్యాంగం పురాతన హిందూ రాజరిక పాలనా నమూనాలను తిరస్కరించింది. ఒక వ్యక్తి, ఒక ఓటు ఆధారంగా ఉండే రాజకీయ వ్యవస్థ వైపు మొగ్గు చూపింది. కుల అసమానతలు, జెండర్ వివక్షలతో ఘనీభవించిన సంప్రదాయ సామాజిక నిచ్చెన మెట్ల వ్యవస్థను గర్హించింది. మతాన్ని రాజ్యవ్యవస్థతో మిళితం చేసేందుకు నిర్ద్వంద్వంగా నిరాకరించింది. పాకిస్థాన్ అలా చేసినప్పటికీ భారత్ తన లౌకిక, ప్రజాస్వామిక విశ్వాసాలకు పూర్తిగా కట్టుబడిపోయింది. స్వతంత్ర భారతదేశ నాయకులు ఆధునిక విజ్ఞానశాస్త్రానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. సహేతుక ఆలోచనా ధోరణులను పెంపొందించారు. ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించారు.

భారత రిపబ్లిక్ సంస్థాపక విలువలు అయిన ప్రజాస్వామ్యం, బహుళత్వ వాదను ఇండియా సదా గౌరవించలేదు, అనుసరించ లేదు. 1975–77 అత్యవసర పరిస్థితి కాలంలో దేశ ప్రజలకు ప్రజాస్వామిక హక్కులు, పౌర స్వేచ్ఛలు లభించలేదు. కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు రాజ్యవ్యవస్థ హింసాకాండను చవి చూశాయి. మైనారిటీలపై మళ్లీ మళ్లీ దాడులు జరుగుతూనే ఉన్నాయి; విదేశీయులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. అయినప్పటికీ రిపబ్లిక్ సంస్థాపక విలువలు సుస్థిరంగా ఉన్నాయి. 1991లో లైసెన్స్–పర్మిట్–కోటా రాజ్ రద్దయిన దరిమిలా రెండున్నర దశాబ్దాలలో దేశంలో అద్వితీయమైన అభివృద్ధి జరిగింది. ఇండియా కనుక సంకుచిత ప్రాతిపదికలపై ప్రాంతాల వారిగా చీలిపోయినా, నిరంకుశ పాలనలో ఉండిపోయినా, లేక మత రాజ్యంగా పరిణమించినా ఆ అద్భుత ఆర్థిక ప్రగతి సాధ్యమయ్యేది కాదు.

ప్రచ్ఛన్నయుద్ధానంతర పరిస్థితులు ఆర్థిక పురోగతికి కల్పించిన అవకాశాలను పాకిస్థాన్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఎందుకని? దేశ రాజకీయాలలో సైన్యం జోక్యం పెరిగిపోవడం, పాకిస్థానీయుల దైనందిన జీవితాలలో ఛాందసవాద ఇస్లాం ప్రభావం పెరిగిపోవడమే అందుకు కారణాలు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడం, ఒసామా బిన్‌లాడెన్‌కు ఆశ్రయమివ్వడం, అణ్వస్త్రాల వ్యాప్తికి కీలకంగా తోడ్పడడం మొదలైనవి అంతర్జాతీయ సమాజంలో పాకిస్థాన్ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. భారత్, పాకిస్థాన్‌లు పూర్తిగా భిన్న బాటల్లో నడిచినప్పటికీ ప్రపంచ దేశాలు ఇప్పటికీ కొన్నిసార్లు రెండిటినీ ఒకే గాటన నిలబెడుతున్నాయి. ప్రతి విషయంలోను ఉభయ దేశాలను కలిపి ప్రస్తావిస్తున్నాయి! కశ్మీర్‌పై మూడు యుద్ధాలు జరగడమే అందుకొక ప్రధాన కారణం. అయితే ఈ శతాబ్ది తొలినాళ్ల నాటికి భారత్ అన్ని విధాల అసాధారణ పురోగతి సాధించడంతో 'ఇండో–పాక్' ప్రశ్నపై తర్జనభర్జనలు ఆగిపోయాయి. ఇండియా తన అద్భుత పురోగతితో పలప్రదంగా పాకిస్థాన్‌తో తనను కలిపి చూసే ధోరణుల నుంచి బయటపడింది. అదే సమయంలో ఇండియాను చైనాతో కలిపి ప్రస్తావించడం ప్రారంభమయింది. 'చిండియా' అనే భావన బాగా ప్రాచుర్యం పొందింది. అయితే ఇండియా ప్రజాస్వామిక సంప్రదాయాలు, బహుళత్వ వాద విలువల కారణంగా జపాన్, ఉత్తర అమెరికా, యూరోపియన్ దేశాల ప్రభుత్వాల, ప్రజల, మదుపుదారుల మద్దతును విశేషంగా పొందింది.



తమ పౌరులకు మెరుగైన జీవన స్థితిగతులను సమకూర్చడంలో పాకిస్థాన్ కంటే ఇండియా అన్ని విధాల ఉన్నతస్థాయిలో ఉందనడంలో సందేహం లేదు. అయినప్పటికీ మనకు మనం ఒక ప్రశ్న వేసుకునితీరాలి: ఇటీవలి సంవత్సరాలలో మనం తిరోగమించలేదూ? అమెరికా పూర్వ అధ్యక్షులు జార్జి బుష్, బరాక్ ఒబామా, జో బైడెన్ ఎప్పుడైనా భారత్, పాకిస్థాన్‌లను జోడించి ప్రస్తావించారా? కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం నెరపుతామని ప్రతిపాదించారా?

అయితే ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడి, దానికి మన ప్రభుత్వ ప్రతిస్పందన ఫలితంగా భారత్, పాకిస్థాన్‌ల గురించి కలిపికట్టుగా మాట్లాడడం మళ్లీ ప్రారంభమయింది. భారత్ సమున్నతిని తక్కువ చేసే విధంగా హైఫనేషన్‌ను మళ్లీ ఉపయోగిస్తున్నారు. భారత్, పాకిస్థాన్ అని విడివిడిగా కాకుండా భారత్–పాకిస్థాన్ అని ప్రస్తావిస్తున్నారు! భారత్, పాకిస్థాన్‌లు సమ స్థాయి దేశాలు అన్నట్టుగా డోనాల్డ్ ట్రంప్ స్పష్టాతి స్పష్టంగా మాట్లాడటం ప్రారంభించారు ఆ రెండూ 'గొప్ప' దేశాలనీ, రెండిటితోను తనకు మంచి సంబంధాలు ఉన్నాయనీ, కాల్పుల విరమణకు ఇరు దేశాల నాయకులను ఒప్పించానని, సరైన తీరులో ఉంటే వాణిజ్యం కొనసాగిస్తానని చెప్పానని ట్రంప్ వెల్లడించారు. పుండు మీద కారం చల్లినట్లుగా కశ్మీర్‌పై 'వెయ్యి' సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధం విషయమై రెండు దేశాల మధ్య రాజీ కుదిర్చేందుకు మధ్యవర్తిత్వం నెరపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ట్రంప్ తెలిపారు.

ట్రంప్ వాచాలుడు, అహంకారి, చంచల స్వభావి. అయితే ప్రపంచ అతి సంపన్న, మహాశక్తిమంతమైన దేశానికి అధ్యక్షుడు. ఆ దేశంతో మనకు కీలకమైన ఆర్థిక, రాజకీయ సంబంధాలు ఉన్నాయి. కనుక ఆయన మాటలు ఎంత ఆషామాషీగా ఉన్నప్పటికీ మనం గంభీరంగా వినాలి. వాటిపై ఆలోచించాలి. అయితే అంతర్జాతీయ మీడియా జగత్తులో భారత్, పాకిస్థాన్‌లను హైఫన్ (భారత్–పాకిస్థాన్)తో ప్రస్తావించడాన్ని ఉపేక్షించకూడదు. ఈ నెల 10వ తేదీన భారత్, పాకిస్థాన్‌ల మధ్య చెలరేగుతున్న ఘర్షణల నేపథ్యంపై 'ఫైనాన్షియల్ టైమ్స్' ఒక విపుల కథనాన్ని ప్రచురించింది. దాని శీర్షిక : 'Two religious strongmen clash' ప్రస్తావిత ఇద్దరు వ్యక్తులు అసీమ్ మునీర్, నరేంద్ర మోదీ!

తమ పౌరులకు మెరుగైన జీవన స్థితిగతులను సమకూర్చడంలో పాకిస్థాన్ కంటే ఇండియా అన్ని విధాల ఉన్నతస్థాయిలో ఉందనడంలో సందేహం లేదు. అయినప్పటికీ మనకు మనం ఒక ప్రశ్న వేసుకునితీరాలి: ఇటీవలి సంవత్సరాలలో మనం తిరోగమించలేదూ? అమెరికా పూర్వ అధ్యక్షులు జార్జి బుష్, బరాక్ ఒబామా, జో బైడెన్ ఎప్పుడైనా భారత్, పాకిస్థాన్‌లను జోడించి ప్రస్తావించారా? కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం నెరపుతామని ప్రతిపాదించారా? మన్మోహన్‌సింగ్, నరసింహారావు, రాజీవ్‌గాంధీ, దేవెగౌడ లేదా అటల్ బిహారి వాజపేయిలలో ఎవరినైనా Religious strongman' అని ఫైనాన్షియల్ టైమ్స్ ఎప్పుడైనా ప్రస్తావించిందా?



■ రామచంద్ర గుహ

గతానుగతం

నిజానికి ఇండియా గత దశాబ్దంలో తిరోగమించిందని ఒక చరిత్రకారుడుగా, ఒక పౌరుడుగా నేను సునిశ్చితంగా వాదిస్తాను. ఇప్పటికీ మనం జాతీయ స్థాయిలోను, రాష్ట్రాల స్థాయిలోను ఎన్నికలను క్రమబద్ధంగా నిర్వహిస్తున్నాము. అయితే ఆ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, సక్రమంగా జరుగుతున్నాయా అనే విషయమై న్యాయసమ్మతమైన సంశయాలు ఉన్నాయి. మీడియా చాలవరకు ప్రభుత్వ ప్రచారానికి ఒక ప్రధాన ఆలంబనగా ఉపయోగపడుతోంది. రెగ్యులేటరీ, దర్యాప్తు సంస్థలు అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల గవర్నర్లు జాతీయ పాలక పక్షానికి అనుకూలంగా ఉంటూ సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తున్నారు. ప్రధానమంత్రి వ్యక్తిపూజ బ్రహ్మాండంగా వర్ధిల్లుతోంది– ప్రజల సొమ్ముతో సుమా! ఈ ఆరాధనా భావం మన ప్రజాస్వామ్య ప్రమాణాలను మరింతగా భ్రష్టుపరిచింది.

మన ప్రజాస్వామ్యం అంతకంతకూ మరింత లోపభూయిష్టమవుతోంది. మన లౌకికవాద, బహుళత్వవాద విలువలపై దాడులు తీవ్రమవుతున్నాయి. ఇటీవల పాకిస్థాన్‌తో సంఘర్షణ సమయంలో అధికారప్రతినిధిగా ఒక ముస్లిం మహిళా సైనికాధికారిని నియమించడంలో ఉన్న ప్రతీకాత్మక విలువ, ఒక సీనియర్ బీజేపీ నాయకుడు ఆమెను అగౌరవపరుస్తూ చేసిన వ్యాఖ్యలతో, వ్యర్థమైపోయింది. ఇటీవలి సంవత్సరాలలో నోయిడా మీడియా, హిందూత్వవాదులు ఉధృతం చేసిన ముస్లిం వ్యతిరేక విష ప్రచారం రాబోయే నెలల్లో తగ్గిపోతుందో లేదో వేచి చూడవలసి ఉంది. పహల్గాం ఉగ్రవాద దాడి దరిమిలా కశ్మీర్ లోయలో అనేక మందిని అకారణంగా అరెస్ట్ చేశారు. పలువురి గృహాలను బుల్డోజర్‌తో కూల్చివేశారు. కశ్మీరీలకు సంతోషప్రదమైన భవిష్యత్తును, అవి సూచిస్తున్నాయా?

పహల్గాం ఘటన, దాని పర్యవసానాల పట్ల అంతర్జాతీయ సమాజం ప్రతిస్పందనలు మనకు నేర్పుతున్నదేమిటి? భారత్‌ను పాకిస్థాన్‌తో జోడించి మాట్లాడేందుకు మళ్లీ జరుగుతున్న ప్రయత్నాలకు మనమెలా ప్రతిస్పందించాలి? నిరాలోచనపరుడు అయిన యుద్ధోన్మాది 'అర్బన్ నక్సల్స్'ను నిందిస్తాడు. బాధితుడి మనస్తత్వాన్ని ప్రదర్శిస్తాడు. ఆ తరువాత ఇండియా ఇప్పుడూ ఎప్పుడూ విశ్వగురుగా ఉండిపోతుందని ప్రకటిస్తాడు. ఆలోచనాశీలి అయిన దేశభక్తుడు ఆత్మపరిశీలన చేసుకోవడం ప్రారంభిస్తాడు. నిరంకుశ పాలనా ధోరణులు, మెజారిటేరియనిజం పెచ్చరిల్లిపోవడాన్ని గత దశాబ్దం చూసింది. ఇదే ఇండియాను పొరుగుదేశంతో పోల్చేందుకు పురిగొల్పుతోంది. కనుక మనం జాగ్రత్తగా ఆత్మపరీక్ష చేసుకోవాలి. మన రిపబ్లిక్ సంస్థాపక విలువలు అయిన ప్రజాస్వామ్యం, బహుళత్వవాదంకు పునరంకితమయ్యేందుకు కాలం మించి పోయిందా అనే ప్రశ్న వేసుకోవాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

పోరుపాటల జలపాతం.. కలేకూరి

ముత్రిబ్ సెకహో ఆజ్ ఇస్ అందాజ్ సే గాయె
హర్ దిల్ కొ లగే చోట్ సే, హర్ ఆంఖ్ భరాయే


"అందరి కళ్ళు అశ్రువులతో నిండేలా, హృదయాలను కదిలించేలా గానం చేయమని ఆ గాయకునికి చెప్పండి" అని ఫిరాఖ్ గోరక్ పూరీ అన్నట్లుగా... కరుణ వీరంతో ప్రతినిత్యం కవితాగానం చేసిన అరుదైన ప్రజాకవి కలేకూరి ప్రసాద్. వెలివాడలో రగిలే కన్నీటి మంటల నిప్పురవ్వలతో వర్తమాన సాహిత్యాన్ని వెలిగించి, అంటరాని బతుకుల్లో పిడికెడు ఆత్మగౌరవాన్ని ప్రసరించిన సాంస్కృతిక సమరయోధుడు ఆయన. "నేను జనసమూహాల గాయాన్ని/ గాయాల సమూహాన్ని" అంటూ తన సృజన నైజాన్ని ప్రకటించి దళిత, బహుజన, ఆదివాసీ సమూహాల గాయాలకు గొంతునిచ్చి మూడు దశాబ్దాల పాటు పీడిత ప్రజావాణిని వినిపించిన కవన పిల్లనగ్రోవి కలేకూరి. అందుకే గాయాలనే స్వర మాతృకలుగా మార్చుకొని విప్లవ, దళితోద్యమాల దారిలో పెను చేతనా ప్రవాహమై, పోరుపాటల జలపాతమై ప్రతిధ్వనించాడు. అధికార పీఠాలకు, అధినాయకత్వానికి రచయిత శాశ్వత ప్రతిపక్షంగా వ్యవహరించాలని చెప్పిన కలేకూరి, అత్యంత ప్రభావశీలమైన, స్ఫూర్తివంతమైన సాహిత్యాన్ని సృష్టించాడు. పాత్రికేయునిగా, కవిగా, విమర్శకునిగా, అనువాదకునిగా కలేకూరి నిశితమైన దార్శనిక దృష్టితో ఈనాటి అస్తిత్వ ఉద్యమాల విస్తృతికి, తదనుగుణమైన సాహిత్యపరిపుష్టికి 'పెన్నుదన్ను'గా నిలిచాడు.

యువక, శబరి, నవత, కవన తదితర కలం పేర్లతో ప్రసిద్ధమైన కలేకూరి దేవవర ప్రసాద్.. లలితా సరోజినీ, శ్రీనివాసరావు దంపతులకు 1962 అక్టోబర్ 25న కృష్ణా జిల్లా కంచికచర్లలో జన్మించాడు. డిగ్రీ చదువుతున్నప్పుడే రాడికల్ విద్యార్థి సంఘ రాజకీయాల వైపు ఆకర్షితుడై కొంతకాలం ప్రజాయుద్ధ తీరాల్లో సంచరించాడు. విప్లవోద్యమ కార్యకలాపాలకు అరుణోత్తేజంతో అంకితమయ్యాడు. కారంచేడు, చుండూరు సంఘటనల నేపథ్యంలో కలేకూరి ప్రస్థానం గుణాత్మకమైన మలుపు తిరిగింది. 'దళిత మహాసభ' రగిలించిన ఆత్మగౌరవ పోరాటాన్ని అందిపుచ్చుకొని అణగారిన జీవితపు సన్నని సందుల్లోకి చొచ్చుకొని పోయాడు. బహుజన సమాజ్ పార్టీ ఇచ్చిన పిలుపుతో ప్రత్యక్ష రాజకీయాల బరిలో దిగి, ఓటుబ్యాంకు లావాదేవీలు భరించలేక ఓటమి పాలయ్యాడు. ఎవరికీ తలవంచని, ఎక్కడా రాజీపడని ధీరోదాత్తగుణం ఆయన సొంతం. కత్తి పద్మారావుతో కలిసి నడిచినా, కె.జి సత్యమూర్తి వెంట సాగినా, కాన్షీరామ్‌తో రాజకీయ కరచాలనం చేసినా కలేకూరి ఎప్పుడూ ఎవరినీ గుడ్డిగా అనుసరించలేదు. త్వరత్వరగా రాయాల్సింది రాసి, సత్వరం చేయాల్సింది చేసి 2013, మే 17న సెలవంటూ వెళ్లిపోయాడు.

విప్లవోద్యమ నేపథ్యం, విప్లవ సాహిత్యభావజాల వెలుగుల్లో కలేకూరి ప్రజాసాహిత్యం దిశగా చూపు సారించాడు. 'యువక' పేరుతో ఆయన రాసిన పాటలు అనేక ప్రజాస్వామ్య పోరాటాలకు సాంస్కృతిక సామర్థ్యాన్ని అందించాయి. సంఘటనకు సంబంధించిన మౌలిక రాజకీయాలను సూక్ష్మంగా విశ్లేషిస్తూ, బాధితుల భావోద్వేగాలను పరమ ఆర్ద్రంగా ఆవిష్కరిస్తూ ఉద్యమ గీతాలను రచించటంలో ప్రసాద్ ఎంతో చాతుర్యాన్ని ప్రదర్శించాడు. రచయితగా ప్రారంభ దశలోనే కలేకూరి రాసిన 'కర్మభూమిలో పూసిన ఓ పువ్వా!' అనే పాట ప్రజల గుండెగొంతుల్లో జీవనాదమై ఈనాటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంది. 'భూమికి పచ్చని రంగేసినట్టు', 'కుమిలిపోయినా నలిగిపోయినా', 'పల్లెపల్లెనా దళిత కోయిల', 'దళితాకాశపు ధృవతార' లాంటి హృద్యమైన పాటల ద్వారా కలేకూరి సాహిత్య, సాంస్కృతిక రంగాలపై చెరగని ముద్ర వేశాడు. కారంచేడు మారణకాండ నేపథ్యంలో తన మిత్రులతో కలిసి కలేకూరి రాసిన ఒగ్గుకథ ఈ ఉద్యమానికి ఎంతో ఉత్తేజాన్ని అందించింది.

దళితోద్యమం, దళిత సాహిత్యంలో మిగిలిపోయిన ఖాళీలను ప్రసాద్ సమర్థవంతంగా పూరించాడు. ఈ దిశగా ఆయన వెలువరించిన 'దళిత సాహిత్యం' (1993–దళిత స్త్రీ సాహిత్య పరిషత్) 'దళితకిరణాలు' (1996–లోకాయిత ప్రచురణలు) ఎంతో ప్రాముఖ్యత కలిగినవి. దళితవాద చారిత్రక నేపథ్యాన్ని విశ్లేషిస్తూ ఆయన రాసిన 'దళిత సాహిత్యం' అనే లఘుగ్రంథం చాలా విలువైనది. ఇది దళిత సాహిత్య విమర్శకు, పరిశోధనకు ఉపయుక్త గ్రంథం. బుద్ధుడు, కబీర్, జ్యోతిబా పూలే, నారాయణగురు, పెరియార్, అంబేడ్కర్ లాంటి దళిత తాత్త్విక, సాంస్కృతిక యోధుల బృహత్తరమైన కృషిని, వివేచిస్తూ 'దళితరాజ్యం' పత్రికలో ధారావాహికగా వెలువడిన కలేకూరి వ్యాసపరంపరకు పాఠకుల నుంచి గొప్ప స్పందన లభించింది. 'దళిత కిరణాలు' పేరుతో వెలువడిన ఈ వ్యాస సంకలనం దళితోద్యమ కార్యకర్తలకు కరదీపికలా ఉపయోగపడుతుంది. 'పిడికెడు ఆత్మగౌరవం' నుండి 'అతడొక నిబద్ధ వజ్రాక్షరం' వరకు కలేకూరి రాసిన కవితలు ఉన్నతమైనవి. నామాడి శ్రీధర్ సంపాదకత్వంలో వచ్చిన కలేకూరి కవితా సంకలనం 'అంటరాని ప్రేమ' (2021) కవిగా ఆయన ప్రతిభను అర్థం చేసుకోటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

రగిలే కన్నీటి మంటల నిప్పురవ్వలతో వర్తమాన సాహిత్యాన్ని వెలిగించి, అంటరాని బతుకుల్లో పిడికెడు ఆత్మగౌరవాన్ని ప్రసరించిన సాంస్కృతిక సమరయోధుడు కలేకూరి ప్రసాద్. అధికార పీఠాలకు, అధినాయకత్వానికి రచయిత శాశ్వత ప్రతిపక్షంగా వ్యవహరించాలని చెప్పిన ఆయన, అత్యంత ప్రభావశీలమైన, స్ఫూర్తివంతమైన సాహిత్యాన్ని సృష్టించాడు.



అనువాదకునిగా కలేకూరి ప్రసాద్ చారిత్రాత్మకమైన కృషి చేశాడు. డిగ్రీ కూడా పూర్తి చేయని ఆయన అపారమైన భాషా పాండిత్యంతో, మేధో శక్తితో అనేక గ్రంథాలు తెలుగులోకి తర్జుమా చేసి అనువాదకునిగా తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్నాడు. పాబ్లో నెరుడా, అరుంధతీరాయ్, మహాశ్వేతా దేవి, గెయిల్ ఆమ్వెత్, స్వామి ధర్మతీర్థ, దయా పవార్, రవీంద్రనాథ్ ఠాగూర్, నాన్దేవ్ ధసాల్, వందనా శివ లాంటి మహోన్నత సాహితీవేత్తల రచనల్ని సగటు పాఠకుడి అవగాహనా సామర్థ్యానికి అనుగుణంగా అనువాదం చేసి, తెలుగు సాహిత్యసౌధానికి నవీన జ్ఞానగవాక్షాలను అమర్చాడు. దళితవాదం దగ్గరే ఆగిపోకుండా ఇతర ప్రజాస్వామ్య ఉద్యమాలకు, అంతర్జాతీయ విముక్తి పోరాటాలకు మద్దతు ప్రకటించాడు కలేకూరి. మాదిగ దండోరా ఉద్యమానికి సంఘీభావం తెలియజేసి, నాయకుల్లోని మాల వ్యతిరేక ధోరణుల్ని నిర్మొహమాటంగా విమర్శించాడు. 'నీది ధర్మపోరాటం/ నీ రణక్షేత్రానికి నా శ్వాస కాపలాగా పెడుతున్నానని' తెలంగాణ ప్రజల చేతిలో చేయి వేసి బాస చేశాడు.

వైఫల్యమంటే ఆస్తుల్ని సంపాదించలేకపోవటం కాదని, ఉద్యమానికి చేయూతనందించలేకపోవటమే ఘోర వైఫల్యమని కలేకూరి గొప్ప తీర్పు చెప్పాడు. "నేను మొదట మార్క్సిజమే ఏకైక మార్గమని నమ్మా. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను చదివాక, ఆయన సిద్ధాంతం ఆసరా లేనిదే ఈ దేశంలో దళిత, బహుజన విముక్తి సాధించలేం" అన్న స్పష్టమైన తాత్త్వికతతో తన రచనా రీతిని మరింత మెరుగుపరుచుకున్నాడు కలేకూరి. అంబేడ్కర్ ప్రాసంగికతను తన వ్యాసాల ద్వారా ప్రామాణికంగా నిరూపించాడు. బుద్ధుడు, అశోకుడు, అంబేడ్కర్, కాన్షీరామ్‌లు అందించిన ఉమ్మడి రాజకీయ చైతన్యాన్ని కలేకూరి ఎంతో సమతౌల్యంతో తన రచనల్లో వ్యాఖ్యానించాడు. వివిధ సందర్భాల్లో కలేకూరి రాసిన రాజకీయ, సాహిత్య వ్యాసాలతో వెలువడిన 'పిడికెడు ఆత్మగౌరవం' గ్రంథం ఎంతో విలువైనది. ఈ వ్యాససంకలనం చదువుతుంటే తరతరాల బతుకు సంకెళ్ళు తెగుతున్న చప్పుడు వినిపిస్తుంది. దళిత చైతన్య రథచక్రాలు కదులుతున్న సవ్వడి ధ్వనిస్తుంది. మనోహరమైన కలేకూరి వచన విన్యాసం పాఠకుల్ని పరవశింపజేస్తుంది. ఏ నిర్మాణాల్లోను, జీవన చట్రాల్లోను ఇమడని విలక్షణ వ్యక్తిత్వం కలేకూరిది. కీర్తిప్రతిష్ఠల్ని బద్ధ శత్రువులుగా భావిస్తాడు. స్థిరత్వాన్ని, క్రమశిక్షణను చూసి చిరాకుపడతాడు. సంచారాన్ని సదా ఇష్టపడతాడు. ఓపికతో రాసి పారేయటం తప్ప, దేన్నయినాసరే భద్రపరచటం తెలియని సాహిత్య బైరాగి ఆయన. ఫాసిజానికి వ్యతిరేకంగా బలమైన రాజకీయ, సాంస్కృతిక ఉద్యమం నిర్మించాలని కలేకూరి కన్న కలని సాకారం చేయాల్సిన అవసరమెంతైనా ఉంది.

■ డాక్టర్ కోయి కోటేశ్వరరావు

(నేడు కలేకూరి ప్రసాద్ వర్ధంతి; రేపు విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో సాయంత్రం 5.00 గంటలకు సభ)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

శనివారం 17 మే 2025



కనరో.. కీర్తి పతాక

నగరంలో ఘనంగా తిరంగా ర్యాలీ

- ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కీర్తిస్తూ యాత్ర
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి
- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు



ర్యాలీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, పురందేశ్వరి

బందరురోడ్డులో తిరంగా ర్యాలీ







ర్యాలీలో ఎమ్మెల్యేలు గద్దె, బొండా ఉమా, టీడీపీ నేత నెట్టెం రఘురాం, ఎంపీ కేశినేని చిన్ని, మంత్రులు నాదెండ్ల, సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



దేశభక్తిని చాటిన సాంస్కృతిక ప్రదర్శనలు

భారత కీర్తి పతాకం రెపరెపలాడింది. వందేమాతర జేజేలతో విజయవాడ వెల్లివిరిసింది. జైహింద్.. జైజవాన్.. నినాదాలతో ఎల్లడెలా దేశభక్తి మార్మోగింది. 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని కీర్తిస్తూ నగరంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన భారత శౌర్య తిరంగా ర్యాలీకి విశేష స్పందన లభించింది. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా పౌరులు ఈ ర్యాలీలో పాల్గొని మనదేశ ఔన్నత్యాన్ని చాటారు. బందరురోడ్డులో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన యాత్ర బెంజిసర్కిల్ వరకూ సాగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి జాతీయ జెండాలతో యాత్ర ముందు సాగగా, ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గేయాలాపనలు మన సైనికుల వీరపరాక్రమాలను తెలియజేశాయి. - వివరాలు 6లో

తొలగింపు తాత్సారం

హోల్‌సేల్ పూల మార్కెట్ తరలింపులో కార్పొరేషన్ నిర్లక్ష్యం

రైల్వేస్థలంలో నిర్మాణం.. నోటీసులు ఇచ్చిన రైల్వే అధికారులు

నగరంలోని పూల మార్కెట్ తరలింపుపై సందిగ్ధం ఏర్పడింది. కీలకమైన ప్రాంతంలో ట్రాఫిక్‌కు అవరోధంగా మారడం, స్థలం రైల్వేది కావడం, కృష్ణా పుష్కరాల నాటికి దీనిని ఖాళీ చేయించాలనే ప్రతిపాదనలు ఉండటం, విజయవాడ-గూడూరు థర్డ్‌లైన్, మెట్రో కారిడార్ దీని పక్క నుంచే వెళ్తుండటంతో మార్కెట్ తరలింపు అనివార్యంగా మారింది. తమకు ప్రత్యామ్నాయం చూపించి, షాపులు తొలగించాలని వ్యాపారులు కోరుతున్నా కార్పొరేషన్ అధికారులు మాత్రం తాత్సారం ప్రదర్శిస్తున్నారు.

- థర్డ్‌లైన్ పనులు, మెట్రో కారిడార్, పుష్కరాల నేపథ్యంలోనే..
- నగర నడిబొడ్డులో ట్రాఫిక్‌కు ప్రధాన అవరోధం
- ప్రత్యామ్నాయం చూపిస్తే వెళ్లిపోతామంటున్న వ్యాపారులు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ పక్కన, విజయవాడ మెయిన్ రైల్వేలైన్ వెంబడి, రాజీవ్‌గాంధీ పార్కు వెనుక భాగంలో, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయానికి దగ్గరగా రైల్వేస్థలంలో హోల్‌సేల్ పూల మార్కెట్ ఉంది. దీనిని 2004లో కార్పొరేషన్ అధికారులు నిర్మించారు. దశాబ్దం కిందట ఈ పూల మార్కెట్ రాష్ట్రంలోనే ఓ వెలుగు వెలిగింది. విశాఖపట్నం నుంచి కూడా ఇక్కడికి వచ్చి పూలను పెద్ద ఎత్తున కొనేవారు. విజయవాడ విస్తరించటంతో ఈ మార్కెట్ సృష్టిస్తున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ట్రాఫిక్ సమస్య ప్రధానంగా ఉంది.

ఖాళీ చేయాలని రైల్వే ఆదేశాలు

రైల్వే ఆక్రమిత స్థలంలో కార్పొరేషన్ అధికారులు హోల్‌సేల్ పూల మార్కెట్‌ను నిర్మించటంతో అప్పట్లో సమస్యలు ఏర్పడ్డాయి. తమ స్థలంలో పూల మార్కెట్‌ను నిర్మించారని 2017వ సంవత్సరంలో రైల్వే అధికారులు కార్పొరేషన్‌కు నోటీసులిచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మార్కెట్ తరలింపుపై తరచూ రైల్వే అధికారులు కార్పొరేషన్‌కు నోటీసులు ఇస్తూనే ఉన్నారు. ఏడాది కిందట రైల్వే అధికారులు కార్పొరేషన్‌కు నోటీసులు ఇస్తూ.. ఈసారి తరలించకపోతే కూల్చివేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏడాది గడిచినా చర్యలు తీసుకోకపోవడంతో రైల్వేశాఖ కార్యాచరణలోకి దిగుతోంది. ఇప్పటికే ఆర్టీసీ ఆక్రమణలు తొలగించి భారీ గోడను నిర్మిస్తున్న రైల్వే.. రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను కూడా తరలించింది. ఇక మిగిలింది పూల మార్కెట్ ఒక్కటే.

తొలగింపు అవసరమే..

పూల మార్కెట్‌ను తొలగించటం రైల్వే అధికారులు అత్యవసరం. ఎందుకంటే విజయవాడ-గూడూరు మూడోలైన్ పనులను కృష్ణా కెనాల్ జంక్షన్ దాటి విజయవాడ రైల్వేస్టేషన్ వరకు జరపాలంటే మార్కెట్‌ను తొలగించాల్సి ఉంటుంది. కిందటి కృష్ణా పుష్కరాల సందర్భంలో ఈ మార్కెట్‌ను తరలించటానికి కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. గాంధీనగర్ రైతుబజార్ ప్రాంతంలోకి తరలించేందుకు సిద్ధమైంది. అప్పట్లో హోల్‌సేల్ మార్కెట్ అసోసియేషన్‌లో సభ్యుల మధ్య ఐక్యత లేకపోవటంతో అడుగు ముందుకు పడలేదు. పుష్కరాలు సమీపించే సమయానికి కార్పొరేషన్ ఈ అంశాన్ని వదిలేసింది. మరో మూడేళ్లలో మళ్లీ కృష్ణా పుష్కరాలు రానున్నాయి. ఏడాది ముందే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాల్సి ఉంటుంది. కాబట్టి వచ్చే రెండేళ్లలోనే దీనిని తరలించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. మెట్రోరైల్ కారిడార్ కూడా ఈ పూల మార్కెట్ సమీపం నుంచే కృష్ణా కెనాల్ జంక్షన్‌కు వెళ్తుంది. కాబట్టి త్వరలోనే ఈ మార్కెట్‌ను తరలించాల్సిన అవసరముంది.

ప్రత్యామ్నాయంగా పలు ప్రాంతాలు

తమకు ప్రత్యామ్నాయంగా స్థలం చూపించి, షాపులు ఏర్పాటుచేసి ఇవ్వాలని హోల్‌సేల్ మిగతా 6లో..

దుర్గగుడి ఘాట్‌రోడ్డు మూసివేత



ఇంద్రకీలాద్రి, మే 16 (ఆంధ్రజ్యోతి) : గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఉరుములు, మెరుపులతో వచ్చిన గాలివాన కారణంగా దుర్గగుడి ఘాట్‌రోడ్డును మూసివేయించారు. భక్తుల వాహనాలను దారి మళ్లించారు. కనకదుర్గానగర్ మీదుగా మహామండపం ద్వారా అనుమతించారు. ఎండల్లో భక్తులు సేదతీరేందుకు కనకదుర్గానగర్‌లో వేసిన తాత్కాలిక టెంట్లు కూడా వర్షానికి కూలిపోయాయి.

జిల్లా జైలు సూపరింటెండెంట్‌పై వేటు

హంసపాల్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు

వైసీపీ వీరవిధేయుడిగా పేరు

- జైల్లోని సమాచారం తాడేపల్లి ప్యాలెస్‌కు..
- ఆరోపణలు పెచ్చుమీరడంతో ప్రభుత్వ చర్యలు
- ఆ స్థానంలో మహ్మద్ ఇర్ఫాన్ నియామకం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ జిల్లాజైలు సూపరింటెండెంట్ హంసపాల్‌పై వేటు పడింది. ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో పోస్టింగ్ ఇస్తూ, నెల్లూరులోని శిక్షణా కేంద్రానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లాలో సబ్‌జైళ్ల అధికారిగా ఉన్న మహ్మద్ ఇర్ఫాన్‌కు పదోన్నతి కల్పించి నియమించారు.

అప్పుడు ఒకలా.. ఇప్పుడు ఒకలా..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు హంసపాల్ విజయవాడ జిల్లా జైలుకు సూపరింటెండెంట్‌గా మిగతా 6లో..

వైసీపీకి వీర విధేయుడు

వైసీపీ అధినేత జగన్‌కు హంసపాల్ వీరభక్తుడిగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన్ను పనిగట్టుకుని ఇక్కడికి తీసుకొచ్చారు. ప్రస్తుతం విజయవాడ జిల్లాజైలు వైసీపీ వీరవిధేయులతో నిండిపోయింది. ఇక్కడ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ఐపీఎస్ అధికారి పి.సీతారామాంజనేయులు, మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పీఏ దిలీప్, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వివిధ కేసుల్లో వైసీపీ విధేయులు ఒక్కొక్కరుగా జైలుకు వెళ్లడం మొదలైన తర్వాత హంసపాల్‌పై ఆరోపణలు పెరిగాయి. ఇక్కడి నుంచి ప్రతి చిన్న సమాచారం తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయానికి చేరుతున్నట్టు ప్రభుత్వం పసిగట్టింది. తానెంతో నిజాయితీపరుడినని చెప్పుకొనే హంసపాల్ జైల్లో ప్రతి పనినీ అత్యంత రహస్యంగా కానిస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి.



బీడీసీపై గండ్లు పడిన చోట రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు

బుడమేరు ప్రక్షాళన ప్రారంభం

భారీ గండ్ల ప్రాంతంలో బీడీసీకి రక్షణ గోడ

- పనులు ప్రారంభించిన మంత్రి నిమ్మల
- జూన్ 10 నాటికి పూర్తిచేసే అవకాశం
- వెలగలేరు నుంచి సమాంతరంగా మరో కాల్వ

ఇబ్రహీంపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు వరద నుంచి శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం తొలి అడుగు వేసింది. రూ.28 కోట్లు కేటాయించి గండ్లు పడిన చోట అర కిలోమీటర్ మేర రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల ప్రారంభించారు. ప్రస్తుతం పనులు చురుగ్గా మిగతా 6లో..

ఇళ్ల పట్టాల చెరలో..

2019లో పేదలను మోసం చేసిన వల్లభనేని వంశీ

ఇప్పటికే లెక్కకుమించిన కేసుల్లో చిక్కుకుని జైలు జీవితం అనుభవిస్తున్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ మెడకు నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసు కూడా చుట్టుకుంది. ఓట్లే ఎరగా, పేదలను మభ్యపెట్టి నాడు ఎమ్మెల్యే స్థానంలో ఉండి వంశీ చేసిన ఈ నకిలీ పట్టాల కేసులో ఈనెల 29 వరకు నూజివీడు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రిమాండ్ విధించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ మొదలైంది.

- నియోజకవర్గవ్యాప్తంగా 1,200 నకిలీ పట్టాలు అందజేత
- ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఇష్టానుసారంగా..
- ఎన్నికలు పూర్తయ్యాక నకిలీ వ్యవహారం వెలుగులోకి..
- పట్టాలు వెనక్కి తీసేసుకున్న వంశీ అనుచరులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్ నరసింహారావు
- వైసీపీ హయాంలో స్తబ్దుగా ఉన్న కేసు
- తాజా పరిణామాల్లో ఈనెల 29 వరకు రిమాండ్




హనుమాన్ జంక్షన్ రూరల్, ఆంధ్రజ్యోతి : 2019 ఎన్నికల సమయంలో నాటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలంలో పెరికీడు, కోడూరుపాడు, కొయ్యూరు, బాపులపాడు గ్రామాల్లో సుమారు 400కు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత ఏప్రిల్‌లో పేదలను మభ్యపెట్టేలా ఈ పట్టాలు అందజేశారు. ఆ తర్వాత ఆ పట్టాలన్నీ నకిలీవనే విషయం బయటపడింది. అయితే, ఆ ఇళ్ల పట్టాలు చట్టబద్ధంగా మంజూరు కాలేదని, అవన్నీ నకిలీ పట్టాలేనని నాటి తహసీల్దార్ కలగర గోపాలకృష్ణ పేరును, తహసీల్దార్ కార్యాలయ సీల్‌ను దుర్వినియోగం చేస్తూ కల్పించిన పట్టాలుగా రెవెన్యూ శాఖ దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత 2019, అక్టోబరు 16న తహసీల్దార్ నరసింహారావు హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో అసలు తమకిచ్చిన పట్టాలు నిజమైనవా, కాదా అనే అయోమయంలో లబ్ధిదారులు తలలు పట్టుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరికి జగనన్న కాలనీల్లో పట్టాలు కేటాయించామని చెప్పడంతో ఏదో రకంగా ఇంటి స్థలం వస్తుందిలే అని ఆనందపడ్డామని పెరికీడు, కొయ్యూరుకు చెందిన మహిళా లబ్ధిదారులు తెలిపారు. ఇప్పటికీ పెరికీడు, కొయ్యూరు, కోడూరుపాడు గ్రామాల్లో మిగతా 6లో..

నిరుపయోగంగా..

- పదేళ్లుగా ఎవరికీ కేటాయించని ప్రభుత్వాలు
- ఆకతాయిలకు అడ్డాగా గృహాలు.. మొక్కలు మొలిచి శిథిలావస్థలో సింగ్‌నగర్ ఇళ్లు

8లో

భూసార పరీక్షల నిర్వహణలో జాప్యం



- జిల్లాలోని అన్ని మట్టి నమూనాలకు గొల్లపూడి కేంద్రంలోనే పరీక్షలు
- నందిగామలో కేంద్రం ఉన్నా వినియోగించని అధికారులు
- వచ్చే నెల నుంచి తొలకరి
- ఎప్పటికి రిపోర్టులిస్తారని ప్రశ్నిస్తున్న రైతులు





ఉప్పొంగిన దేశభక్తి..







మీ వెంట మేమున్నాం

త్రివిధ దళాలకు.. సెల్యూట్

మీ శౌర్యానికి మా ప్రణామాలు

- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా 'భారత శౌర్య తిరంగా యాత్ర'
- దేశభక్తితో పులకించిన మహాత్మాగాంధీ రోడ్డు
- భారత్ మాతాకీ జై.. వందేమాతరం అంటూ నినాదాలు
- ఉగ్రదాడికి వ్యతిరేకంగా వేలాదిగా కదిలి వచ్చిన జనం
- ముందుండి నడిపించిన సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్
- యువత, మాజీసైనికులు, మహిళలతో ర్యాలీ విజయవంతం
- 500 మీటర్ల త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ర్యాలీ
- ముస్లింల సంఘీభావం.. ర్యాలీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విజయవాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): మీ శౌర్యత్వానికి మా ప్రణామం.. ప్రజల ప్రాణాలను సంరక్షిస్తున్న ధీర సైనికులారా సలామ్.. వీర మరణం పొందిన సైనికులారా మీకు మా మనస్సాంజలి. భారత్ జోలికి వస్తే శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన మిమ్మల్ని చూసి ఎంతగానో గర్విస్తున్నాం.. దేశ రక్షణ కోసం సరిహద్దున పోరాడుతున్న వీర జవానులారా.. మేమంతా మీ వెంటే ఉన్నాం.. భారత్ మాతాకీ జై.. వందేమాతరం.. అంటూ 'భారత శౌర్య తిరంగా యాత్ర'లో నగర ప్రజలు రణనినాదం చేశారు. కులమతాలకు అతీతంగా దేశభక్తిని చాటారు. చిన్న పిల్లల నుంచి పెద్దలు, వృద్ధుల వరకు సంఘటితంగా దేశభక్తిని చాటారు. శుక్రవారం మహాత్మాగాంధీ (ఎంజీ) రోడ్డు త్రివర్ణ శోభితమై శతృదేశాలకు సింహస్వప్నంగా గర్జించింది. ర్యాలీని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు ముందుండి నడిపించారు. ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని రగిలించారు.

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఎన్డీయే భాగస్వామ్యాలు నిర్వహించిన తిరంగా ర్యాలీలో యువత, మాజీ సైనికులు, విద్యార్థులు, ప్రజలు అధికసంఖ్యలో దగా పాల్గొని మద్దతు తెలిపారు. రోడ్డు మధ్యలో డివైడర్‌పోల్స్‌కు ఏర్పాటుచేసిన లైటింగ్ త్రివర్ణపతాక రంగులను విరజిమ్మింది. ర్యాలీలో యువత నుంచి అన్ని వయస్కుల వారి చేతిలో త్రివర్ణ పతాకం, భారతమాత నినాదాలతో నగరం దేశభక్తిని చాటుకుంది. స్టేడియం వద్ద కళాకారులు నృత్యాలతో అలరించారు. ర్యాలీలో ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన మురళీనాయక్ ఫోటోలను ప్రదర్శిస్తూ త్రివిధ దళాలను కీర్తిస్తూ ముందుకు సాగారు. ముస్లింలు సైతం జాతీయజెండాలతో ర్యాలీలో పాల్గొని పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు రోప్‌ను ఏర్పాటు చేయడంతో ర్యాలీ ఎటువంటి ఆటంకం లేకుండా ముందుకు సాగింది.

పాల్గొని మద్దతు తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురంధేశ్వరి జాతీయ పతాకాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. రెండు కిలోమీటర్ల పొడవునా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కాలినడకతో ర్యాలీని ఉత్సాహంగా ముందుండి నడిపించారు. ప్రజల్లో జోష్ నింపారు.

ఎన్డీయే ఇచ్చిన పిలుపు మేరకు ర్యాలీకి నగరంలో వేలాది మంది స్వచ్ఛందగా పాల్గొని మద్దతు తెలిపారు.

శతృవుల గుండెల్లో సింహనాదం

మహాత్మాగాంధీ (ఎంజీ) రోడ్డు మువ్వన్నెల పతాకాలను చేబూనిన దేశభక్తుల పదఘట్టనలతో మారు మోగగా.. మరోవైపు దేశభక్తులను ఉద్దేశించిన నాయకుల ప్రసంగాలతో శతృమూకలకు సింహనాదం వినిపించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లాకు చెందిన త్రివర్ణ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి కొనియాడారు. అంతకుముందు మున్సిపల్ స్టేడియం వద్ద కళాకారులు నృత్యాలతో ర్యాలీకి వచ్చిన వారిని అలరించారు. విద్యార్థులు 500 మీటర్ల పొడువున్న త్రివర్ణ పతాకంతో ర్యాలీలో ముందుకు సాగారు. వీరితో పాటు చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, బోడె ప్రసాద్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, బుద్దా వెంకన్న తదితరులు ర్యాలీని అనుసరించారు. ప్రజలు స్వచ్ఛందంగా త్రివర్ణ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఎటువంటి తొక్కిసలాట జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ర్యాలీలో జిల్లాకు చెందిన 500మంది ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ వలంటీర్లు పాల్గొన్నారు. కలెక్టర్ పిలుపు మేరకు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల సహా పలు కాలేజీల నుంచి ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ వలంటీర్లు పాల్గొన్నారు. ర్యాలీలో వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని ప్రజల్లో ఉత్సాహం నింపారు.

సరైన సమయంలో పాకిస్తాన్ ఆటకట్టించిన ప్రధాని మోదీ

- ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)

ప్రధాని మోదీ సరైన సమయంలో సరైన నిర్ణయంతో పాకిస్తాన్ ఉగ్రవాదుల ఆటకట్టించారు. భారతీయ మహిళలను పిరికివాళ్లుగా భావించి చులకనగా చూసిన పాక్ ఉగ్రవాదులకు మోదీ సరైన గుణపాఠం చెప్పారు. దేశరక్షణ కోసం ప్రాణాలను కోల్పోయిన మురళీనాయక్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారు. మరోసారి పాకిస్తాన్ తోకజాడిస్తే మరింత గట్టిగా బుద్ధి చెప్పడానికి భారత సైన్యం సిద్ధంగా ఉంది.

పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం

- జనసేన మహిళా నేత తిరుపతి అనూష

ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్‌తో సరైన గుణపాఠం చెప్పిన త్రివిధ దళాలకు సంఘీభావంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొనడం ఆనందంగా ఉంది. భారత మహిళల బొట్టును చెరిపేసిన ఉగ్రవాదుల నుదిటిన మన సైన్యం తూటా దించి చంపడంతో పాకిస్తాన్‌కు బుద్ధిచెప్పారు. పాకిస్తాన్, ఉగ్రవాదులకు మోదీ భారతదేశ సత్తా ఏంటో చాటిచెప్పారు.





కళా విన్యాసాలు




బందరులో తిరంగా ర్యాలీలో పాల్గొన్న కూటమి నేతలు

మచిలీపట్నంలో తిరంగా ర్యాలీ

- పాల్గొన్న కూటమి నేతలు, కేయూ ఉపకులపతి రాంజీ

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్ ఉగ్రవాదులను తుదముట్టించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో శుక్రవారం మచిలీపట్నంలో కూటమి నాయకులు కోనేరుసెంటర్ నుంచి బస్టాండ్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారతసైన్యం ధైర్యసాహసాలు, త్యాగాలను నేతలు ప్రశంసించారు. కోనేరుసెంటర్‌లో ప్రారంభమైన ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు, డీసీఎంఎస్ చైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కొనకళ్ల బుల్లయ్య, మోటమర్రి బాబాప్రసాద్, హసీంబేగ్, పీవీ ఫణికుమార్, పంతం గజేంద్రరావు, సూరిశెట్టి హరికృష్ణ, ధూళిపాళ శ్రీరామ చంద్రమూర్తి, గడ్డంరాజు తదితరులు పాల్గొన్నారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ రిక్షా తొక్కి పాల్గొన్నారు.


అవనిగడ్డలో జిల్లా కోర్టు ప్రారంభం



కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి గోపి

అవనిగడ్డ, మే 16 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలో 6వ అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుతో కక్షిదారులు 100కిలోమీటర్ల మేర వెళ్లే ఇబ్బందులు ఎట్టకేలకు పరిష్కారమయ్యాయి. జిల్లా సెషన్స్ న్యాయాధికారి జి.గోపి, 6వ అదనపు జిల్లా న్యాయాధికారి పాండురంగారెడ్డితో కలిసి శుక్రవారం అదనపు జిల్లా కోర్టును లాంఛనంగా ప్రారంభించారు. అవనిగడ్డ నుంచి మచిలీపట్నంలో 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు వచ్చేందుకు కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, అవనిగడ్డలోనే ఈ కోర్టును ఏర్పాటు చేయటంతో ఇక్కడి ప్రజల ఇబ్బందులు ఎట్టకేలకు పరిష్కారమయ్యాయని జిల్లా సెషన్స్ జడ్జి గోపి తెలిపారు. 6వ అదనపు జిల్లా న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన పాండురంగారెడ్డి మాట్లాడుతూ, కక్షిదారుల ప్రయోజనాలే లక్ష్యంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.అరుణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సనకా రఘురామ ప్రసాద్, రాయపూడి గోపాలపారావు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రోన్లు, సీసీ కెమెరాలతో నేర నియంత్రణ : ఎస్పీ



మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్లు, సీసీ టీవీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనలు వేగవంతం చేస్తూ నేరాలను నియంత్రించాలని ఎస్పీ గంగాధరరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో పోలీసు అధికారుల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ఆకతాయిలను డ్రోన్ కెమెరాలతో పసిగట్టాలన్నారు. హత్యలు, దొంగతనాలు కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ అడ్మిన్ వీవీ నాయుడు, ఏఎస్పీ ఏఆర్ సత్యనారాయణ, డీఎస్పీలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల చెరలో..

(5వ పేజీ తరువాయి)

ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మొత్తం 1,200 పట్టాలు ఇచ్చాం : వంశీ అనుచరులు

నాడు అవుటపల్లిలో జరిగిన అంతర్గత సమావేశంలో నియోజకవర్గవ్యాప్తంగా 1,200 పట్టాలు పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే వంశీ తమను ఆదేశించారని, ఆయన ఆదేశాల మేరకే అలా చేశామని, ఎన్నికలు జరిగాక నకిలీ ఇళ్ల పట్టాల కేసు వెలుగు చూడటంతో వంశీ అనుచరులు కొందరు రంగంలోకి దిగి పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తామని మభ్యపెట్టి పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలన్నీ తిరిగి తీసుకున్నారని బాపులపాడు టీడీపీ నాయకులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బాపులపాడు మండలంలో సుమారు 400, ఉంగుటూరు, గన్నవరం టౌన్, గన్నవరం గ్రామీణ ప్రాంతాల్లో 600, విజయవాడ గ్రామీణ ప్రాంతంలో 200 పట్టాలను అదే సమావేశంలో టీడీపీ నాయకులతో పంపిణీ చేయించారని చెప్పారు. తరువాత జరిగిన పరిణామాల వల్ల ఎమ్మెల్యే వంశీ వైసీపీలోకి వెళ్తూ తమను కూడా రమ్మన్నారని, తాము నిరాకరించడంతో స్థానిక అనుచరులతో తమపై కేసులు నమోదు చేయించారని తెలిపారు. ఆ ఫలితంగానే ఆరేళ్లుగా నూజివీడు కోర్టుకు వాయిదాలకు వెళ్తొస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా జైలు సూపరింటెండెంట్‌పై వేటు

(5వ పేజీ తరువాయి)

వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పాల్ కుర్చీ కదులుతుందని అంతా భావించారు. ఇది జరగకపోగా, ఆయన పదిలమైపోయారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కొంతమంది టీడీపీ నాయకులను కేసుల్లో ఇరికించి జిల్లాజైలులో పెట్టారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కింజరపు అచ్చెన్నాయుడును ఈఎస్ఐ నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టు చేసి ఈ జైల్లో పెట్టారు. ఆ తర్వాత మరికొంతమంది నేతలను ఈ జైలుకు పంపారు. జైల్లో వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు తాడేపల్లి కార్యాలయానికి హంసపాలే తెలియజేసేవారు. నాడు వారు జైల్లో కొన్ని సదుపాయాలు కల్పించమని కోరినా నిరభ్యంతరంగా తోసిపుచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. సూపరింటెండెంట్‌గా హంసపాల్ ఉన్నా నిందితులకు రాజభోగాలు సాగుతున్నాయి. ఇక్కడున్న వైసీపీ విధేయ నిందితులకు చేరాల్సిన సమాచారం.. అన్ని మార్గాల్లోనూ అందుతోంది. రాష్ట్రంలోని ప్రతి కేంద్ర కారాగారం, జిల్లా కారాగారంలో సూపరింటెండెంట్ చాంబర్ వరకు మీడియాకు అనుమతి ఉంటుంది. ఈ విషయంలో మాత్రం హంసపాల్ పూర్తిగా భిన్నం. మీడియా ప్రతినిధులే కాదు, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాల అధికారులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయరు. ఆయనను కలవడానికి సెంట్రీ సిబ్బంది నుంచి సమాచారం పంపినా స్పందించరు. కొద్దిరోజులుగా హంసపాల్ ప్రవర్తనపై అనేక ఫిర్యాదులు ప్రభుత్వానికి చేరాయి. దీంతో ఆయనపై వేటు పడింది.

పది జిల్లాల్లో డీసీహెచ్‌లు మార్పు

- పనితీరు సరిగా లేకపోవడంతో చర్యలు

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పనితీరు సరిగా లేదనే కారణంతో వైద్య ఆరోగ్య శాఖ పది జిల్లాలకు కొత్త జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్)లను నియమించింది. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో డీసీహెచ్‌లను మార్చింది. గత మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించి, ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే పది జిల్లాల అధికారులను మార్చారు. ఆయా జిల్లాల్లో సెకండరీ ఆసుపత్రుల పనితీరుపై తరచూ సూచనలు, హెచ్చరికలు చేసినా వారిలో మార్పు రాలేదని, అందుకే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని అధికార వర్గాలు తెలిపాయి.

'గోపాలమిత్ర' వ్యవస్థ పరిశీలనకు కమిటీ

అమరావతి: పశుసంవర్ధక శాఖలోని గోపాలమిత్ర వ్యవస్థ పనితీరును పరిశీలించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఏపీ లైవ్‌స్టాక్ ఏజెన్సీ సీఈవో అధ్యక్షతన పశుసంవర్ధక, పశు వైద్య నిపుణులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019కు ముందున్న విధంగా గోపాలమిత్ర వ్యవస్థను కొనసాగించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, గ్రామ పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రల మధ్య జాబ్‌చార్ట్‌పై స్పష్టమైన హద్దును కమిటీ సూచించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బుడమేరు ప్రక్షాళన ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

సాగుతున్నాయి. మూడు విడతలుగా జరుగుతున్న ఈ పనులను జూన్ 10 నాటికి పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

52,500 క్యూసెక్కుల వరద మళ్లింపే లక్ష్యం

వరదల సమయంలో బుడమేరు వరద మళ్లింపు కాల్వ (బీడీసీ)కు తరచూ ఒకే ప్రాంతంలో గండ్లు పడుతున్నాయి. దీనివల్ల అటు రైతులు, ఇటు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. విజయవాడ పల్లపు ప్రాంతాలు ముంపు బారిన పడటం వంటి వాటి నుంచి కాపాడాలంటే గండ్లు పడిన ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించడం ఒక్కటే శాశ్వత పరిష్కారంగా భావించిన ప్రభుత్వం ఆ దిశగా పనులు ప్రారంభించింది.

కాల్వకు సమాంతరంగా మరో కాల్వ

వర్షాకాలంలో అతిభారీ వర్షాల సమయంలో ఎగువ నుంచి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వరకు ఎంత పెద్ద ఎత్తున వరద నీరు వచ్చినా కట్టలకు, రెగ్యులేటర్‌కు ఇబ్బంది లేకుండా మళ్లించేందుకు అవసరమైన ప్రణాళికను జలవనరుల శాఖ సిద్ధం చేసింది. రెగ్యులేటర్ దిగువ భాగంలో నుంచి ఎనికేపాడు యూటీ వరకు ఉన్న పాత కాల్వకు సమాంతరంగా మరో కాల్వ తవ్వాలనే ప్రణాళికలు తయారుచేసింది. పాత కాల్వ, దాని సమాంతర కాల్వ ద్వారా మొత్తం 25 వేల క్యూసెక్కులు నేరుగా కొల్లేరులో కలిపేందుకు చర్యలు తీసుకోనున్నారు. అందుకు అవసరమైన భూమిని సేకరించే పనిలో ఉన్నారు. రెగ్యులేటర్ వద్దకు వచ్చే వరదను బీడీసీ ద్వారా 37,500 క్యూసెక్కులు మళ్లించేలా కట్టలను బలోపేతం చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగానే మూడు గండ్లు పడిన చోట రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ఇలా వచ్చే వరదను సాధ్యమైనంత వరకు బీడీసీ ద్వారానే కృష్ణానదిలో కలిపి, కాల్వ సామర్థ్యం మించి వచ్చే వరదను రెగ్యులేటర్ దిగువ భాగంలోని కాల్వల ద్వారా కొల్లేటిలో కలిపేందుకు ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేసింది. ఇందుకు కేంద్ర సాయం కూడా కోరనున్నట్లు మంత్రి నిమ్మల తెలిపారు. ముందు రిటైనింగ్ వాల్ పూర్తయితే సాధ్యమైనంత వరకు బుడమేరు వరద నుంచి విజయవాడ పల్లపు ప్రాంతాలను కాపాడినట్టేనన్న అభిప్రాయంలో అటు అధికారులు, ఇటు ప్రభుత్వం ఉంది. అయితే, వర్షాలు ప్రారంభం కాకముందే రిటైనింగ్ వాల్ పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

తొలగింపు తాత్సారం

(5వ పేజీ తరువాయి)

మార్కెట్‌లోని దుకాణదారులు, అసోసియేషన్ నేతలు కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. కానీ, ఈ విషయాన్ని కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవట్లేదు. గాంధీనగర్ రైతుబజార్ వద్ద తమకు స్థలం కేటాయించాలని కోరుతున్నా స్పందన లేదు. సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ వద్ద ఇస్తామని కార్పొరేషన్ చెబుతున్నా.. అక్కడ మూడు శ్మశానాలు ఉండటంతో సెంటిమెంట్‌గా పూలు కొనటానికి ఎవరూ రారని వ్యాపారులు వాదిస్తున్నారు. చివరికి ఈ వ్యవహారం రాజకీయ నేతల వరకూ వెళ్లగా, కొందరు నాయకులు బేరాలు పెట్టారు. ఈ మార్కెట్‌కు పాములకాల్వ వద్ద రెండెకరాల స్థలం ఉంది. అక్కడ మార్కెట్ ఏర్పాటు చేస్తే.. గిట్టుబాటు ఉండదని వ్యాపారులు అంటున్నారు. నగరంలోని మహిళలు అంతదూరం రారని చెబుతున్నారు. అలాగే, ఈ మార్కెట్‌లో గతంలో షాపులు అమ్ముకున్న కొందరు, రియల్ ఎస్టేట్ వ్యక్తులు కలిసి కృష్ణానది అవతల, కృష్ణా కరకట్ట దిగువన 90 షాపులతో కూడిన మార్కెట్ ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్ కరకట్టకు దిగువన ఉండటం క్షేమం కాదని, అక్కడికి వెళ్లడానికి కూడా వ్యాపారులు ఇష్టపడట్లేదు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్, మే 16 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో శని వారం హనుమజ్జయంతి ఉత్సవాలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతులు మీదుగా ప్రారం భిస్తున్నట్లు దేవస్థానం ఈవో పి. తారకేశ్వ రరావు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, అర్చన లతో స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహి స్తారు. అనంతరం ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ లాంఛనంగా ఉత్సవాలను ప్రారంభిస్తారని భక్తులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



మణప్పురం ఫైనాన్స్ కంపెనీ

మణప్పురంలో బంగారం గోల్‌మాల్!

- కార్యాలయానికి తాళం వేసిన బాధితురాలు

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్ర జ్యోతి) : బుట్టాయిపేటలోని మణప్పురం గోల్డ్ ఫైనాన్స్ కంపెనీలో బంగారం కుదువపెట్టిన ఓ మహిళ తన బంగారం మాయం కావడంతో ఆందోళనకు దిగింది. మచిలీపట్నంలో జరిగిన ఈ సంఘటన సంచలనం రేకెత్తించింది. 2022లో 123 గ్రాముల బంగారం తాకట్టు పెట్టి గొర్రుముచ్చు దీప్తి రూ.5 లక్షల 50 వేలు రుణం తీసుకుంది. దశల వారీగా రుణాన్ని 2023 జనవరికి వడ్డీతో సహా చెల్లించింది. కుదువపెట్టిన బంగారం ఇవ్వాలని అప్పటి బ్యాంకు మేనేజర్‌ను కోరింది. బ్యాంకు మేనేజర్ బంగారం తిరిగి ఇవ్వలేదు. అప్పటి నుంచి ఆమె ఫైనాన్స్ కంపెనీ చుట్టూ తిరుగుతూనే ఉంది. విసిగిపోయి ఆమె శుక్రవారం బ్యాంకుకు తాళాలు వేసింది. రుణం తీర్చినా బంగారం ఎందుకు ఇవ్వలేదని మేనేజర్‌ను నిలదీసింది. తాను మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలే అయిందని, ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తానని మేనేజర్ చెప్పాడు. 2022 నుంచి పనిచేసిన మేనేజరే దీనికి బాధ్యుడని, తాను కాదని ప్రస్తుత మేనేజర్ ప్రసాద్ చెప్పినప్పటికీ ఆ మహిళ వినలేదు. దీంతో ఆగ్రహించిన బాధితురాలు కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోయింది. దీంతో మేనేజర్ ఉన్నతాధికారులకు ఫోన్‌లో విషయం తెలియజేశాడు. బాధితురాలికి జనసేన నేత గడ్డంరాజు తదితరులు మద్దతు తెలిపారు.



కంపెనీకి తాళం వేస్తున్న బాధితురాలు దీప్తి

రోడ్డుపైనే ప్రైవేట్ వాహనాలు!



పటమట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్ గార్డెన్ టవర్ లైన్ రోడ్డులో విశాలమైన రోడ్డు నిర్మించారు. కానీ ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు తమ ఇష్టానుసారం బస్సుల ను ప్రధాన రహదారిపై నిలిపివేస్తున్నారు. దీనికితోడు పనికిరాని స్క్రాప్ ఆటోలను యజమానులు రోడ్డుపై పార్కింగ్ చేసి వదిలివేశారు. ఆటోలు ఆకతాయిలకు అడ్డాగా మారాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని 10వ డివిజన్ ఆర్ఆర్ గార్డెన్ వాసులు కోరుతున్నారు.



ర్యాలీలో పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు, సిబ్బంది

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

వన్‌టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగ్యూ దినోత్సవం, డ్రై డే పురస్కరించుకుని శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర, ప్రభుత్వ పాత ఆసుపత్రి వద్ద డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కమిషనర్ మాట్లా డుతూ ఇంటి లోపల, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉంచరాదన్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అందులో భాగంగా దోమల వ్యాప్తిని ప్రజలు అరికట్టాలన్నారు. అందుకోసం కూలర్లు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలలో నీరు నిల్వ ఉంచకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రై డే, ఫ్రైడే కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, నగరపాలక సంస్థ బయోలజిస్టు సూర్యనాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తి.. నిర్లక్ష్యం జాస్తి

- రూ.40 లక్షలతో పంచాయతీ కార్యాలయం నిర్మాణం..
- ప్రారంభానికి నోచుకోని కొత్తూరు తాడేపల్లి పంచాయతీ కార్యాలయం
- కాంట్రాక్టర్‌కు నిధులు కేటాయించకపోవడమే కారణమా ?
- అరకొర పనులు చేపట్టలేరా!



కొత్తూరు తాడేపల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనం

(గుణదల-ఆంధ్రజ్యోతి)

విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు తాడేపల్లి పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఏక్షణంలో పెచ్చులు ఊడి నెత్తిన పడతా యోనన్న భయం ఒకవైపు.. వర్షం పడితే నీరు శ్లాబులో నుంచి కారుతుండటంతో ఎక్కడ విద్యుదాఘాతం జరుగుతుందోనని సిబ్బంది భయంతో వణికిపోతున్నారు.

నూతన భవనం 85శాతం నిర్మాణం

పంచాయతీ కార్యాలయాన్ని రూ.40 లక్షలతో 85శాతం నిర్మాణ పనులు పూర్తయయ్యాయి. రెండు సంవత్సరాలు అవుతున్నా కాంట్రాక్టర్‌కు నేటికీ ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదు. దీంతో కొద్దిపాటి పనులు ఆగిపోవడం నూతన భవనం ప్రారంభానికి నోచుకోలేదు. పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే నూతన భవన ప్రారంభానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నూతనంగా నిర్మించిన భవనం ప్రారంభానికి నోచుకోక పోవడంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి బూత్ బంగళాని తలపిస్తుంది. పాలకులు, అధికారులు స్పందించి నూతన భవనంలోకి పంచాయతీని మార్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందితోపాటు ప్రజలు కోరుతున్నారు.

భారత్ మాతాకీ జై

- తిరంగాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నప్రజలు

లబ్బీపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా నగరంలో నిర్వహించిన తిరంగాయాత్రలో ప్రజలు పాల్గొని దేశభక్తిని చాటారు. జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న, పెద్ద, యువకులు, వృద్ధులు తరలి వచ్చారు. ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కి ల్ వరకు యాత్ర సాగింది. పూర్ణనందంపేటకు చెందిన అంగన్వాడీ టీచర్లు, చిన్నారులు ఆకర్షణగా నిలిచారు. లబ్బీపేటకు ముస్లింలు పీవీపీ మాల్‌వద్ద జాతీయ జెండాలతో యాత్రలో పాల్గొన్నారు.

పటమట: విజయవాడలో జరిగిన తిరంగా రన్‌లో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆయన సతీమణి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధలు పాల్గొన్నారు.

విజయవాడ లీగల్ : బెజవాడ బార్ న్యాయవాదులు శుక్రవారం తిరంగాయాత్ర నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పి భారత త్రివిధ దళాలకు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంఘీభావంగా న్యాయవాదులు సిటీ సివిల్ కోర్టుల నుంచి బందరురోడ్డు మీదుగా తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే బాషా, కేవీ రంగారావు, కార్యవర్గసభ్యులు పిళ్లా శ్రీనివాస్, ముళ్వా జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



తిరంగా రన్‌లో పాల్గొన్న గద్దె దంపతులు

ఎన్టీఆర్ విగ్రహం నుంచి..

రాణిగారితోట : భారత త్రివిధ దళాలకు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి దేశ ప్రజలు ఎంతో రుణపడి ఉన్నారని రాణిగారితోట టీడీపీ నాయకులు అన్నారు. శుక్రువారం బందర్ రోడ్డులో జరిగిన తిరంగా యాత్రలో పాల్గొనేందుకు రాణిగారితోట 17వ డివిజన్‌లో ఎన్టీఆర్ విగ్రహం నుంచి పాదయాత్ర గా తరలివెళ్లారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ, కొప్పుల శ్రీనివాస చౌదరి, సునాబి మొకరలక్ష్మి, మదార్ తదితరులు పాల్గొన్నారు.





యాత్రకు సంఘీభావం తెలుపుతున్న ముస్లింలు.. బందరురోడ్డులో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న బెజవాడ బార్ న్యాయవాదులు

మర్యాదపూర్వక కలయిక

మంత్రి రవీంద్రను కలిసిన శాలివాహన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్

పటమట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉమ్మడి శాలీవాహన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన పెరిపి ఈశ్వర్ రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖమంత్రి కొల్లు రవీంద్రలను, బీసీ సంక్షేమ జౌళీ శాఖమంత్రి సవిత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్‌లను వారి కార్యాలయాల్లో కలుసుకున్నారు. ఈశ్వర్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పార్టీకి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని, మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించినట్లు ఈశ్వర్ తెలిపారు.



ఈశ్వర్‌ను సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



మనక్ సంవాద్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్ అండ్ హెడ్ ప్రేమ్ సజాని

ఘనంగా మనక్ సంవాద్

ఆటోనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు, ధ్రువీకరణలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ మనక్ సంవాద్‌ను నిర్వహించినట్లు డైరెక్టర్ అండ్ హెడ్ ప్రేమ్ సజాని అన్నారు. ఆటోనగర్‌లోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ కార్యాలయంలో శుక్రవారం మనక్ సంవాద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాండర్డ్ మార్క్ నియమ నిబంధనలను వివరించారు. లైసెన్స్ సర్టిఫికేషన్ కోసం బీఐఎస్ డిజిటల్ యాప్ ద్వారా మనక్ ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని డిప్యూటీ డైరెక్టర్ డి.వివేక్ వర్ధన్‌రెడ్డి తెలిపారు. అనంతరం కొత్తగా ధ్రువీకరించిన పరిశ్రమలకు బీఐఎస్ లైసెన్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో డి.కృష్ణవీర్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు



లబ్బీపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి లబ్బీపేటలో చెట్లు విరిగి విద్యుత్ అంతరాయం కలిగింది. 19వ డివిజన్ లబ్బీపేట పరిధి పున్నమ్మ తోట ప్రాంతంలో వర్షం కారణంగా చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్ల పై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దాంతో స్థానికుల ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న మొగల్‌రాజపురం ఏఈ కోటేశ్వరరావు, సిబ్బంది విద్యుతు పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.



కళాశాలలోని ప్లే గ్రౌండ్‌లో నిలిచిన వర్షపు నీరు

సంకట హర గణేశునికి అర్చన

ఇంద్రకీలాద్రి, మే 16 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సంకటహర చతుర్థి తిథి సందర్భంగా శుక్రవారం గణపతికి విశేష అర్చన, అభి షేకం, అర్చన, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవో వీకే శీనా నాయక్ పాల్గొని పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

సరస్వతి హోమం..

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సరస్వతీ హోమం నిర్వహించారు. విద్య, వాక్కు, జ్ఞానం, కళలకు అధిష్టాన దేవత సరస్వతీదేవి అనుగ్రహం ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా లభించాలనే చదువుల తల్లి సరస్వతీదేవిని పూజించారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. భక్తులు పొంగళ్ల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కల్యాణం, చండీ హోమం, తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈవో శీనా నాయక్ దర్శనం టికెట్ స్కానింగ్ పాయింట్, టికెట్ కౌంటర్లను పరిశీలించారు.

జలమయం

- అవస్థలు పడ్డ వైద్య విద్యార్థులు, ఉద్యోగులు

ప్రభుత్వాసుపత్రి, మే 16 (ఆంధ్రజ్యోతి): రాత్రి కురిసిన భారీవర్షానికి ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రాంగణంలో ఎక్కడ చూసినా వర్షపు నీరు నిలిచిపోయింది. వసతిగృహం గేటు ఎదుట, డ్రగ్ హౌస్ కార్యాలయం ఎదుట, ఆట స్థలంలో, జనరేటర్ ఉన్న ప్రాంతంలో, నూతనంగా నిర్మిస్తున్న భవనం ఎదుట నీరు నిలవడంతో అటు విద్యార్థులు, ఇటు ఉద్యోగులు నానా అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి కళాశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





పెద ఓగిరాలలో తడిసిన పసుపు కొమ్ములు ఎండబెడుతున్న కూలీలు



పెద ఓగిరాలలో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు



వల్లూరుపాలెంలో తడిసిన మొక్కజొన్నలు ఆరబెడుతున్న రైతులు

అకాల వర్షం.. రైతుకు నష్టం

తడిసిన పసుపు, మొక్కజొన్న

ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. పసుపు, మొక్కజొన్న, ధాన్యం రాశులపై పట్టాలు కప్పినప్పటికీ అవి గాలులకు లేచిపోయి పంట తడిచిపోయింది. గుడివాడలో కురిసిన భారీ వర్షానికి బస్టాండ్ నీట మునిగింది. శివారు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. గాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.



వల్లూరుపాలెంలో తడిసిన కండెలకు మొలకలు



మొక్కజొన్నపంటపై కప్పిన పరదాలపైన వర్షపు నీరు



బొడ్డపాడు పొలాల్లో విరిగిపడిన ట్రాన్స్‌ఫార్మర్

ఉయ్యూరు/తోట్లవలూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు మండల పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షానికి పసుపు, మొక్కజొన్న, దాళ్వా రైతులకు భారీ నష్టం కలిగింది. ఉరుములు, మెరుపులు, తీవ్రగాలులతో రెండుగంటలకు పైగా కురిసిన వర్షానికి పొలాల్లో ఎండబెట్టిన పసుపుకొమ్ములు, మొక్కజొన్న, రాశులపై ఉన్న ధాన్యం తడిసింది. ఉడకపెట్టిన పసుపుకొమ్ములు, కోసి ఎండబెట్టిన మొక్కజొన్న కండెలపై పట్టాలు కప్పినప్పటికీ గాలులకు లేచిపోయి తడిసిపోయాయి. పెదఓగిరాలలో పసుపు, మొక్కజొన్న కల్లాల్లో నీరునిలిచిపోవడంతో తడిసిన వాటిని వేరే చోటికి చేర్చి ఆరబెట్టుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. చినఓగిరాలలో ధాన్యం రాశులపై పట్టాలు కప్పినప్పటికీ తడిసిపోయింది.

అకాల వర్షం నిండా ముంచింది

ఐదెకరాల్లో పసుపు పండించి కొమ్ములు కల్లంలో ఎండబెట్టాం. వర్షానికి నీరు నిలిచి తడిసిపోయింది. తడిసిన పసుపుకొమ్ములు బయటకు తెచ్చి రోడ్లపై ఆరబెట్టడానికి ఖర్చు తడిసి మోపెడవుతుంది.

- అంజిరెడ్డి, రైతు, పెద ఓగిరాల

చేతికొచ్చిన పంట తడిచింది



ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో అకాల వర్షం వచ్చింది. ఆరబెట్టిన మొక్కజొన్న తడిసిపోయింది. కండెలు గుట్టగాచేసి పట్టాలుకప్పినా గాలికి లేచిపోయాయి.

-పెనుముత్స నరసింహ, రైతు, పెద ఓగిరాల

గుడివాడలో భారీ వర్షం

- నీటమునిగిన బస్టాండ్
- ధనియాలపేటలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు



ధనియాలపేటలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

గుడివాడ: పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. వారంరోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో సతమతమవుతూ, ఉక్కపోతలతో అల్లాడుతున్న పట్టణ ప్రజలకు భారీ వర్షం ఊరటనిచ్చింది. భారీ ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ధనియాలపేటలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పలుచోట్ల డ్రెయినేజీలు పొంగి రహదారికిపైకి మురుగునీరు చేరింది. గుడివాడ బస్టాండ్ దారుణంగా మారింది. బస్టాండ్ నీట మునిగింది. ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు నానాపాట్లు పడ్డారు.

తోట్లవల్లూరు మండలంలో ఉరుములు, పిడుగులతో భారీ వర్షం

శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మెరుపులు, ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. గంటన్నరపాటు భారీశబ్ధాలతో ఉరుములు, మెరుపులు రావటం గతంలో తామెప్పుడు చూడలేదని పెద్దలు చెబుతున్నారు. ఈ అకాల భారీ వర్షానికి వల్లూరుపాలెం, పలు లంకగ్రామాల్లో మొక్కజొన్న పంట తడిసింది. కొన్నిచోట్ల మొలకలు వస్తున్నాయని రైతులు తెలిపారు. బొడ్డపాడులో భారీ గాలికి సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలతో సహా విరిగిపడిపోయింది. పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగాయి. పిడుగులు పొలాల్లో పడటం వల్ల ఎక్కడా ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.



నందిగామలో నిరుపయోగంగా ఉన్న అధునాతన భూసార పరీక్షా కేంద్రం

భూసార పరీక్షల నిర్వహణలో జాప్యం!

- జిల్లాలోని అన్ని మట్టి నమూనాలకు గొల్లపూడి కేంద్రంలోనే పరీక్షలు
- నందిగామలో కేంద్రం ఉన్నా వినియోగించని అధికారులు
- వచ్చే నెల నుంచి తొలకరి ప్రారంభం
- ఎప్పటికి రిపోర్టులిస్తారని ప్రశ్నిస్తున్న రైతులు

(ఆంధ్రజ్యోతి-నందిగామ): వ్యవసాయ శాఖ అధికారులు సేకరించిన శాంపిల్స్‌ను గొల్లపూడి మార్కెట్ యార్డులోని జిల్లా భూసార పరీక్షా కేంద్రానికి తరలిస్తున్నారు. జిల్లా మొత్తానికి ఈ ఒక్క కేంద్రమే ఉండడంతో అన్ని ప్రాంతాల నుంచి మట్టి నమూనాలను అక్కడికే తీసుకొస్తున్నారు. ఒక్కసారిగా భారీగా నమూనాలు జమ కావడంతో భూసార పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యం కాని పని. ఒక్కొక బ్యాచ్‌కు అరవై నమూనాలు పరీక్షిస్తారు. ఇందు కోసం రెండు రోజులు పడుతుంది. ఈలెక్కన జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన శాంపిల్స్ పరీక్షించాలంటే చాలా సమయం పడుతుంది. దీంతో హడావుడిగా పరీక్షలు నిర్వహిస్తున్నారని రైతులు అంటున్నారు. మార్చి నెలాఖరు నుంచి సేకరిస్తే బాగుంటుందని, మే సగం దాటినా నమూనాల సేకరణలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, ఎప్పటికి రిపోర్టులు అందిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

వ్యవసాయంలో ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు అవలంబించడానికి భూసార పరీక్షల ఫలితాలు అవసరం. కానీ, వ్యవసాయశాఖ పరీక్షల భూసార పరీక్షల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏప్రిల్, మేలో పరీక్షలు పూర్తి చేయాల్సిన అధికారులు ఇప్పటికి 30 శాతం కూడా నిర్వహించలేదు. జూన్ నుంచి తొలకరి ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితి లేదు. గ్రామస్థాయిలో పని చేసే వీపీఏలు కూడా ఆయా గ్రామాల్లో పలుకుబడి ఉన్న రాజకీయ ప్రముఖుల భూముల నుంచి మాత్రమే శాంపిల్స్ సేకరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో రైతులు వేసవి దుక్కులు వేయించారు. దుక్కులు వేసిన భూమిలో శ్యాంపిల్స్ తీసినా ఫలితం ఉండదు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క నమూనానైనా పరీక్షించని వైనం

భూసార పరీక్షల కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం ముప్పై లక్షల వ్యయంతో అధునాతన పరికరాలతో నందిగామ మార్కెట్ యార్డులో ఒక భూసార పరీక్షా కేంద్రాన్ని నిర్మించింది. సుశిక్షితులైన సిబ్బందిని నియమించింది. మరో రూ.12 లక్షలతో సూక్ష్మ ధాతు పరీక్షల నిర్వహణకు పరికరాలను ఏర్పాటు చేసింది. దీంతో గొల్లపూడి కేంద్రానికి ఒత్తిడి తగ్గింది. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల రైతులకు సౌకర్యంగా ఉంది. పని విభజన వల్ల నమూనాలను నిశితంగా పరీక్షించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ కేంద్రాన్ని మూలన పెట్టారు. ఐదేళ్లలో ఒక్క నమూనా కూడా పరిశీలించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ కేంద్రంలో పరీక్షలు జరపకపోవడం వ్యవసాయాధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతులు అంటున్నారు. తక్షణమే ఈ కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లా నమూనాల టార్గెట్

ఎన్టీఆర్ జిల్లా భూసార పరీక్షల టార్గెట్‌ను ప్రభుత్వం 14,864గా నిర్ణయించింది. ఇందులో ఇప్పటి వరకూ 7411 శాంపిల్స్‌ను సిబ్బంది సేకరించారు. అందులో సగం నమూనాలనే పరీక్షించినట్టు సమాచారం. మరో 7,453 నమూనాలను సేకరించి పరీక్షలు జరపాలి.



బాపట్ల జిల్లా నుంచి కప్తానుపాలెం వచ్చిన మట్టి, బుసక టిప్పర్లు

యథేచ్ఛగా మట్టి, బుసక రవాణా

- రాత్రి సమయాల్లో రెచ్చిపోతున్న మట్టి మాఫియా

మోపిదేవి, మే 16 (ఆంధ్రజ్యోతి): మట్టి, బుసక అనధికార రవాణా మండలంలో యథేచ్ఛగా కొనసాగుతోంది. రాత్రి సమయాల్లో రవాణాదారులు మరింత రెచ్చిపోతున్నారు. మండలం, జిల్లాలు దాటి మట్టి, బుసకను అనధికారికంగా మండలానికి రవాణా చేస్తున్నప్పటికీ నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు అంటున్నారు. మండలంలోని పెదప్రోలు పంచాయతీ శివారు కప్తానుపాలేనికి గురువారం అర్ధరాత్రి ఆరు టిప్పర్లలో బుసక, రెండు టిప్పర్లలో మట్టిని తీసుకొచ్చారు.

టిప్పర్లకు కారు అడ్డంగా పెట్టిన తెలుగు మహిళా నేతకు బెదిరింపులు

60 -70 టన్నుల లోడుతో టిప్పర్లు వస్తే అంతర్గత రహదారులు దెబ్బతింటాయని అనుమతి లేకుండా ఎలా రవాణా చేస్తారని గ్రామానికి చెందిన తెలుగు మహిళ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దివి యుగంధరి కుటుంబసభ్యులతో కలిసి బుసక టిప్పర్లు వేసుకొచ్చిన వారిని ప్రశ్నించారు. మీరేం చేస్తారు.. మా ఇష్టం అంటూ వారు యుగంధరి కుటుంబసభ్యులతో వాగ్వాదానికి దిగడంతో టిప్పర్లు వెళ్లకుండా అడ్డుకునేందుకు కారును రహదారిపై అడ్డంగా నిలిపారు. మిమ్మల్ని, మీ కారును తొక్కించుకుని వెళ్తామని టిప్పర్లు వేసుకొచ్చిన వారు బెదిరింపులకు దిగారని యుగంధరి కుటుంబసభ్యులు, తెలిపారు. రెవెన్యూ, పోలీసులకు అర్ధరాత్రి సమయంలో తెలియజేసినా గంటలు వేచిచూసినా వారు రాకపోవడంతో ఈలోపు టిప్పర్లు పొలాల్లోనుంచి వెళ్లిపోయాయి. బాపట్ల జిల్లా బొబ్బర్లంక నుంచి మండలాలు దాటి మట్టి బుసక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు నియంత్రించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మోపిదేవి, పెదప్రోలు, కప్తానుపాలెం తదితర గ్రామాల్లో కోట్ల రూపాయలు వెచ్చించి వేసిన రహదారులు దెబ్బతింటున్నాయని, ఇప్పటికైనా అనధికార రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పకడ్బందీగా పది సప్లిమెంటరీ పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు డీఆర్వో లక్ష్మీనరసింహం ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్వో లక్ష్మీ నరసింహం

కలెక్టరేట్, మే 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఎం. లక్ష్మీనరసింహం ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి, ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే ఓపెన్ స్కూల్ సప్లమెంటరీ పరీక్షల పై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 6,149 మంది విద్యార్థులు హాజరవుతారని, ఇందుకోసం 30 కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలకు 1,677 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పదో తరగతి రెగ్యులర్, ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 59 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. పరీక్షల నిర్వహణకు 300 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. 'పరీక్షల సమయంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చూడాలి. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జిరాక్సు కేంద్రాలు మూసివేయాలి. తాగునీరు అందుబాటులో ఉంచాలి. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, సెల్‌ఫోన్లు అనుమతించొద్దు. ఆర్టీసీ అధికారులు పరీక్షల సమయాలకు అనుగుణంగా విద్యార్థులకు బస్సులు నడపాలి. అన్ని పరీక్షా కేంద్రాలు సీసీ కెమెరాల నిఘాలో ఉంచాలి. స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి.' అని అధికారులను డీఆర్వో ఆదేశించారు. సమావేశంలో డీఈవో యూవీ సుబ్బారావు, నగరపాలక సంస్థ, విద్యుత్, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.



అజిత్‌సింగ్‌నగర్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు

నిరుపయోగంగా..

అజిత్‌సింగ్‌నగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు

- పదేళ్లుగా ఎవరికీ కేటాయించని ప్రభుత్వాలు
- ఆకతాయిలకు అడ్డాగా గృహాలు.. మొక్కలు మొలిచి శిథిలావస్థలో భవనాలు



తాళాలు పగులకొట్టి మందుబాబులు అడ్డాగా మార్చుకున్న ఇల్లు

(ఆంధ్రజ్యోతి-అజిత్‌సింగ్‌నగర్): పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టి పదేళ్లు దాటినా నేటికీ పేదలకు కేటాయించలేదు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పలు బ్లాకుల్లోని గృహాలు ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ సమీపంలో పదేళ్ల క్రితం జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల నిర్మాణాన్ని అప్పటి ప్రభుత్వం చేపట్టింది. 24 బ్లాకులుగా బ్లాక్‌కు 32 చొప్పున మొత్తం 768 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. రెండేళ్లల్లోనే పనులు నిలిచిపోవడంతో అప్పట్లో పలు రాజకీయ పార్టీలు, ప్రజలు ఆందోళనలు చేపట్టడంతో తిరిగి ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తయి ఎనిమిదేళ్లు పూర్తవుతున్నా నేటికి పూర్తి స్థాయిలో ఇళ్ల కేటాయింపులు జరగలేదు. 768 ఇళ్లకు 30 శాతం ఇళ్లను కేటాయించి విగిలిన ఇళ్లను గాలికి వదిలేశారు. గృహాల్లో చాలా వరకు రాజకీయ కేటాయింపులు జరిగాయని విమర్శలు కూడా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలు, నేతలకు, సానుభూతిపరులకు ఇక్కడి ఇళ్లు కేటాయించి పేద ప్రజలను విస్మరించారని ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణాలు పూర్తి చేసుకున్న జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లను పేదలకు త్వరితగతిన కేటాయించాలని పలువురు కోరుతున్నారు. గత ప్రభుత్వాలు ఇళ్ల కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరి ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నా యి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లను పేదలకు కేటాయిస్తే పేదల సొంత ఇంటి కల నెరవేరుతుందని పలువురు కోరుతున్నారు.

గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా..

జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారాయి. ఖాళీగా ఉన్న నివాసాల సముదాయాల మధ్య ఎక్కడ చూసినా చెత్త, చెదారం, మద్యం బాటిళ్లతో చిందరవందరగా కనిపిస్తున్నాయి. రాత్రిళ్లు ఇటువైపు వెళ్లే పరిస్థితి లేదు. పలు నివాసాలకు తాళాలు పగులకొట్టి గడియలు విరిచి ఆకతాయిలు ఆ ఇళ్లను తమ అడ్డాగా మార్చుకున్నారు.

మట్టి లారీలు పట్టుకున్నారు.. సీజ్ చేయకుండా వదిలేశారు!

- విమర్శలకు తావిచ్చేలా వీఆర్వో వ్యవహారం



పొట్టిదిబ్బలంకలో మట్టిలోడు లారీలకు అడ్డుపెట్టిన వీఆర్వో నాగేశ్వరరావు స్కూటీ

తోట్లవల్లూరు, మే 16(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంకలో అనధికార మట్టితవ్వకాలపై అధికారులు ఉదాశీనంగా ఉండటం అనేక సందేహాలకు తావిస్తోంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా లేక అక్రమార్కులతో కుమ్మక్కవుతున్నారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం పొట్టిదిబ్బలంకలో అనధికారికంగా మట్టిలోడుతో వస్తున్న రెండు లారీలను వీఆర్వో బి.నాగేశ్వరరావు తన స్కూటీని అడ్డుపెట్టి ఆపి, రెవెన్యూ అధికారులకు అప్పగించి సీజ్ చేయించకపోవటం విమర్శలకు తావిస్తోంది. మీడియా ముందు అతి చేసిన వీఆర్వో ఆ తర్వాత రెండు మట్టిలోడు లారీలను వదిలేయటం.. అక్రమార్కులతో రాజీ పడటమేనని విమర్శలు వస్తున్నాయి. రవాణా నిబంధనలను ఉల్లంఘించి వే బిల్లులు లేకుండా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా అనధికారంగా మట్టిలోడుతో వెళుతూ పట్టుబడిన లారీలను సీజ్ చేసి పోలీస్ కేసు నమోదు చేయించకుండా..మట్టి మాఫియాను దర్జాగా వదిలిపెడితే అక్రమార్కులకు ఏం భయం ఉంటుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

20న మినీ జాబ్‌మేళా

కలెక్టరేట్, మే 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ అధ్వర్యంలో ఏపీ సీఆర్డీయే సౌజన్యంతో ఈనెల 20న ఉదయం 10 గంటలకు తుళ్లూరులోని సీఆర్డీయే స్కిల్ హబ్ కేంద్రంలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్, వరుణ్ మోటార్స్, స్కిల్‌క్రాఫ్ట్, వెకెన్ ఇండియా, ఐటీసీ, హ్యాపీ మొబైల్స్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లు మేళాలో పాల్గొంటున్నాయి. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, సర్వేయర్, ఇంజినీర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ట్రైనర్, క్లర్క్, మెషిన్ ఆపరేటర్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఏదైనా డిగ్రీ చదివిన ఫ్రెషర్స్ అనుభవం ఉన్నవారు హాజరుకావచ్చు. రూ.10 వేల నుంచి 30 వేల వరకు వేతనం లభిస్తుంది. అమరావతి, గుంటూరు, విజయవాడతో పాటు పరిసర ప్రాంతాలలో పనిచేయాలి. వివరాలకు గ్రామంలోని సీఆర్డీయే ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు. లేదా శంకర్ - 98484 24207, శ్రీకర్ - 99634 25999 నెంబర్లకు కాల్ చేయొచ్చని, సీఆర్డీయే అధికారులు తెలిపారు. నైపుణ్యం పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/లో జాబ్ మేళాకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు.

సహజీవనం చేస్తున్న వ్యక్తే పొడిచి చంపాడు

- అనుమానంతోనే ఘాతుకం
- మహిళ హత్యకేసు వివరాలు వెల్లడించిన ఏసీపీ తిలక్
- నిందితుడి అరెస్టు

నందిగామ, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మహిళ మల్లెల దుర్గాస్రవంతిని ఈనెల 1న హత్యచేసి పరారైన అచ్చి నరసింహారావు(పెద బాబును) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కళ్లుగప్పి పలు ప్రాంతాల్లో తలదాచుకున్న పెదబాబు కోర్టులో లొంగిపోయేందుకు నందిగామ వస్తుండగా, గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ ఏబీజీ తిలక్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. 'మృతురాలు మల్లెల దుర్గాస్రవంతితో నిందితుడు అచ్చి నరసింహారావు కొద్దికాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఆమెపై ఉన్న అనుమానంతో ఈ నెల 1న సాయంత్రం పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ సమీపంలో ఉంటున్న స్రవంతి ఇంటికి వెళ్లాడు. అత్యంత కిరాతకంగా పొడిచి చంపాడు. అనంతరం పరారయ్యాడు. పెదబాబుపై నందిగామ స్టేషన్‌లో 8 కేసులు, తిరుపతిలో ఒక కేసు ఉన్నా యి. నిందితుడు పలు కేసుల్లో చిక్కుకున్న సమయంలోనూ స్రవంతి బెయిల్ ఇప్పించింది. పెదబాబుపై రౌడీషీట్ ఉండేది. వైసీపీ హయాంలో షీట్ తీసేశారు. తిరిగి రౌడీషీట్ ఓపెన్ చేస్తాం. పీడీ చట్టం కూడా ప్రయోగిస్తాం. నిందితుడి కోసం నాలు గు టీమ్‌లు ఏర్పాటు చేసి గాలించాం. ఆయన బంధువులు, స్నేహితులను విచారిస్తున్న సమయంలో మా సిబ్బందికి చిక్కాడు.' అని ఏసీపీ తెలిపారు. అనంతరం నరసింహారావును కోర్టులో హాజరుపరిచారు. సీఐ వైవీవీఎల్ నాయు డు, ఎస్సై అభిమన్యు పాల్గొన్నారు.

పదోన్నతి ఉత్తర్వులు జారీ అయ్యేలా చూడండి

- మంత్రి కొల్లు రవీంద్రతో ఏపీ ఎన్జీవో నేతలు శివారెడ్డి, విద్యాసాగర్



మంత్రి కొల్లు రవీంద్రతో మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో నేతలు

కలెక్టరేట్, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ ఉద్యోగులు, వివిధ శాఖలకు చెందిన సర్వీసు మేటర్ల ప్రమోషన్ల విషయంలో చర్యలు తీసుకోవాలని, గ్రామ, వార్డు సచివాలయాలలో వైద్య ఆరోగ్యశాఖ విభాగంలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఏఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించారని, ఉత్తర్వులు జారీ అయ్యే లా చూడాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, ఎ.విద్యాసాగర్‌లు మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. శుక్రవారం మంత్రిని ఎన్జీవో నాయకులు ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ప్రమోషన్ చానల్‌ను అందరికీ అందుబాటుగా ఉండేలా నిర్వహించాలని కోరారు. ఉద్యోగుల ఉపాధ్యాయులు పీఆర్సీ కమిషన్ నియామకంపై, పెండింగ్ డీఎల్ మంజూరు కోసం ఎదురు చూస్తున్నారని ఎన్జీవో నాయకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో సేవలందిస్తున్న ఏఎన్ఎంలకు పదోన్నతులు కల్పించాలని, ఏపీ ఎన్జీవో సంబంధిత అధికారులు దృష్టికి తీసుకొచ్చిందని మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో ఎన్జీవో నాయకులు వీవీ ప్రసాద్, పి.రమేష్, సీవీఆర్ ప్రసాద్, ఎ.శ్రీనివాస్, వి.సీతారామయ్య, పురుషోత్తంరాజు, బి.వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

రాజధాని రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

- గ్రీవెన్స్‌డేలో అధికారులతో సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. తుళ్లూరులోని సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆయనకు కౌలు నగదు చెల్లింపు, ఎన్-13 రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, వారసులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, గ్రామకంఠం భూముల సమస్యలపై పలువురు రైతులు అర్జీలు అందించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అర్జీదారులు తెలియజేసిన సమస్యను అదనపు కమిషనర్ వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కౌలు నగదు చెల్లింపునకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల జరిగిన అనంతరం కౌలు నగదు రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని, గ్రామకంఠం భూములపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు అదనపు కమిషనర్ తెలియజేశారు. రాజధాని రైతుల ఫిర్యాదుల్లో అధికశాతం అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరీ, ఏజీ చిన్నికృష్ణ, బి.సాయిశ్రీనివాస్ నాయక్, రవీందర్, శేషిరెడ్డి, కె.ఎస్.భాగ్యరేఖ, పద్మావతి, భీమారావు, జీఆర్ఎం నోడల్ అధికారి జయశ్రీ, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



బండ లాగుతున్న ఎడ్ల జత

హోరాహోరీగా బండ లాగుడు పోటీలు

నందిగామ రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలపాడు గ్రామంలో తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం జూనియర్స్ విభాగం ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిది జతలు పాల్గొన్నగా 20 నిముషాల వ్యవధిలో 17.50 క్వింటాళ్ల బండ లాగినట్లు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల యజమానులకు అంబారుపేట సత్యమ్మ అమ్మవారి అలయ మాజీ ఛైర్మన్ గరికపాటి భాస్కరం సోదరులు వస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

న్యూ కేటగిరీ విభాగం విజేతలు

గురువారం రాత్రి జరిగిన న్యూ కేటగిరీ ఎడ్ల జతల విభాగంలో పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామానికి చెందిన సంపటం వీరబ్రహ్మనాయుడు ఎడ్ల జత 3823.08 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేలు గెలుచుకుంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన జక్కుల సహస్రయాదవ్, కోదాడకు చెందిన డాక్టర్ షేక్ హేసేన్ ఎడ్ల జత 3559.08 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.45 వేలు, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం తుర్కంపల్లికి చెందిన రోహన్ బాబు ఎడ్ల జత 3505.10 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ.40 వేలు, కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం చినపులిపాక గ్రామానికి చెందిన ఆర్ఏవీఎస్ బుల్స్, గన్నవరం మండలం తెంపల్లికి చెందిన కొలుసు శ్రీనివాసరావు యాదవ్ ఎడ్ల జత 3002 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో నిలిచి రూ.35 వేలు గెలుచుకుందని కమిటీ సభ్యులు తెలిపారు.

భోజన కుతూహలం

మంచి చేసే 'కామంచి'

మనం కొన్ని రకాలైన ఆకు కూరలనే వండుకుంటూ ఉంటాం. కానీ ఔషధ గుణాలున్న అనేక ఆకు కూరలు మనకు ప్రకృతిలో లభ్యమవుతాయి. అలాంటి ఒక మొక్క కామంచి. దీని గురించి 'భోజన కుతూహలం' గ్రంధంలో రఘునాథ సూరి సవివరంగా ప్రస్తావించాడు.

కామంచి టమోటా జాతికి చెందిన మొక్క. ఇది గుబురుగా పెరుగుతుంది. దీనిని చిన్న చిన్న కాయలు కాస్తాయి. కామంచి ఆకులు కొద్దిగా కారంగా.. చేదుగా ఉంటాయి. వీటిని తమిళులు ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు. ఈ ఆకులతో 'మనత్తక్కళి కొఝాంబు' అనే కూర వండుతారు. ఈ ఆకులను పాలకూర, మెంతికూర, తోటకూర వంటి ఆకు కూరలతో కలిపి వండి తింటే దోషాలు తొలగిపోతాయి. ఈ ఆకులను ఉడికించి తినాలి. లేదా వేయించుకొని తినాలి. అంతే తప్ప సలాడ్‌లో చేర్చి పచ్చి ఆకులు తినకూడదు. వీటిని పిల్లలకు, గర్భిణిలకు పరిమితంగా పెట్టాలి. ఇక ఈ ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో చూద్దాం..



- కామంచి ఆకులు ఫంగస్ వల్ల కలిగే వ్యాధులకు విరుగుడుగా పనిచేస్తాయి. ఈ ఆకులలో ఉండే కొన్ని ప్రత్యేక ఔషధ గుణాల వల్ల గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.
- ఈ ఆకులు అజీర్తి కారణంగా వచ్చే కడుపులో నెప్పిని తగ్గిస్తాయి. జీర్ణకోశ సమస్యలకు నివారణగా పనిచేస్తాయి.
- ఈ ఆకులు చర్మ వ్యాధులను తగ్గిస్తాయి. దురద, దద్దుర్లను ఉపశమనింపచేస్తాయి. ఈ ఆకులను ఎండబెట్టి పొడి చేసి పట్టిస్తే గజ్జి, తామర వంటి వ్యాధులు కూడా తగ్గుతాయి.
- కామెర్ల వ్యాధి రాకుండా ఈ ఆకులతో టీ కాచుకొని తాగితే మంచి ప్రయోజనముంటుంది. ఈ ఆకులు కాలేయం దెబ్బతినకుండా కాపాడతాయని అధ్యయనాలలో తేలింది.
- ఈ ఆకులతో తయారుచేసిన టీని క్రమం తప్పకుండా తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

సులభంగా లభించే ఔషధ మొక్కలను సమాజ హితం కోసం వాడటం చాలా కాలంగా వస్తోంది. ఉదాహరణకు తమిళనాడులో ఉత్సవాల సమయంలో వచ్చిన జనాలకు నేలవాము కషాయం పంచుతారు. ఇది అంటువ్యాధులు ప్రబలకుండా కాపాడుతుంది. తెలుగు ప్రాంతాల్లో కూడా జాతరలప్పుడు స్థానికంగా దొరికే వన మూలికల కషాయాలు ఇస్తుంటారు. కామంచి ఆకుల కషాయాన్ని ఉత్సవాలప్పుడు ఇస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

కళ్లజోడుతో.. కళ్లు చెదిరేలా...

మందగించిన కంటిచూపు కోసం కళ్లజోడు పెట్టుకోక తప్పదు. అలాంటప్పుడు వేసుకునే మేకప్ జోడుతో సరిజోడీగా ఉండేలా చూసుకోవాలి.



ఐలైనర్: కనురెప్పల పైనా, దిగువనా ఐలైనర్ తప్పనిసరిగా అప్లై చేసుకోవాలి. ఇందుకోసం పైకనురెప్పకు జెల్ ఐలైనర్ అప్లై చేసి, దిగువన పౌడర్ ఐలైనర్ ఉపయోగించాలి.

ప్రైమర్: ముక్కుకు ఇరువైపులా ప్రైమర్ అప్లై చేసి రూపమివ్వాలి. కళ్లద్దాలు ముక్కు మీదకు జారిపోతూ ఉంటాయి. కాబట్టి ఇలా తరచూ జరగకుండా ఉండడం కోసం, ముక్కు మీద కళ్లజోడు తగిలే ప్రదేశంలో ఐషాడో ప్రైమర్‌ను అద్దుకోవాలి

మస్కారా: కాలంచెల్లిన మస్కారా ధరిస్తే, పొడిగా జోడు మీద రాలిపడుతూ ఉంటుంది. తాజా మస్కారా ఎంచుకోవాలి. మూత తెరిచిన తర్వాత మస్కారాను మూడు నెలలకు మించి వాడుకోకూడదు. క్రీమీగా ఉండే వాటర్‌ప్రూఫ్ మస్కారానే ఉపయోగించాలి. ఇవి జోడుకు అంటుకోవు.

భూతద్దం: షార్ట్ సైట్ ఉన్నవాళ్లు జోడు ధరించకుండా మేకప్ వేసుకోలేరు. కాబట్టి జోడు లేకుండా మేకప్ వేసుకోవాలనుకుంటే, భూతద్దం కొనుక్కోవాలి. ఈ అద్దం దగ్గరుంటే, జోడుతో పని లేకుండా మేకప్ వేసుకోవచ్చు

ఐబ్రో: జోడు ఫ్రేమ్ కనుబొమలను కప్పేస్తున్నాయి కదా అని కనుబొమలను నిర్లక్ష్యం చేయకూడదు. వాటిని చక్కగా గ్రూమ్ చేసి, బ్రో పెన్సిల్‌తో దిద్దుకోవాలి. ఇలా చేస్తేనే జోడులో నుంచి కనుబొమలు స్పష్టంగా కనిపిస్తాయి.


బ్రష్: కురచ హ్యాండిల్ ఉన్న మేకప్ బ్రష్ ఎంచుకోవాలి. పొడవాటి హ్యాండిల్ మేకప్ బ్రష్‌లు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తాయి. కురచ బ్రష్షులతో మేకప్‌ను మరింత చక్కగా వేసుకోవచ్చు

స్ప్రే: కళ్లజోడు ధరించినప్పుడు కళ్ల చుట్టూ ఉండే ప్రదేశంలో తేలికగా చమట పడుతూ ఉంటుంది. కాబట్టి మేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రే ఉపయోగించాలి.

వంటిల్లు

వేసవి తాపాన్ని తగ్గించడంలో రాగి పిండిని విఎంచింది లేదు. దీనితో జావ, అంబలి, సంగటి, రొట్టె ఇలా ఎన్నో రకాల వంటలు చేస్తూ ఉంటాం. ఇవి కాక రాగి పిండితో చేసే వెరైటీ వంటకాలు మీ కోసం...

నోరూరించే రాగి రుచులు



రాగి కిచిడి

కావాల్సిన పదార్థాలు

రాగిపిండి- అర కప్పు, పెసరపప్పు- అర కప్పు, సగ్గుబియ్యం- అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- అయిదు, టమాటా ముక్కలు- అర కప్పు, కేరట్ ముక్కలు- అర కప్పు, అల్లం తరుగు- రెండు చెంచాలు, వెల్లుల్లి తరుగు- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, మిరియాలు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, నెయ్యి- నాలుగు చెంచాలు, జీడిపప్పు పలుకులు- రెండు చెంచాలు, జీలకర్ర- అర చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, ఇంగువ- చిటికెడు, కొత్తిమీర తరుగు- మూడు చెంచాలు, నిమ్మరసం- రెండు చెంచాలు

తయారీ విధానం

- ఒక గిన్నెలో పెసరపప్పు తీసుకుని నీళ్లు పోసి రెండుసార్లు కడగాలి. మరో గిన్నెలో రాగిపిండి వేసి కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ గరిటె జారుగా కలపాలి. ఉండలు రాకుండా చూసుకోవాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో కడిగిన పెసరపప్పు, సగ్గుబియ్యం, ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, కేరట్ ముక్కలు, అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు, మిరియాలు, పసుపు వేసి అవి మునిగేవరకూ నీళ్లు పోయాలి. మూతపెట్టి రెండు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి కుక్కర్‌ను దించి అది చల్లారాక మూత తీసి దానిలోని మిశ్రమాన్ని పప్పు గుత్తితో మెత్తగా మెదపాలి.
- కుక్కర్‌ను మళ్లీ స్టవ్‌మీద పెట్టాలి. పప్పు మిశ్రమం వేడెక్కాక అందులో రాగి పిండి మిశ్రమం పోస్తూ బాగా కలపాలి. తరవాత ఉప్పు వేసి కలిపి చిన్న మంట మీద పది నిమిషాలు ఉడికించాలి.
- స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నెయ్యి వేసి కరగించాలి. ఇందులో జీలకర్ర, ఇంగువ, జీడిపప్పు పలుకులు, కరివేపాకు వేసి వేపాలి. ఈ తాలింపును కుక్కర్‌లోని మిశ్రమంలో వేసి బాగా కలిపి రెండు నిమిషాలు ఉడికించాలి. తరవాత నిమ్మరసం, కొత్తిమీర తరుగు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కిచిడీని వేడివేడిగా సర్వ్ చేస్తే బాగుంటుంది.

జాగ్రత్తలు

- ఈ కిచిడీలో ఆలుగడ్డలు, క్యాలీఫ్లవర్ లాంటి ఇతర కూరగాయల ముక్కలతో పాటు పచ్చి బఠాణీలు కూడా వేసుకోవచ్చు.
- కిచిడీ ఉడుకుతున్నప్పుడు ముద్దలా అయిందనిపిస్తే కొన్ని వేడినీళ్లు కలుపుకోవాలి.
- నెయ్యి వద్దనుకుంటే నూనెతో తాలింపు పెట్టుకోవచ్చు.



రాగిపిండితో తయారుచేసే ఆహార పదార్థాలను తరచూ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. మలబద్ధకం రాదు. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. ఎముకలు దృఢంగా ఉంటాయి. కండరాలు బలోపేతమవుతాయి. కేటరాక్ట్ లాంటి కంటి సమస్యలు రావు. శరీరంలో వేడి తగ్గుతుంది.

రాగి తోప



కావాల్సిన పదార్థాలు

రాగిపిండి- ఒక కప్పు, బెల్లం- ఒక కప్పు, నీళ్లు- రెండు కప్పులు, నెయ్యి- నాలుగు చెంచాలు, పచ్చి కొబ్బరి తురుం- అర కప్పు, యాలకుల పొడి- అర చెంచా

తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో బెల్లం వేసి నీళ్లు పోసి కరిగించాలి. తరవాత ఈ బెల్లం నీళ్లను వడబోయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి కరగించాలి. ఇందులో రాగిపిండి వేసి బాగా కలుపుతూ కమ్మని వాసన వచ్చే వరకూ మూడు నిమిషాలపాటు వేయించాలి. తరవాత పచ్చి కొబ్బరి తురుం వేసి కలుపుతూ మరో రెండు నిమిషాలు వేయించాలి. ఈ మిశ్రమం వేగిన తరవాత అందులో బెల్లం నీళ్లు పోస్తూ ఉండలు కట్టకుండా గరిటెతో కలుపుతూ ఉండాలి. మధ్య మధ్యలో నెయ్యి వేస్తూ ఉండాలి. పిండి మిశ్రమం... నెయ్యిని విడుస్తూ గిన్నెకు అంటుకోకుండా ముద్దలా అయ్యేవరకూ తిప్పుతూనే ఉండాలి. తరవాత యాలకుల పొడి వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలోకి తీయాలి. చల్లారాక ముక్కలుగా కోసుకోవచ్చు. వేడిగా తిన్నా చల్లారాక తిన్నా ఈ రాగి తోప రుచిగానే ఉంటుంది.

జాగ్రత్తలు

- రాగి పిండిని చిన్న మంట మీద నిదానంగా వేయించాలి. లేదంటే పిండి మాడిపోతుంది.
- వేగిన పిండి మిశ్రమంలో బెల్లం నీళ్లు కలిపేటప్పుడు విస్కర్‌ను ఉపయోగిస్తే ఉండలు రావు.
- ఇందులో జీడిపప్పు, బాదం పప్పు, సార పప్పు, గుమ్మడి గింజలు లాంటివి కలుపుకోవచ్చు.

రాగులలో ఎక్కువగా పీచు పదార్థాలు, పిండి పదార్థాలు, ప్రోటీన్లు, కాల్షియం, పొటాషియం, సోడియం, ఐరన్, అయోడిన్ తదితర పోషకాలు ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను కరగిస్తాయి. రక్తహీనతను నివారిస్తాయి.

రాగి ఊతప్పం

కావాల్సిన పదార్థాలు

రాగిపిండి- ఒక కప్పు, అటుకులు- ఒక కప్పు, నీళ్లు- రెండున్నర కప్పులు, అల్లం- చిన్న ముక్క, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పచ్చి మిర్చి- మూడు, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు- అర కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కేరట్ తురుం- అర కప్పు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- అర కప్పు, కారం- అర చెంచా, ఉప్పు- తగినంత, జీలకర్ర- అర చెంచా, పసుపు- చిటికెడు, వంటసోడా- అర చెంచా, నిమ్మరసం- రెండు చెంచాలు, నూనె- తగినంత

తయారీ విధానం

- ఒక గిన్నెలో రాగిపిండి, అటుకులు వేసి ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి బాగా కలపాలి. గిన్నె మీద మూత పెట్టి పది నిమిషాలు నాననివ్వాలి.
- మిక్సీలో అల్లం, వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఇందులోనే రాగిపిండి మిశ్రమం, అర కప్పు నీళ్లు పోసి మరోసారి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పిండి మిశ్రమాన్ని వెడల్పాటి గిన్నెలోకి తీయాలి. పిండి గట్టిగా ఉందనిపిస్తే అర కప్పు నీళ్లు పోసి కలపాలి. ఇందులో కరివేపాకు తరుగు, అర కప్పు ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు, పావు కప్పు కేరట్ తురుం, పావు కప్పు కొత్తిమీర తరుగు, జీలకర్ర, పసుపు, కారం, ఉప్పు వేసి బాగా కలపాలి. తరవాత వంటసోడా వేసి దానిపై నిమ్మరసం చిలకరించి బుడగలు వచ్చిన తరవాత పిండిలోకి కలపాలి. పిండి మరీ గట్టిగా లేదా మరీ పలుచగా కాకుండా చూసుకుంటూ అవసరమైతే మరికొన్ని నీళ్లు కలపాలి.
- స్టవ్ మీద పెనం పెట్టి వేడయ్యాక ఒక చెంచా నూనె రాయాలి. దీనిమీద గరిటెడు పిండిని సమంగా పరచి పైన కొన్ని ఉల్లిపాయ ముక్కలు, కొంచెం కొత్తిమీర తరుగు, కొద్దిగా కేరట్ తురుం వేసి మూతపెట్టి రెండు నిమిషాలు ఉంచాలి. తరవాత మూత తీసి ఊతప్పం మీద అర చెంచా నూనె వేసి రెండో వైపునకు తిప్పి మరో రెండు నిమిషాలు ఉంచాలి. ఇలా రెండు వైపులా ఎర్రగా వేగిన ఊతప్పాన్ని పళ్లెంలోకి తీయాలి. దీనిని టమాటా, కొబ్బరి, పల్లీ చట్నీలతో తింటే రుచిగా ఉంటుంది. సాంబార్‌తో కూడా తినవచ్చు.



జాగ్రత్తలు

- రాగులను నీళ్లలో నానబెట్టి మొలకెత్తించి తరవాత ఆరబెట్టి తయారు చేసిన పిండిని తీసుకుంటే ఊతప్పం మరింత రుచిగా ఉంటుంది.
- వంటసోడా+నిమ్మరసం బదులు పావు కప్పు పుల్లని పెరుగు కలుపుకోవచ్చు.
- ఈ పిండితో ఇడ్లీ లేదా గుంట పొంగలాలు కూడా తయారు చేసుకోవచ్చు.

సంకల్పం

అమ్మ వేసిన గెలుపు బాట



జియా రాయ్... పదహారేళ్ల ఆటిజమ్ అమ్మాయి. గత ఏడాది... ఇంగ్లిష్ చానల్‌ను ఈదేసింది. ప్రపంచ రికార్డు నెలకొల్పింది. విజయం జియాదే..! కానీ... దాని వెనుకనున్న అసలు కష్టం... ఆమె తల్లి రచనా రాయ్‌ది. అందరిలా తన బిడ్డను సమున్నతంగా నిలబెట్టడం కోసం... వృత్తిని వదిలేసి... ఎన్నిటినో త్యాగం చేసి... స్విమ్మింగ్ నేర్చుకున్నారు 44 ఏళ్ల రచన. అమ్మగానే కాదు... ఒక స్నేహితురాలిగా... ఉపాధ్యాయురాలిగా... అన్నిటికీ మించి మంచి కోచ్‌గా కూతుర్ని ఉన్నతంగా తీర్చిదిద్దారు.

"ఉన్నది ఒకటే జీవితం. దాన్ని ఎంత హుందాగా, ఎంత అర్థవంతంగా జీవించామన్నదే ముఖ్యం. ఇన్నేళ్ల నా ప్రయాణంలో నాకు అర్థమైంది ఇది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరం మాది. ఓ పాఠశాలలో ఆర్గానిక్ కెమిస్ట్రీ బోధించేదాన్ని. మావారు మదన్ రాయ్ నేవీలో అధికారి. 2008లో మాకు పాప పుట్టింది. జియా అని పేరు పెట్టుకున్నాం. మా ఆకాంక్షలకు ప్రతిరూపం తను. కానీ రెండేళ్లు తిరిగేసరికి జియా ప్రవర్తనలో మార్పు కనిపించింది. తను బొమ్మలతో ఆడుకొనే తీరు మాకు వింతగా అనిపించేది. వైద్యులను సంప్రతిస్తే... జియాకు ఆటిజమ్ అని చెప్పారు. ఆటిజమ్ గురించి మాకు ఏమాత్రం అవగాహన లేదు. అప్పటికి వైద్యులు, సన్నిహితుల ద్వారా మాకు తెలిసింది ఏంటంటే... జియాకు నిరంతరం థెరపీలు చేయిస్తుండాలని, జీవితాంతం తను వేరొకరిపై ఆధారపడక తప్పదని.

కెరీర్ అనేది లేదన్నారు...

ఆటిజమ్ గురించి నేను, మావారు పరిశోధించాం. చాలా విషయాలు అవగాహనకు వచ్చాయి. మా అమ్మాయి పరిస్థితి కంటే నన్ను బాగా బాధించింది... ఇరుగుపొరుగు వారి వ్యాఖ్యలు. జియా ఎంతసేపూ మాపైనే ఆధారపడాలని, తనకు అసలు కెరీర్ అనేదే లేదని కొందరు అనేవారు. అవి నాలో పట్టుదల పెంచాయి. భగవంతుడు మనకు ఈ జీవితాన్ని ప్రసాదించాడు. అంటే ఆయన దృష్టిలో దానికి ఏదో ఒక కారణం ఉండే ఉంటుందనేది నా ప్రగాఢ విశ్వాసం.

ఉద్యోగం వదిలేసి...

నేను, మావారు కలిసి మా అమ్మాయికి మాటలు నేర్పించే ప్రయత్నం చేశాం. స్కూల్లో పని చేస్తూనే ఇంటి దగ్గర ట్యూషన్స్ చెప్పేదాన్ని. ఇంటి పనితో పాటు ఇవన్నీ చూసుకొంటూనే, జియాకు కావల్సినవి సమకూర్చేదాన్ని. క్షణం తీరిక లేకపోయినా ఏ రోజూ భారంగా భావించలేదు. అయితే జియాపై మరింత శ్రద్ధ పెట్టాలన్న ఉద్దేశంతో 2011లో ఉద్యోగం వదిలేశాను. ఇంటి దగ్గర ట్యూషన్లు కొనసాగించాను.

పిల్లలను దూరంగా తీసుకువెళ్లేవారు...

ఏడాది తరువాత మాకు అబ్బాయి పుట్టాడు. నాకు పని భారంతో పాటు బాధ్యతలు కూడా పెరిగాయి. దీంతో ట్యూషన్స్ కూడా మానేశాను. మరోవైపు జియా ప్రవర్తన చూసి చుట్టుపక్కల వారు 'మీ అమ్మాయి పిచ్చిదానిలా ఉంది' అంటూ తమ పిల్లలను జియాకు దూరంగా తీసుకువెళ్లేవారు. స్కూల్లో చేర్పిద్దామంటే... పాఠశాల యాజమాన్యాలు 'ప్రత్యేక పాఠశాలకు తీసుకువెళ్లండ'ని అనేవారు. చివరకు ఒక స్కూల్లో అడ్మిషన్ ఇచ్చారు.

మలుపు తిప్పిన ఈత...

బడికి అయితే వెళుతోంది కానీ... అందరూ జియాను జాలిగా చూడడం మొదలుపెట్టారు. అదే సమయంలో పాఠశాలలో ఈత పోటీలు జరిగాయి. అప్పటికే ఈతలో ప్రవేశం ఉండటం వల్ల జియా ఆ పోటీల్లో పాల్గొంది. విశేషమేమంటే... అందులో స్వర్ణ పతకం గెలిచింది. తోటి విద్యార్థులు చప్పట్లతో అభినందించారు. నా కళ్లు చెమర్చాయి. జియా జీవితాన్ని, తన పట్ల ఇతరుల ఆలోచనా విధానాన్ని సమూలంగా మార్చేసిన ఘట్టం అది. నాకు అర్థమైందేంటంటే... స్విమ్మింగ్ ద్వారా తనకు ఈ సమాజంలో తగిన గౌరవం లభిస్తుందని.

సవాళ్లు లేని ప్రయాణం లేదు...

జీవితంలో సవాళ్లు లేని ప్రయాణం అంటూ ఉండదు. జియా విషయంలో అడుగడుగునా ఎన్నో అడ్డంకులు, సమస్యలు. ఈత నేర్పిద్దామని ముంబయిలోని స్విమ్మింగ్ స్కూల్స్ చుట్టూ తిరిగాను. ఎవరూ తనను చేర్చుకోవడానికి ఇష్టపడలేదు. కొంతమంది శిక్షకులు ముందుకు వచ్చినా... తనకు అర్థమయ్యేలా చెప్పలేకపోయారు. ఇక లాభం లేదని నేనే ఈత నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. అప్పటివరకు నేను ఈత కొట్టిందిలేదు. కూతురు కోసం మొదటిసారి కొలనులోకి దిగాను.

అద్భుత విజయాలు ఎన్నో...

2019లో... తొలిసారి జియా జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. స్వర్ణ పతకం గెలిచింది. అది మొదలు ఎన్నో పతకాలు సాధించింది. గత ఏడాది ఇంగ్లిష్ చానల్‌ను అతిపిన్న వయసులో, అతితక్కువ సమయంలో ఈదిన ఆటిజమ్ బాలికగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 2022లో 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్', మరుసటి ఏడాది 'నేషనల్ అవార్డ్ ఫర్ డిజేబిలిటీ' అందుకుంది. మొత్తంగా కెరీర్‌లో ఇప్పటివరకు 39 స్వర్ణ పతకాలు గెలుచుకుంది. తన విజయాలు చూసినప్పుడు నా గుండె ఆనందంతో ఉప్పొంగుతుంది. ఈ విజయాలు జియాకు మాత్రమే కాదు... ఒక తల్లిగా నాకూ ఎంతో గర్వకారణం. ఒకసారి గుడికి వెళ్లినప్పుడు... జియా చేతులు జోడించి నా ముందు నిలుచుంది. అది గమనించిన ఒకావిడ... 'తన మనసులో మీరు, ఆ భగవంతుడు ఒక్కటే అని మీ అమ్మాయి భావిస్తోంది' అన్నారు. ఆ మాటలకు నా నోట మాట రాలేదు. నా కూతుర్ని గట్టిగా హత్తుకుని ఏడ్చేశాను. ప్రతిభకు పదును పెడితే ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వైకల్యం అడ్డు కాదని చెప్పడానికి జియా జీవితానికి మించిన రుజువు ఇంకేం కావాలి!"

నేర్చుకొని నేర్పించాను...

నాతోపాటు జియాను కూడా స్విమ్మింగ్ శిక్షణకు తీసుకువెళ్లేదాన్ని. 'మీరు నాకు ఈత నేర్పండి. మా అమ్మాయికి నేను నేర్పిస్తాను' అని ట్రైనర్‌కు చెప్పాను. నేను నేర్చుకున్నది నేర్చుకున్నట్టు తనకు అర్థమయ్యేలా వివరించేదాన్ని. తను కూడా ఇతరులకన్నా నేను చెబితే ఎంతో శ్రద్ధగా వినేది. ఇంట్లో ఉన్నప్పుడు స్విమ్మింగ్ వీడియోలు చూపించేదాన్ని. అలా క్రమంగా స్విమ్మింగ్‌లో జియా నైపుణ్యం సంపాదించింది. తన కోసం నా ఉద్యోగం వదిలేశాను. ట్యూషన్స్ మానేశాను. కానీ దాన్ని నేను త్యాగం అనను. ఎందుకంటే నా జీవితమే తను.

చెప్పులు లేదా షూల ఆకారంలో పాదాలమీద గుర్తులు కనిపిస్తుంటాయి. ఇలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించి ఆ గుర్తులను పోగొట్టుకోవచ్చు.

చెప్పుల మచ్చలా?

- ఒక గిన్నెలో రెండు చెంచాల టమాటా రసం, ఒక చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించి పావుగంట అలాగే ఉంచాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే రంగు మారిన పాదాలు యథాస్థితికి వస్తాయి. టమాటాలోని లైకోపిన్... చర్మం మీద సూర్యకాంతి ప్రభావాన్ని తగ్గిస్తుంది. నిమ్మరసం సహజ బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది.
- గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, నాలుగు చెంచాల పెరుగు, అర చెంచా పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించాలి. బాగా ఆరిన తరవాత చేతితో మెల్లగా మర్దన చేస్తూ పిండిని తొలగించాలి. తరవాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే పాదాలు రంగు తిరుగుతాయి. పెరుగులోని లాక్టిక్ ఆమ్లం... చర్మం మీద మృతకణాలను తొలగిస్తుంది. శనగపిండి చర్మ రంధ్రాలను శుభ్రం చేస్తుంది.



‘కార్వీ’ మదుపరులు త్వరపడండి

జూన్ 2లోగా క్లెయిమ్‌లు సమర్పించండి : సెబీ

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) నుంచి బకాయిలు తీసుకోవాల్సిన మదుపరులు త్వరగా తమ క్లెయిమ్‌లు సమర్పించాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కోరింది. ఇందుకు వచ్చే నెల రెండవ తేదీనే తుది గడువు అని గుర్తు చేసింది. కేఎస్‌బీఎల్‌ను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) 2023 నవంబరు 23న డిఫాల్టర్‌గా ప్రకటించింది. పవర్ ఆఫ్ అటార్నీ (పీఓఏ) ద్వారా తమ ఖాతాల్లోని షేర్లను కుదువపెట్టేందుకు కేఎస్‌బీఎల్‌కు అధికారం ఇచ్చిన మదుపరులు ఈ ఏడాది జూన్ 2 లోగా క్లెయిమ్‌లు సమర్పించాలని కోరింది. ఈ విషయంలో ఇంకా ఏమైనా సహాయం కావాలంటే ఎన్ఎస్ఈ టోల్ ఫ్రీ నంబరు 1800 266 0050 (ఐవీఆర్ ఆప్షన్ 5ను ఎంచుకోవాలి) ద్వారా లేదా defaultisc@nse.co.in ఈ-మెయిల్ ద్వారా ఎన్ఎస్ఈని సంప్రదించాలని కోరింది. గడువు దగ్గర పడుతున్నందున ఇప్పటి వరకు క్లెయిమ్స్ సమర్పించని మదుపరులు త్వరపడాలని కోరింది. పీఓఏ ద్వారా మదుపరుల ఖాతాల్లోని షేర్లను తాకట్టు పెట్టి, ఆ నిధులను ఇతర సంస్థలకు మళ్లించి, చెల్లింపుల్లో విఫలమవడంతో సెబీ 2023 ఏప్రిల్‌లో కేఎస్‌బీఎల్‌పై వేటు వేసింది. కేఎస్‌బీఎల్, దాని సీఎండీ సీ పార్థసారథి ఏడేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనరాదని నిషేధించింది. దాంతో పాటు నిధుల దుర్వినియోగానికి రూ.21 కోట్ల జరిమానా కూడా విధించింది.

నవ లిమిటెడ్ లాభం రూ.303 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నవ లిమిటెడ్.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,055.80 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.302.80 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 10.9 శాతం పెరగగా లాభం 18.8 శాతం వృద్ధి చెందింది. మార్చితో ముగిసిన పూర్తి సంవత్సరానికి గాను కంపెనీ రూ.4,135.20 కోట్ల ఆదాయంపై రూ.1,434 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఒక్కో షేరుకు రూ.6 తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. గతంలో ప్రకటించిన రూ.4 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనమని పేర్కొంది.

అన్ని విభాగాల్లో మెరుగైన వృద్ధి: గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీకి చెందిన మెటల్స్, మైనింగ్, ఇంధన విభాగాలు అత్యుత్తమ పనితీరును కనబరచటంతో మంచి వృద్ధిని నమోదు చేసినట్లు నవ లిమిటెడ్ సీఈఓ అశ్విన్ దేవినేని వెల్లడించారు. కాగా మార్చి త్రైమాసికంలో అనుబంధ సంస్థ నవభారత్ ప్రాజెక్ట్స్ నుంచి రూ.30.4 కోట్ల డివిడెండ్‌ను అందుకున్నట్లు ఆయన చెప్పారు. దీంతో 2024-25లో అనుబంధ సంస్థల నుంచి అందుకున్న డివిడెండ్ రూ.114.30 కోట్లకు చేరుకుందన్నారు.

ఆదుకోండి.. మహాప్రభో!

ప్రభుత్వానికి వొడాఫోన్ ఐడియా లేఖ ▸▸ లేకపోతే దివాలా తప్పదు



న్యూఢిల్లీ: టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా కథ కంచికి చేరే సూచనలు కనిపిస్తున్నాయి. పీకల్లోతు అప్పులు, నష్టాల్లో ఉన్న తమను ఆదుకోవాలని మరోసారి ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం తమ వద్ద ఉన్న నిధులతో మహా అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) చివరి వరకు నెట్టుకురాగలమని స్పష్టం చేసింది. కొత్త రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు కూడా ముందుకు రావడం లేదని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆదుకోకపోతే 2026 మార్చి తర్వాత దుకాణం నడపడం మా వల్ల కాదని కంపెనీ సీఈఓ అక్షయ ముంద్రా గత నెల 17న కేంద్ర టెలికాం శాఖ (డాట్) కార్యదర్శికి ఒక లేఖ రాశారు. వచ్చే ఏడాది మార్చిలోగా ప్రభుత్వ సాయం అందకపోతే దివాలా కోసం ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేదని కూడా ఆయన ఆ లేఖలో తేల్చి చెప్పారు.

మూసివేత తప్పదా !

బ్యాంకుల నుంచి కొత్త అప్పులు పుట్టకపోతే నెట్‌వర్క్ విస్తరణ, ఆధునీకరణకు చిల్లిగవ్వ కూడా ఖర్చు చేయలేమని వొడాఫోన్ ఐడియా సీఈఓ తన లేఖలో డాట్‌కు తేల్చి చెప్పారు. అదే జరిగితే గత ఏడాది కాలంగా చేసిన పెట్టుబడి ఖర్చులూ బూడిదలో పోసిన పన్నీరుగా మారతాయని హెచ్చరించారు. అప్పుడు కంపెనీ ఆస్తుల విలువ పడిపోతుందని స్పష్టం చేశారు. కంపెనీ ఈక్విటీలో ఇప్పటికే ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. ఏజీఆర్, స్పెక్ట్రమ్ బకాయిల్లో కొంత మొత్తాన్ని ఈక్విటీగా మార్చడం ద్వారా ప్రభుత్వం ఈ వాటా తీసుకుంది. అయినా కంపెనీ ప్రభుత్వానికి ఇంకా రూ.1.18 లక్షల కోట్ల వరకు బకాయిలు చెల్లించాలి. సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు నేపథ్యంలో ఏజీఆర్ బకాయిలపై ప్రభుత్వం ఇంకా వెసులుబాటు కల్పించే స్థితిలో లేదు. దీంతో వొడాఫోన్ ఐడియా ఎన్‌సీఎల్‌టీకి వెళితే కంపెనీ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ఆ స్థితి నుంచి తప్పించుకోవాలంటే ఏదో ఒక కంపెనీ ముందుకు వచ్చి వొడాఫోన్ ఐడియా ఆస్తులను కొనుగోలు చేయాలి. ఇందుకు ఏ కంపెనీ ముందుకు వస్తుందన్నది ప్రస్తుతం పెద్ద ప్రశ్న. మరోవైపు అదానీ గ్రూప్ రంగ ప్రవేశం చేసి వొడాఫోన్ ఐడియాను దక్కించుకునే అవకాశం ఉందనే వార్తలు గుప్పుమంటున్నాయి.

రూ.1.95 లక్షల కోట్ల బకాయిలు

వొడాఫోన్ ఐడియా ఇప్పటికే ప్రభుత్వానికి ఏజీఆర్, స్పెక్ట్రమ్ బకాయిల రూపంలో రూ.1.95 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో పెనాల్టీలు, ఆ జరిమానాలపై వడ్డీల రూపంలో చెల్లించాల్సిన రూ.30,000 కోట్లను చెల్లింపుల నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించేలా గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ ఈ నెల 19న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు రానుంది. ఈ పిటిషన్ దాఖలు చేసిన మరునటి రోజే ఈ లేఖ బయటికి రావడం విశేషం.

హెరిటేజ్ ఫుడ్స్ లాభంలో 77% వృద్ధి

- 2024-25లో రూ.188 కోట్లుగా నమోదు
- క్యూ4 లాభం రూ.38 కోట్లు
- ఒక్కో షేరుకు 50 శాతం డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.1,000 కోట్ల రెవెన్యూను సాధించినట్లు ప్రకటించింది. ఒక త్రైమాసిక కాలంలో రికార్డు స్థాయి ఆదాయాలను ఆర్జించటం ఇదే మొదటిసారని వెల్లడించింది. జనవరి-మార్చి త్రైమాసికం (క్యూ4)లో కంపెనీ రూ.1,048.46 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.38.16 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.950.56 కోట్లుగా ఉండగా లాభం రూ.40.49 కోట్లుగా ఉంది. అంతేకాకుండా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక రెవెన్యూ కూడా రికార్డు స్థాయిలో రూ.4,134.60 కోట్లుగా నమోదైనట్లు హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే గత ఆర్థిక సంవత్సర లాభం ఏకంగా 77 శాతం వృద్ధి చెంది రూ.188.28 కోట్లుగా నమోదైందని పేర్కొంది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.5 ముఖ విలువతో కూడిన ప్రతి షేరుకు రూ.2.50 (50 శాతం) డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది

పెరిగిన విలువ ఆధారిత ఉత్పత్తుల వాటా

2024-25 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ ప్రతి త్రైమాసికంలో నిలకడగా 10 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటూ వచ్చినట్లు హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా తెలిపారు. దీంతో రికార్డు స్థాయిలో ఆదాయాలను ఆర్జించినట్లు ఆమె పేర్కొన్నారు. కాగా మార్చి త్రైమాసిక ఆదాయాల్లో విలువ ఆధారిత ఉత్పత్తుల (వీఏపీ) వాటా 30.1 శాతం నుంచి 32.5 శాతానికి పెరిగిందని తెలిపారు. పెరుగు, పన్నీర్ విభాగంలో మార్కెట్‌తో పాటు కస్టమర్ బేస్‌ను పెంచుకోవటం ఎంతగానో కలిసివచ్చిందని బ్రహ్మణి తెలిపారు.

ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ

200 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: ఐటీ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడటంతో పాటు భారతీ ఎయిర్‌టెల్ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ 200.15 పాయింట్లు కోల్పోయి 82,330.59 వద్దకు జారుకుంది. నిఫ్టీ 42.30 పాయింట్ల నష్టంతో 25,019.80 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.18 శాతం, మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.85 శాతం లాభపడ్డాయి. రంగాలవారీ సూచీల్లో ఇండస్ట్రియల్స్, రియల్టీ, క్యాపిటల్‌గూడ్స్, యుటిలిటీస్, పవర్ 1.80 శాతం వరకు పెరిగాయి. ఐటీ, టెక్, ఫోకస్డ్ ఐటీ, మెటల్, బ్యాంకింగ్ ఇండెక్స్‌లు మాత్రం నష్టాల్లో ముగిశాయి. ఈ వారంలో సెన్సెక్స్ 2,876.12 పాయింట్లు (3.61 శాతం), నిఫ్టీ 1,011.8 పాయింట్లు (4.21 శాతం) లాభపడ్డాయి.

చార్జ్ పవర్‌తో ఫ్యూర్ జట్టు

ఎనర్జీ స్టోరేజీ సంస్థ ఫ్యూర్.. కెనడాకు చెందిన చార్జ్ పవర్‌తో జట్టు కట్టింది. కెనడా, అమెరికాలోని ఎనర్జీ స్టోరేజీ మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఫ్యూర్ పేర్కొంది. ఫ్యూర్‌కు చెందిన అడ్వాన్స్‌డ్ ఇంధన స్టోరేజీ ఉత్పత్తుల శ్రేణిని కో-బ్రాండింగ్ ఒప్పందం ద్వారా ఇరు దేశాల్లోని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం లభించనుందని తెలిపింది.

నం.2 స్థానాన్ని తిరిగి చేజిక్కించుకుంటాం

హ్యుండయ్ సీఓఓ తరుణ్ గార్గ్

న్యూఢిల్లీ: దేశీయ కార్ల మార్కెట్లో నం.2 స్థానాన్ని తిరిగి చేజిక్కించుకుంటామని హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) తరుణ్ గార్గ్ అన్నారు. ఇందుకోసం కంపెనీ కార్యకలాపాల్లో దూకుడు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా మార్కెట్లోకి పలు కొత్త మోడల్ కార్లను విడుదల చేయడంతో పాటు గ్రామీణ, సంస్థాగత మార్కెట్లలో, పాత కార్ల (ప్రీ-ఓన్డ్) విభాగంలో విక్రయాలను పెంచేందుకు కృషి చేయనున్నట్లు శుక్రవారం కంపెనీ ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఆయన తెలిపారు. దేశీయ మార్కెట్లో చాలా కాలంగా రెండో అతిపెద్ద కార్ల విక్రయదారుగా కొనసాగుతూ వచ్చిన హ్యుండయ్.. గత నెలలో నాలుగో స్థానానికి జారుకుంది. విక్రయాలపరంగా మారుతి సుజుకీ తర్వాత రెండు, మూడు స్థానాలను మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ ఆక్రమించాయి.

క్యూ4 లాభం రూ.1,614 కోట్లు: మార్చి త్రైమాసికం (క్యూ4)లో హ్యుండయ్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4 శాతం తగ్గి రూ.1,614 కోట్లకు జారుకుంది. ఆదాయం మాత్రం రూ.17,940 కోట్లకు పెరిగింది.

ఎగుమతుల్లో 4 రంగాలదే 50% పైగా వాటా

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత ఎగుమతుల్లో 50 శాతానికి పైగా వాటా వ్యవసాయం, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్ ఉత్పత్తులదేనని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. దేశంలో తయారీని, విలువ ఆధారిత ఎగుమతులను పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో భారత్ భిన్న రంగాల్లో బలోపేతమవుతుందని ఇది సూచిస్తోంది. 2024-25లో భారత్ నుంచి 43,742 కోట్ల డాలర్ల ఎగుమతులు జరిగాయి. ప్రస్తుత మారకం రేటు ప్రకారం ఈ విలువ దాదాపు రూ.37.40 లక్షల కోట్లు. అందులో ఇంజనీరింగ్ ఉత్పత్తుల వాటా 26.67 శాతంగా ఉండగా.. వ్యవసాయ రంగం 11.85%, ఫార్మా 6.96%, ఎలక్ట్రానిక్స్ 8.82% వాటా కలిగి ఉన్నాయి. ఈ నాలుగు రంగాల మొత్తం వాటా 54.3 శాతంగా ఉంది.

- గత ఆర్థిక సంవత్సరం ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 32.46 శాతం వృద్ధితో 3,858 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.3.30 లక్షల కోట్లు) పెరిగాయి. ప్రధానంగా యూఏఈ, అమెరికా, నెదర్లాండ్స్, బ్రిటన్, ఇటలీకి ఈ ఎగుమతులు జరిగాయి.
- ఇంజనీరింగ్ ఉత్పత్తులు 6.74 శాతం పెరిగి 11,667 కోట్ల డాలర్లకు (రూ.9.98 లక్షల కోట్లు) చేరాయి. అమెరికా, యూఏఈ, సౌదీ అరేబియా, యూకే, జర్మనీకి ఈ ఉత్పత్తుల ఎగుమతులు అధికంగా జరిగాయి.
- ఔషధాల ఎగుమతులు 9.4 శాతం వృద్ధితో 3,047 కోట్ల డాలర్లుగా (రూ.2.61 లక్షల కోట్లు) నమోదయ్యాయి. మన ఔషధాలు 200కు పైగా దేశాలకు ఎగుమతవుతున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ రంగ ఎగుమతులు వరుసగా పెరుగుతూ వస్తున్నాయి.
- వ్యవసాయం, దాని సంబంధిత రంగాల నుంచి ఎగుమతులు 7.36 శాతం పెరిగి 5,186 కోట్ల డాలర్లకు (రూ.4.43 లక్షల కోట్లు) చేరాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	525
వరంగల్	517	గోదావరి	525
చిత్తూరు	603	విశాఖపట్నం	530
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	124
వరంగల్	120	గుంటూరు	125
కరీంనగర్	120	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	115
కర్నూలు	120	నెల్లూరు	120
విశాఖపట్నం	121	అనంతపురం	120
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,130 ▲	87,200 ▲	1,08,000 ▲
విజయవాడ	96,500 ▲	90,500 ▲	99,700 ▲
విశాఖపట్నం	95,630 ▼	87,200 ▲	1,08,000 ▼
రాజమండ్రి	95,130 ▲	87,200 ▲	96,800 ▼
ప్రొద్దుటూరు	95,800 ▲	88,140 ▲	98,100 ▲
ముంబై	92,301 ▼	84,548 ▼	94,606 ▲

స్పోర్ట్స్

భళా..బల్లెం వీరా!

90 మీటర్ల మార్క్‌తో నీరజ్ చరిత్ర

డైమండ్ లీగ్‌లో భారత స్టార్‌కు రెండోస్థానం ● వెబర్‌కు మొదటి స్థానం



దోహా: మన బల్లెం వీరుడు భళా అనిపించాడు.. మరోసారి అసాధారణ ప్రదర్శనతో దేశం ఉప్పొంగేలా చేశాడు. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న తన ‘లక్ష్యాన్ని’ జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా చేరుకున్నాడు. దోహాలో శుక్రవారం జరిగిన ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ టోర్నీలో నీరజ్.. మూడో ప్రయత్నంలో ఈటెను 90.23 మీటర్ల దూరం విసిరాడు. అయితే, హోరాహోరీగా సాగిన పోటీలో జర్మనీకి చెందిన జులియన్ వెబర్ టైటిల్ దక్కించుకున్నాడు. కాగా.. చాలాకాలంగా 90 మీటర్ల లక్ష్యానికి గురిపెట్టిన నీరజ్ ఏకంగా దానిని మించిన దూరంలో ఈటెను విసరడం విశేషం. తొలి ప్రయత్నంలోనే 88.44 మీటర్ల దూరం విసిరిన చోప్రా..ప్రధాన ప్రత్యర్థులు అండర్సన్ పీటర్స్, జులియన్ వెబర్‌లకు అందనంత దూరంలో నిలిచాడు. రెండో రౌండ్‌లో ఫౌల్ చేసిన భారత అథ్లెటిక్స్ పోస్టర్ బాయ్ నీరజ్ మూడో రౌండ్‌లో ఏకంగా 90.23 మీ.దూరంతో కెరీర్‌లో అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఇక..నీరజ్ గత అత్యుత్తమ దూరం 89.94 మీ. దీనిని 2022 స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్‌లో నెలకొల్పాడు. అది జాతీయ రికార్డు కూడా కావడం విశేషం. కాగా..అంతకుముందు ఈ సీజన్ అత్యుత్తమ దూరాన్ని (84.52 మీ) నీరజ్ తొలి ప్రయత్నం (88.44 మీ.)లోనే అధిగమించాడు. నాలుగో ప్రయత్నంలో 80.56 మీ. దూరం విసిరిన 27 ఏళ్ల చోప్రా, ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. ఆరో, ఆఖరి ప్రయత్నంలో 88.20 మీ. దూరంతో సరిపెట్టుకున్నాడు.



వెబర్‌తో చోప్రా

విజేత వెబర్: నీరజ్‌కు దోహా అంచె టైటిల్ ఖాయమని అనుకున్న దశలో..జర్మనీకి చెందిన జులియన్ వెబర్ అనూహ్యంగా దూసుకొచ్చాడు. ఐదో రౌండ్‌లో 89.84 మీ. దూరం విసిరి చోప్రాకు సమీపంలోకి వచ్చిన వెబర్..ఆరో రౌండ్‌లో 91.06 మీ. దూరం ఈటెను విసిరి టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఈ దూరం వెబర్‌కు వ్యక్తిగత అత్యుత్తమం కూడా. అండర్సన్ పీటర్స్ (గ్రెనడా- 85.64 మీ.)కు మూడోస్థానం దక్కింది. ఈ విభాగంలో పోటీపడిన మరో భారత అథ్లెట్ శ్రీకాంత్ జెనా ఎనిమిది స్థానంతో నిరాశపరిచాడు.

పారుల్..జాతీయ రికార్డ్: మహిళల మూడు వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో భారత్‌కు చెందిన పారుల్ చౌధురి 9ని13.39 సె. గమ్యం చేరి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. అయితే ఈ విభాగంలో ఆమె ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచింది.

3

90 మీ. మార్క్‌ను చేరుకున్న మూడో ఆసియా అథ్లెట్‌గా నీరజ్ రికార్డు నెలకొల్పాడు. అర్షద్ నదీమ్ (పాకిస్థాన్, 92.97 మీ.), చావో సున్ చెంగ్ (తైపీ, 91.36 మీ.) ఇంతకు ముందు ఈ మార్క్‌ను అందుకున్నారు. ఓవరాల్‌గా..అంటే ప్రపంచంలో ఈ ఘనత సాధించిన 25వ అథ్లెట్‌గా చోప్రా నిలిచాడు.

కోహ్లీపైనే కళ్లన్నీ!

నైట్‌రైడర్స్‌తో ఆర్సీబీ ఢీ ● ఐపీఎల్ పున:ప్రారంభం నేడు



నేటి మ్యాచ్	వేదిక బెంగళూరు
బెంగళూరు x కోల్‌కతా	రా.7.30 నుంచి

బెంగళూరు: ఇండో-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వారం రోజుల క్రితం అర్ధంతరంగా నిలిచిపోయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పున:ప్రారంభానికి రంగం సిద్ధమైంది. శనివారం నుంచి మళ్లీ లీగ్ జరుగనుంది. ఇందులో భాగంగా తొలి మ్యాచ్‌లో ఇక్కడి చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆతిథ్య రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. కాగా, ఈ పోరులో అందరి దృష్టి విరాట్ కోహ్లీపైనే ఉండనుంది. ఐపీఎల్ విరామం సమయంలో అనూహ్యంగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచిన కోహ్లీ.. ఈ సీజన్ లీగ్‌లో అద్భుతంగా ఆడుతున్నాడు. ఈ తరుణంలో కేకేఆర్‌తో మ్యాచ్‌లో విరాట్ మరోసారి అదరగొట్టే అవకాశముంది.


రహానె

రజత్ పటీదార్ సారథ్యంలోని ఆర్సీబీ జట్టు లీగ్‌లో ఇప్పటికే 11 మ్యాచ్‌లాడి 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు అడుగుదూరంలో ఉంది. కోల్‌కతాపై నెగ్గి నాకౌట్ బెర్త్ ఖాయం చేసుకోవాలన్న పట్టుదలతో ఆర్సీబీ ఉంది. మరోవైపు 12 మ్యాచ్‌లాడి 11 పాయింట్లతో ఉన్న డిఫెండింగ్ చాంపియన్, రహానే కెప్టెన్సీలోని నైట్‌రైడర్స్‌కు ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరుజట్ల మధ్య జరిగే ఈ రసవత్తర పోరు అభిమానులను అలరించడం ఖాయం.

స్టార్క్ అవుట్

- స్టొయినిస్, ఇన్‌గ్లిస్ రాకతో పంజాబ్‌లో జోష్



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో తొలి టైటిల్ కోసం ఎదురుచూస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. వాయిదా తర్వాత శనివారం పునఃప్రారంభమవుతున్న ఐపీఎల్‌కు తాను దూరమవుతున్నట్టు స్టార్ పేసర్ విచెల్ స్టార్క్ ప్రకటించాడు. భారత్-పాక్ యుద్ధం కారణంగా లీగ్ వారంపాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే ఢిల్లీ జట్టులోని ఎక్కువ మంది విదేశీ ఆటగాళ్లు మాత్రం భారత్ వచ్చేందుకు ఇష్టపడడం లేదు. అటు స్టార్క్ తన గైర్హాజరు విషయాన్ని ఢిల్లీ యాజమాన్యానికి తెలుపగా, వారు కూడా అతడి నిర్ణయాన్ని గౌరవించినట్టు సమాచారం. అయితే ఢిల్లీ వైస్ కెప్టెన్ డుప్లెసీ తన రాకను ధ్రువీకరించాడు. ఇక స్టబ్స్ లీగ్ మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉండి ఆ తర్వాత డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం లండన్ వెళ్తాడు. ఇక, కేవలం ఒక్క మ్యాచ్ ఆడిన డొనోవాన్ ఫెరీరా కూడా జట్టుకు దూరమవుతున్నానని ప్రకటించాడు.

బెంగళూరు, పంజాబ్‌లకు ఊరట: టాప్-3లో కొనసాగుతున్న బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లకు కీలక ఆటగాళ్ల రాకతో ఊరట లభించింది. బెంగళూరు పేసర్ హాజెల్‌వుడ్ ప్లేఆఫ్స్‌కు అందుబాటులో ఉంటాడు. ఇక ఆల్‌రౌండర్ స్టొయినిస్‌తో పాటు వికెట్ కీపర్ ఇన్‌గ్లిస్‌ల రాకపై సందేహాలు వీడాయి. తాము భారత్‌కు రానున్నట్టు వెల్లడించడంతో పంజాబ్ శిబిరంలో సంతోషం నెలకొంది. ముంబై ఆల్‌రౌండర్ విల్ జాక్స్ కేవలం లీగ్ మ్యాచ్‌ల కోసం భారత్‌కు రానున్నాడు.

ఈ గౌరవాన్ని ఊహించలేదు

వాంఖడేలో స్టాండ్ ఆవిష్కరణపై రోహిత్



ముంబై: రోహిత్ శర్మకు అరుదైన గౌరవం దక్కింది. వాంఖడే స్టేడియంలో అతడి పేరిట నెలకొల్పిన స్టాండ్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు రోహిత్ తల్లిదండ్రులు, భార్య రితిక హాజరయ్యారు. శరద్ పవార్, అజిత్ వాడేకర్‌ల పేరిట కూడా స్టాండ్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి గురైన రోహిత్.. ‘ఇలాంటి గౌరవం దక్కుతుందని ఊహించలేదు. చిన్నతనంలో ముంబై, భారత జట్టుకు ఆడాలని కోరుకున్నా కానీ, వీటి గురించి ఆలోచించలేదు. వాంఖడే స్టేడియంతో ఎన్నో జ్ఞాపకాలున్నాయి. గొప్ప ఆటగాళ్లు, రాజకీయ నేతల మధ్య నా పేరు ఉండడాన్ని మాటల్లో వర్ణించలేను. 21న ఢిల్లీతో మ్యాచ్ ఆడేందుకు ఇక్కడికి వచ్చినప్పుడు ప్రత్యేక అనుభూతి దక్కనుంద’ని అన్నాడు.

ప్రజ్ఞానంద ‘సూపర్’



క్లాసిక్ టోర్నీ విజేత భారత జీఎం

బుఖారెస్ట్ (రుమేనియా): సూపర్ బెట్ చెస్..రుమేనియా అంచె క్లాసిక్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద విజేతగా నిలిచాడు. శుక్రవారం జరిగిన టైబ్రేకర్లలో ప్రజ్ఞానంద 1.5 పాయింట్లు సాధించి టైటిల్ అందుకున్నాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్లు ముగిసే సరికి ప్రజ్ఞానంద, అలీరెజా ఫిరౌజా (ఫ్రాన్స్), మాక్సిమ్ లగ్రావ్ (ఫ్రాన్స్) తలా 5.5 పాయింట్లతో సమంగా నిలిచారు. దాంతో బ్లిట్జ్ గేమ్‌ల టైబ్రేకర్లు నిర్వహించగా..మొదట ఫిరౌజాతో డ్రా చేసుకున్న ప్రజ్ఞానంద రెండో టై బ్రేకర్‌లో లగ్రావ్‌పై విజయం సాధించాడు.

టిమ్..స్టేడియంలో స్విమ్!



బెంగళూరు: మండే ఎండల్లో వరుణుడు దంచి కొడుతుంటే..ఆ జోరు వానలో తడుస్తుంటే..వావ్..ఆ అనుభూతి మాటల్లో వర్ణించలేనిది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్టార్ ఆల్‌రౌండర్ టిమ్ డేవిడ్ కూడా అలాంటి వాతావరణంలో ఒక్కసారిగా చిన్నపిల్లాడిలా మారిపోయాడు. ఐపీఎల్ పునఃప్రారంభంలో భాగంగా శనివారం చిన్నస్వామి స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో బెంగళూరు తలపడనుంది. అయితే శుక్రవారం కురిసిన భారీ వర్షంతో స్టేడియం తడిసి ముద్దయ్యింది. డేవిడ్ జోరు వానలో తడుస్తూ..మైదానంపై కప్పిన కవర్లపై చేరిన వర్షపు నీటిలో ఈదుతూ ఎంజాయ్ చేశాడు.

కరుణ్‌కు పిలుపు

- శార్దూల్‌కు కూడా..
- ఇంగ్లండ్ ‘ఎ’తో పోరుకు భారత్ ‘ఎ’ జట్టు

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో పర్యటించే భారత్ ‘ఎ’ జట్టుకు అభిమన్యు ఈశ్వరన్ నేతృత్వం వహించనున్నాడు. 18 మందితో కూడిన జట్టును సెలెక్టర్లు శుక్రవారం ప్రకటించారు. రంజీల్లో అద్భుత ప్రదర్శన కనబర్చిన కరుణ్ నాయర్‌కు చోటు కల్పించారు. ఇంగ్లండ్ ‘ఎ’తో ఈనెల 30 నుంచి జరిగే రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో అతను మెరుగైన ప్రదర్శన కనబరిస్తే తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కొచ్చు. కరుణ్‌తో పాటు పేసర్ శార్దూల్ ఠాకూర్‌ను జట్టులో చేర్చారు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. ఇషాన్ కిషన్ రెండో కీపర్‌గా ఉంటాడు. ఇక ఐపీఎల్‌లో సన్‌రైజర్స్, రాజస్థాన్ జట్లు ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకోవడంతో నితీశ్ కుమార్, ఇషాన్, జైస్వాల్‌ను ఎంపిక చేశారు. చెన్నై కెప్టెన్ రుతురాజ్ ఈ టూర్‌కు అందుబాటులో ఉండనున్నాడు. గిల్, సాయి సుదర్శన్ మాత్రం జూన్ 6 నుంచి జరిగే రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటారు. అలాగే భారత్ ‘ఎ’ జూన్ 13 నుంచి నాలుగు రోజుల మ్యాచ్‌లోనూ తలపడనుంది.

భారత్ ‘ఎ’ జట్టు: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), జైస్వాల్, రుతురాజ్, కరుణ్, జురెల్, నితీశ్ కుమార్, శార్దూల్, ఇషాన్, సర్ఫరాజ్, ముకేశ్, తుషార్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, కాంబోజ్,ఖలీల్, తుషార్, హర్ష్ దూబే, సుతార్, గిల్, సుదర్శన్ (వీరిద్దరూ రెండో మ్యాచ్‌కు).



భుజ్ ఎయిర్‌బేస్‌లో సైనికులకు మిఠాయి తినిపిస్తున్న రాజ్‌నాథ్

ఆపరేషన్ సిందూర్ ట్రైలరే!

» ఉగ్రవాదానికి తగిన బదులిచ్చేందుకు సిద్ధం: రాజ్‌నాథ్

భుజ్, మే 16: ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, జరిగింది ఒక ట్రైలర్ మాత్రమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. సరైన సమయంలో మొత్తం సినిమా చూపిస్తామని పాకిస్థాన్‌ను హెచ్చరించారు. భారత సార్వభౌమాధికారానికి ముప్పు కలిగించాలని ఎవరైనా చూస్తే.. తగిన విధంగా బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి తగిన బదులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. శుక్రవారం గుజరాత్‌లోని భుజ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించిన రాజ్‌నాథ్.. అక్కడి వైమానిక బలగాలతో మాట్లాడారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల సమయంలో పాక్ లక్ష్యంగా చేసుకొన్న సైనిక స్థావరాల్లో ఇది ఒకటి. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను ఏ విధంగా ధ్వంసం చేశామో ప్రపంచమంతా చూసిందని, ఉగ్రవాదానికి మద్దతు పలకడం ఆపకుంటే.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌లో వైమానిక దళం కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత దళాలు శత్రువుపై ఆధిపత్యం చూపడమే కాకుండా, ఉగ్రవాద నిర్మూలనలో కూడా విజయం సాధించాయని పేర్కొన్నారు.

దాయాదిపై 'దౌత్య' యుద్ధం!

» పలు దేశాలకు ఎంపీలను పంపించాలని నిర్ణయం

న్యూఢిల్లీ, మే 16 : ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ఎదుట దోషిగానూ, ఏకాకిగానూ నిలబెట్టే దౌత్యపరమైన చర్యలను భారత్ తీవ్రతరం చేసింది. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా జరిగిన ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులు, ఆ ఆపరేషన్ జరిగిన తీరును ప్రపంచానికి తెలియజేసేందుకు సిద్ధమవుతోంది. దీనికోసం పార్లమెంటు సభ్యులను బృందాలుగా చేసి పలు దేశాలకు పంపాలని నిర్ణయించినట్టు ప్రభుత్వ అధికార వర్గాల సమాచారం. ఈ బృందాల్లో అన్ని రాజకీయ పార్టీల సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ఈ బృందాలకు కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు నాయకత్వం వహిస్తారని, ఈ నెల 22 లేక 23 తేదీల్లో అవి బయలుదేరి వెళతాయని తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఇప్పటికే ప్రతినిధుల బృందంలో ఉండే ఎంపీలకు ఆహ్వానాలు వెళ్లాయి. ఒక్కో బృందంలో ఐదు నుంచి ఆరుగురు ఉంటారు. అమెరికా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాలను ఈ బృందాలు సందర్శిస్తాయి.

రక్షణ రంగానికి మరో 50వేల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత వర్గాలు తెలిపాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాయుధ దళాలకు రికార్డు స్థాయిలో రూ.6.81 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించారు. అంతకుముందు సంవత్సరం బడ్జెట్‌లో కేటాయించిన రూ.6.22 లక్షల కోట్ల కంటే ఇది 9.2 శాతం ఎక్కువ. తాజాగా పెంచాలని భావిస్తున్న మొత్తానికి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించే అవకాశం ఉంది. ఈ నిధులను పరిశోధన, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఇతర అవసరమైన పరికరాల కొనుగోలు కోసం ఉపయోగించనున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వంలో రక్షణ రంగానికి ప్రాధాన్యం కల్పించారు. 2014-15లో బీజేపీ ప్రభుత్వం రక్షణ శాఖకు బడ్జెట్‌లో రూ.2.29 లక్షల కోట్లు కేటాయించింది.

తుర్కియే ఉత్పత్తులు వద్దు!

యాపిల్ల దిగుమతిని నిలిపేసిన ఆజాద్‌పూర్ మండి.. ఆభరణాలు కొనబోమన్న లఖ్‌నవూ నగల వ్యాపారులు

» దేశమంతా 'బ్యాన్ తుర్కియే' నినాదం

న్యూఢిల్లీ, మే 16: తుర్కియే ఉత్పత్తులు, సేవలను దేశంలో బహిష్కరించాలంటూ సామాజిక మాధ్యమాల్లో మొదలైన నిరసన సెగ తీవ్రమవుతోంది. 'బ్యాన్ తుర్కియే' నినాదం దేశం మొత్తం పాకుతోంది. శత్రు దేశం పాకిస్థాన్‌కు వత్తాసు పలికినందుకు పర్యాటక, వాణిజ్య రంగాల్లో తుర్కియేపై పెద్ద దెబ్బే పడేలా కనిపిస్తోంది. వారం రోజులుగా ఆ దేశానికి భారీగా బుకింగ్‌లు పడిపోగా.. ప్రయాణాలు రద్దు చేసుకున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. ఇప్పటికే తుర్కియే యాపిళ్లను పుణే మార్కెట్.. ఆభరణాలను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జ్యువెలర్స్ అసోసియేషన్ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. తాజాగా ఆసియాలోనే అతిపెద్ద పండ్లు, కూరగాయల మార్కెట్ అయిన ఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండి.. తుర్కియే నుంచి యాపిళ్లు, ఇతర ఉత్పత్తుల దిగుమతులను నిలిపేస్తున్నట్లు తెలిపింది. రాజస్థాన్‌లోని అల్వార్ పండ్ల మార్కెట్ యూనియన్ కూడా తుర్కియే యాపిళ్లను కొనుగోళ్లు చేయబోమంటూ ప్రకటించింది. రాజస్థాన్‌కు రోజూ తుర్కియే నుంచి 15 టన్నులకు పైగానే యాపిళ్లు వచ్చేవని.. ఇకపై దిగుమతులు పూర్తిగా నిలిపేస్తున్నామని ఆ యూనియన్ వెల్లడించింది. ఇటు తుర్కియే అభరణాలను దిగుమతి చేసుకోబోమంటూ లఖ్‌నవూ నగల వ్యాపారులు ప్రకటించారు. 'ఇకపై టర్కిష్ నగలను కొనకూడదని మేం నిర్ణయం తీసుకున్నాం' అంటూ చౌక్ సరఫా అసోసియేషన్ తెలిపింది. తుర్కియేతో పాటు పాక్‌కు మద్దతుగా ఉన్న అజర్‌బైజాన్‌లతో అన్ని వ్యాపార లావాదేవీలను నిలిపేయాలని నగల పరిశ్రమను భారత రత్నాభరణాల దేశీయ మండలి (జీజేసీ) కూడా కోరింది. అలాగే ఆ రెండు దేశాలతో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను నిలిపేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్ (సీఏఐటీ) నిర్ణయించింది. ఇరు దేశాలతో ఇకపై ఎలాంటి వ్యాపారం జరగదని స్పష్టం చేసింది. ఈ విషయమై కేంద్రాన్ని కూడా కోరనున్నట్లు వెల్లడించింది. 24 రాష్ట్రాలకు చెందిన ట్రేడ్ నేతలంతా భేటీయై ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించింది.

మాది తుర్కియే కంపెనీ కాదు: సెలెబీ

విమానాశ్రయాల్లో భద్రతా సేవల అందించే సెలెబీ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ ఇండియాపై కేంద్రం వేటు వేయడంతో.. ఇస్తాంబుల్‌లో ఆ కంపెనీ షేర్ ధర 10 శాతానికి పైగా పతనమైంది. ఇటు అదానీ ఎయిర్‌పోర్టు సంస్థ కూడా సెలెబీతో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఈ పరిణామాలతో స్పందించిన సెలెబీ యాజమాన్యం.. తమది తుర్కియే కంపెనీ కాదని వివరణ ఇచ్చింది. ఆ దేశాధ్యక్షుడు ఎర్డోగాన్ కుటుంబంతో తమ సంస్థకు ఏ సంబంధం లేదని.. యాజమాన్య హక్కులన్నీ సెలెబీయోగ్లు కుటుంబానివేనని స్పష్టంచేసింది. తమ మాతృసంస్థలో 65% వాటా కెనడా, యూఎస్, యూకే, సింగపూర్ వంటి పలు దేశాల పెట్టుబడిదారులదేనని వెల్లడించింది.

భారత వర్సిటీల ఝలక్

పాక్‌కు అండగా నిలిచిన తుర్కియేకు మన యూనివర్సిటీలు కూడా ఝలక్‌లు ఇస్తున్నాయి. తుర్కియేలోని యూనస్ ఎమ్రే ఇన్‌స్టిట్యూట్‌తో విద్యా సంబంధిత అవగాహన ఒప్పందాన్ని తక్షణం రద్దు చేసుకుంటున్నట్లు మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (ఎంఏఎన్‌యూయూ) తాజాగా ప్రకటించింది. తుర్కియేతో ఎంఏఎన్‌యూయూ విద్యా సంబంధాలన్నీ ముగిసినట్లేనని స్పష్టం చేసింది. తుర్కియే, అజర్‌బైజాన్‌లలోని సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ కూడా ప్రకటించింది. తుర్కియే, అజర్‌బైజాన్‌లోని సంస్థలతో సంబంధాలు తెంచుకున్న భారత తొలి ప్రైవేటు యూనివర్సిటీ ఇదే.. కాగా, ఇప్పటికే జామియా మిలియా ఇస్లామియా కూడా తుర్కియే విద్యాసంస్థలతో ఒప్పందాలను నిలిపేసింది. అంతకుముందు.. జాతీయ భద్రతను పరిగణనలోకి తీసుకొని తుర్కియేలోని ఇనోను వర్సిటీతో కుదుర్చుకున్న విద్యా ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు జేఎన్‌యూ కూడా ప్రకటించింది.

బెంగాల్ ఉద్యోగుల డీఏ 25% పెంచండి

» మూడు నెలల్లో అమలు చేయండి

» రాష్ట్ర సర్కారుకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మే 16: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులకు 25 శాతం కరవు భత్యం (డీఏ) చెల్లించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలంటూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఆగస్టు నెలలో చేపడుతామని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డీఏ చెల్లించాలని కోరుతూ రాష్ట్ర ఉద్యోగులు కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. డీఏ పెంచాలంటూ 2022 మే నెలలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2022 నవంబరులో సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం డీఏను కొద్దికొద్దిగా పెంచింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 4% పెంచడంతో మొత్తం డీఏ 18 శాతానికి పెరిగింది. అదే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 55 శాతం డీఏ వస్తోంది. తేడా 37 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలోనే డీఏ పెంచాలని ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది.

జస్టిస్ బేలా త్రివేదికి వీడ్కోలు పలకని బార్

న్యూఢిల్లీ, మే 16: సుప్రీంకోర్టులో శుక్రవారం అసాధారణ దృశ్యం నెలకొంది. పదవీ విరమణ చేసిన మహిళా న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ సంప్రదాయ రీతిలో వీడ్కోలు పలకకుండా బహిష్కరించింది. ఈ చర్యను న్యాయమూర్తులు ఖండించారు. పదవీ విరమణ రోజున ప్రధాన న్యాయమూర్తి బెంచ్‌లో ఆశీనులు కావడం సంప్రదాయంగా వస్తోంది. దాంతో ఆమె ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టైన్ జార్జి మాసిహ్‌లధర్మాసనంలో కూర్చొన్నారు. సాయంత్రం సమయంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్స్ అసోసియేషన్లు వీడ్కోలు పలకడం మరో సంప్రదాయంగా వస్తోంది. వీడ్కోలు సమావేశంపై ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఈ చర్యను ఖండించింది. చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ సంఘాలు వద్దన్నప్పటికీ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్, ఉపాధ్యక్షురాలు రచనా శ్రీవాత్సవ ముగింపు రోజున జరిగే సంప్రదాయ ధర్మాసనం ముందుకు వచ్చారంటూ అభినందించారు. ఎవరూ వెళ్లవద్దని అసోసియేషన్లు తీర్మానాలు చేసినప్పటికీ వాటిని ధిక్కరించారని తెలిపారు. జడ్జి ఎలాంటి వారైనా కావచ్చుగానీ, సాయంత్రం 4.30 గంటల సమయంలో జరిగే కార్యక్రమాన్ని నిలిపివేయకూడదన్నారు.

చందమామ పిలుస్తోంది!



» చంద్రయాన్-5కు రెడీ అవుతున్న భారత్

» జపాన్ సహకారంతో ఇస్రో మరో మిషన్

» జాబిల్లి దక్షిణ ధ్రువ అన్వేషణకు 'లూపెక్స్'

» ఉపరితలం, నీటి జాడలపై అన్వేషణ

న్యూఢిల్లీ, మే 16: చంద్రయాన్-3తో చరిత్ర సృష్టించిన భారత్.. ప్రస్తుతం చంద్రయాన్ సిరీస్‌లో మరో రెండు ప్రాజెక్టు పనుల్లో తలమునకలైంది. వీటిలో చంద్రయాన్-4 ఇప్పటికే అభివృద్ధి దశలో ఉండగా.. లూనార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్ (లూపెక్స్) మిషన్‌గా పిలిచే చంద్రయాన్-5కు కూడా ఇస్రో ఇటీవలే ఆమోదం కూడా పొందింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూన్ మిషన్ చంద్రయాన్-5 కోసం భారత్, జపాన్ చేతులు కలిపాయి. ఇస్రో, జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ (జాక్సా) సంయుక్తంగా చేపడుతున్న ఈ మెగా ప్రాజెక్టుకు భారత ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలోనే ఆమోదం తెలిపింది. జపాన్‌కు చెందిన హెచ్3 రాకెట్ ద్వారా లూపెక్స్ ప్రయోగం చేపట్టనున్నారు. ఈ ప్రయోగం 2027-28లో ఉండే అవకాశం ఉంది.

చంద్రయాన్-5 ఏం చేస్తుంది..?

చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంపై అధ్యయనం చేయడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా చంద్రుడి ఉపరితలం, దాని కింద నీరు, మంచు నిక్షేపాల కోసం అన్వేషణపై దృష్టి పెడుతుంది. భవిష్యత్ అంతరిక్ష కార్యకలాపాలకు ఈ పరిశోధనలు ఉపయోగపడనున్నాయి. అలాగే మానవ నివాసానికి కావలసిన వనరులు చంద్రుడిపై ఉన్నాయా... అనే విషయాలను అర్థం చేసుకోవడానికి ఈ అన్వేషణ ఉపయోగపడనుంది. చంద్రయాన్-5 మిషన్ ద్వారా 6.5 టన్నుల పేలోడ్‌ను కక్ష్యలోకి పంపిస్తారు. దీనిలో 250 కిలోల బరువుండే రోవర్ కూడా ఉంటుంది. అలాగే చంద్రయాన్-3లో ఉపయోగించిన ప్రజ్ఞాన్ కంటే పది రెట్ల బరువైన ల్యాండర్‌ను దీనిలో జాబిల్లి పైకి పంపుతారు. ఇవి చంద్రుడి ఉపరితలాన్ని విశ్లేషించి, శాస్త్రీయ ప్రయోగాలకు అవసరమైన సమాచారాన్ని సేకరిస్తాయి.

నీటి జాడల అన్వేషణ..

జాక్సా అభివృద్ధి చేసిన రోవర్‌లో వాటర్ అనలైజర్లు, స్పెక్ట్రోమీటర్లు, గ్రౌండ్-పెనెట్రేటింగ్ రాడార్, చంద్రుడి ఉపరితలంపై నమూనాల ఆధారంగా నీటిశాతం, నాణ్యతను అంచనా వేయడానికి 1.5 మీటర్ల లోతు వరకు తవ్వగలిగే పరికరాలను అమర్చారు. కాగా, ల్యాండర్‌తోపాటు అనేక ఇతర శాస్త్రీయ పరికరాలను ఇస్రో సమకూర్చనుంది. అలాగే నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఎ) వంటి అంతర్జాతీయ భాగస్వాములు న్యూట్రాన్, మాస్ స్పెక్ట్రోమీటర్లతో సహా మరికొన్ని ప్రత్యేక పేలోడ్లను అందిస్తున్నాయి. ఈ మిషన్ చంద్రుని దక్షిణ ధ్రువానికి సమీపంలో ఉన్న శాశ్వత నీడ ప్రాంతం (పీఎస్ఆర్) లక్ష్యంగా చేసుకుని పరిశోధనలు చేస్తుంది. ఈ ప్రాంతంలో నీటి, మంచు నిక్షేపాలు ఉండి ఉంటాయని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. రోవర్ 100 రోజులపాటు పరిశోధనలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. పరిస్థితులను బట్టి దీన్ని ఒక సంవత్సరం వరకూ పొడిగించే అవకాశం ఉంది.

చిత్రజ్యోతి

SINCE 1965

ప్రేక్షకులు మరోసారి నిరూపించారు

అల్లు అరవింద్



శ్రీవిష్ణు హీరోగా కార్తిక్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సింగిల్'. ఇవానా, కేతిక శర్మ కథానాయికలు. అల్లు అరవింద్ నిర్మించారు. ఈ సినిమా ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్రబృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'సినిమాకు లభిస్తున్న ఆదరణను చూసి శ్రీవిష్ణుని మా ఆఫీసుకు పిలిచి గీతా ఆర్ట్స్‌లో మరో రెండు సినిమాలు చేయాలని కోరాను. సినిమా బాగుంటే థియేటర్లకు వస్తామని ప్రేక్షకులు మరోసారి నిరూపించారు. వారికి నా కృతజ్ఞతలు' అని అన్నారు. చిత్ర కథానాయకుడు శ్రీవిష్ణు మాట్లాడుతూ 'మా టీమ్‌లోని వారందరికీ జీవితాంతం గుర్తుండేలా ఈ చిత్రం విజయం సాధించింది' అని అన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'శ్రీవిష్ణు కామెడీ టైమింగ్ అంటే నాకు చాలా ఇష్టం. ఈ మూడు నెలల్లో రెండు హిట్‌లు కొట్టిన గీతా ఆర్ట్స్‌కి, చిత్ర విజయాన్ని అందుకున్న యూనిట్‌కు నా అభినందనలు' అని అన్నారు. చిత్ర దర్శకుడు కార్తిక్ రాజు మాట్లాడుతూ 'చిత్రబృందంలోని ప్రతీ ఒక్కరు అద్భుతంగా పనిచేయడం వల్లనే సినిమా ఇంతటి విజయాన్ని సాధించింది' అని అన్నారు.



'వీరమల్లు' రాక ఖరారు

సినీ అభిమానులంతా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పవన్ కల్యాణ్ చిత్రం 'హరి హర వీర మల్లు' విడుదల తేదీ ఖరారైంది. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత ఏ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, రెండు పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొన్నాయి. త్వరలో మూడో గీతంతో పాటు ట్రైలర్‌ని రిలీజ్ చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ప్రస్తుతం సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వీఎఫ్ఎక్స్, సౌండ్ డిజైన్, డబ్బింగ్ పనులతో తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



ఆ సినిమా కోసం మూడు టైటిల్స్!

'తండేల్' చిత్రం తర్వాత నాగచైతన్య ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం అన్నపూర్ణ స్టూడియో దిగువన రూ. 5 కోట్లతో ఓ భారీ సెట్ వేశారు. ప్రస్తుతం ఈ సెట్‌లోనే కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ట్రజర్ హంట్, మైథాలాజికల్ అంశాలున్న ఈ సినిమా కోసం మూడు టైటిల్స్ పరిశీలిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. వాటిల్లో 'వృక్షకర్మ' ఒకటని, మరో రెండు టైటిల్స్ కూడా ఉన్నాయనీ, ఆయన చెప్పారు. నాగచైతన్య లుక్ ఇందులో చాలా కొత్తగా ఉంటుంది. మీనాక్షి చౌదరి ఇందులో హీరోయిన్. సుకుమార్ రైటింగ్స్ సంస్థ కూడా నిర్మాణంలో భాగస్వామి.

విజయాన్ని ఆస్వాదించాను

సమంత



'పది శాతం మాత్రమే విజయావకాశాలు ఉన్న ఇండస్ట్రీలో చిత్ర నిర్మాణం కరక్టేనా అని ఆలోచిస్తూనే 'శుభం' సినిమా తీశాను. ప్రేక్షకులు ఆదరించారు. ఆ విజయాన్ని ఆస్వాదించాను. అలాంటి విజయానికి ఎవరైనా బానిసవుతారు. అందుకే నిర్మాతలు సినిమాలు తీస్తున్నారేమో' అని అన్నారు నటి సమంత. స్వీయ నిర్మాణంలో సమంత అతిథి పాత్ర పోషించిన చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. గవిరెడ్డి శ్రీనివాస్, శాలిని, శ్రీయ కొంతం, చరణ్ పేరి తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ హారర్ కామెడీ సినిమా ఇటీవలె విడుదలై మంచి ప్రేక్షకాదరణతో థియేటర్లలో రన్ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో సమంత మాట్లాడుతూ 'నటిగా నా సినిమాలు విడుదలైనప్పుడు రివ్యూస్‌లో నా పాత్రకు సంబంధించినంత వరకే చూసుకునే దానిని. ఆ స్వార్థం నాకుండేది. కానీ నిర్మాతగా తొలిసారి ప్రతి రివ్యూను ఆసాంతం చదువుకున్నాను. కుటుంబమంతా కలసి చూసే మంచి సినిమాలు తీయటమే నా లక్ష్యం' అని అన్నారు. చిత్ర దర్శకుడు ప్రవీణ్ మాట్లాడుతూ 'నటులు అద్భుతంగా నటిస్తే సినిమా యాభై శాతం విజయం సాధించినట్లే. అందరూ కొత్తవారైనప్పటికీ ఈ సినిమాలో బాగా నటించారు. విజయవంతమైన ఇలాంటి సినిమాలు విడుదలవుతుంటే నిర్మాతలకు చాలా ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి. ప్రతీ భాషలో రిమేక్ చేసే కథ ఇది. మంచి సినిమా చేశామనే సంతృప్తి మాకు కలిగింది' అని అన్నారు.

ఆ ప్రచారంలో నిజం లేదు

టీఎస్ఎఫ్‌సీసీ

ఇకపై అద్దె ప్రాతిపదికన కాకుండా వాటాల విధానంలోనే థియేటర్లలో సినిమాలను ప్రదర్శించాలని తెలంగాణ థియేటర్ల యజమానులు నిర్ణయించుకున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని టీఎస్ఎఫ్‌సీసీ (తెలంగాణ స్టేట్ ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్) అధ్యక్షుడు సునీల్ నారంగ్, కార్యదర్శి కే అనుపమ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని మీడియా సంస్థలతో పాటు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎగ్జిబిటర్ల సంయుక్త సమావేశం ఈనెల 18న జరగనుందనీ, అప్పుడే ఎగ్జిబిటర్ల సమస్యలతో పాటు ప్రభుత్వాల విధానాలపైనా చర్చించి, ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయాలను వెల్లడిస్తామని చెప్పారు.



పుట్టిన రోజున సర్‌ప్రైజ్

హృతిక్‌రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కథానాయకులుగా రూపొందుతున్న హిందీ చిత్రం 'వార్ 2'. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ నటించిన 'వార్' చిత్రానికి ఇది కొనసాగింపు. కియారా అద్వానీ కథానాయిక. ఈ స్పై థ్రిల్లర్‌కు అయాన్ ముఖర్జీ దర్శకుడు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. ఆగస్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 20న ఎన్టీఆర్ ఫస్ట్‌లుక్‌తో 'వార్ 2' టీజర్‌ను విడుదల చేసే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం హృతిక్ రోషన్ సోషల్ మీడియాలో స్పందించారు. 'పుట్టిన రోజు సందర్భంగా నీ కోసం ప్రత్యేక కానుకను సిద్ధం చేశాం. ఏంటో ఊహించగలవా తారక్' అంటూ ఎన్టీఆర్‌ను ఆటపట్టించారు. బదులుగా ఎన్టీఆర్ 'కబీర్... నిన్ను వేటాడి నీకు ప్రత్యేక బహుమతి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా' అంటూ సరదాదా బదులిచ్చారు. ప్రస్తుతం 'వార్ 2' నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి.

హీరోయిన్‌గా పచ్చళ్ల పాప?



పచ్చళ్ల ధరలు ఎక్కువగా ఉన్నాయన్న కస్టమర్‌తో దురుసుగా ప్రవర్తించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో అలేఖ్య చిట్టి పికెల్స్ సిస్టర్స్ ఒక్కసారిగా జనం నోళ్లలో నానారు. నెగెటివ్ ప్రచారం వ్యాపారాన్ని దెబ్బతీసినా వారికి సోషల్ మీడియాలో ఫాలోయింగ్ మాత్రం అమాంతం పెరిగింది. ఇప్పుడు అలేఖ్య సిస్టర్స్‌లో ఒకరైన రమ్య తాజాగా సినిమాల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. అశ్విన్‌బాబు కథానాయకుడిగా నటించిన 'వచ్చినవాడు గౌతమ్' చిత్రం టీజర్ విడుదల కార్యక్రమంలో ఆమె వేదికపై కనిపించారు. ఈ సినిమాలో రమ్య నటించారని తెలుస్తోంది. అయితే ఆమె కథానాయికగా నటించారా లేదా కీలక పాత్రలో కనిపించబోతున్నారా అనేది తెలియాల్సి ఉంది.

అవి రెండూ కర్మలే



స్వీయ దర్శకత్వంలో దేవన్ హీరోగా రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'. ధన్యబాలకృష్ణన్ కథానాయిక. బేబీ వైష్ణవి సమర్పణలో జ్యోత్స్న నిర్మిస్తున్నారు. తాజాగా డైరెక్టర్ వి.వి.వినాయక్ ఈ సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు. 'ప్రేమించడం, ప్రేమించబడటం.. రెండూ కర్మలే. ఈ ప్రేమని అనైతికంగా అనుభవించాలనుకున్నా, అది మరింత కాంప్లికేటెడ్ అయి, ఎన్ని జన్మలైనా నీకు సరైన పాఠం నేర్పే వరకు వదలదు' అనే పవర్‌ఫుల్ వాయిస్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది.

సర్వర్ కష్టాలు

- కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుదారులకు అవస్థలు
- భారీగా దరఖాస్తులతో సర్వర్లపై ఒత్తిడి.. ఆన్‌లైన్ కాని వైనం
- అందుబాటులోకి రాని 'మనమిత్ర' వాట్సాప్ సేవలు

గ్రామ, వార్డు సచివాలయాలకు పోటెత్తుతున్న జనం

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్తున్న అర్జీదారులను సర్వర్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఒకేసారి భారీస్థాయిలో దరఖాస్తులు వస్తుండటంతో సర్వర్లపై ఒత్తిడి పెరిగి, దరఖాస్తులు ఆన్‌లైన్ కావడం లేదని చెబుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే కాకుండా ఈనెల 15వ తేదీ నుంచి వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయితే ఆ సేవలు ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలకు దరఖాస్తుదారుల తాకిడి విపరీతంగా పెరిగింది. సర్వర్లు పనిచేయకపోవడంతో దరఖాస్తులు ఆన్‌లైన్ కావడం లేదంటూ అక్కడి ఉద్యోగులు వెనక్కి పంపిస్తున్నారని దరఖాస్తుదారులు చెబుతున్నారు. దీంతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మండుటెండలో పాట్లు పడుతున్నారు. రాష్ట్రంలోని అర్హులందరికీ కొత్త రేషన్ కార్డుల జారీతోపాటు ఇప్పటికే ఉన్న కార్డుల విభజన, సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పు, అనర్హుల కార్డుల సరెండర్, ఆధార్ సీడింగ్‌ను సరిచేసుకోవడం తదితర 10 రకాల సేవల కోసం దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం ఈనెల 7 నుంచి అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. పైగా జూన్‌లోనే కొత్త రేషన్‌కార్డులు అందజేస్తామని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించడంతో ఏళ్ల తరబడి రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారంతా దరఖాస్తు ఫారాలు పట్టుకుని సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. కొత్తగా పెళ్లి చేసుకొని, వేరు కాపురాలు పెట్టుకున్న జంటలతోపాటు అర్హతలు ఉన్న పేద కుటుంబాల వారు పోటెత్తుతున్నారు. దీంతో అర్జీదారుల హడావుడితో రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తు అవకాశం కల్పిస్తే ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు.

10 రోజుల్లోనే 2,44,889 దరఖాస్తులు

కొత్త రైస్ కార్డులు, ఇతర సేవల కోసం దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. ఈనెల 7 నుంచి 16వ తేదీ వరకు 10 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 2,44,889 దరఖాస్తులు అందాయి. వీటిలో కొత్త కార్డుల కోసం 30,614, ఉన్న కార్డుల విభజన కోసం 20,392, కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పుల కోసం 1,79,523, సభ్యుల తొలగింపు కోసం 6,397, తప్పు ఆధార్ సీడింగ్‌ను సరిచేయడానికి 3,743, కార్డుల సరెండర్ కోసం 260, చిరునామా మార్పు కోసం 3,799 మంది దరఖాస్తులు చేసుకోగా.. రేషన్ షాపుల రెన్యువల్స్ కోసం 161 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉందని సివిల్ సప్లయిస్ వర్గాలు చెబుతున్నాయి.



పోలవరానికి శుభవార్త!

28న ప్రధాని సమీక్ష

- చంద్రబాబు, రేవంత్‌రెడ్డితోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిసా సీఎంలూ హాజరు
- మోదీ సయోధ్య కుదురుస్తారని జలవనరుల శాఖ ఆశాభావం

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జీవన రేఖ పోలవరం ప్రాజెక్టుకు మంచి రోజులు వచ్చాయి. ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిపై ప్రధాని మోదీ తొలిసారి సమీక్ష జరుపనున్నారు. ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం మూడున్నర గంటలకు ఆంధ్ర, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డితో పాటు ఒడిసా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు మోహన్ చరణ్ మాజీ, విష్ణుదేవ్ సాయి, ఆయా రాష్ట్రాల జల వనరుల మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించనున్నారు. ఈ సమాచారాన్ని ప్రధాని కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు గురువారం పంపింది. రాష్ట్ర విభజన తర్వాత పోలవరం పాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా కల్పించిన సంగతి తెలిసిందే. అలాగు ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత రాష్ట్రానికే అప్పగించాలని కేంద్రానికి నీతి ఆయోగ్ సిఫారసు చేసింది. దీనికి కేంద్ర జలశక్తి శాఖ సానుకూలంగా స్పందించింది. దీంతో నిర్మాణ బాధ్యతలను 2014 నుంచి ఆంధ్రప్రదేశ్ పర్యవేక్షిస్తోంది. 2014-19 నడుమ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి సోమవారాన్ని పోల'వారం'గా మార్చి.. సమీక్షలు నిర్వహించి.. ప్రధాన డ్యాం పనులు 72 శాతం వరకు పూర్తి చేయించారు. డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తిచేశారు. దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం వేసేస్తే.. ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనులు పూర్తయిపోయేవి. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. పోలవరాన్ని పూర్తి నిర్లక్ష్యం చేశారు. కేంద్రం వద్దని మొత్తుకున్నా కాంట్రాక్టు సంస్థను మార్చేశారు. ఈ క్రమంలో ఏడాది పాటు పనులు చేయలేదు. ఫలితంగా 2020లో గోదావరికి వరద ఉధృతి పెరగడంతో డయాఫ్రం వాల్ దెబ్బతింది. దీంతో ప్రధాన డ్యాం పనులు నిలిచిపోయాయి. 2024లో చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి అధికార పగ్గాలు చేపట్టాక.. మళ్లీ ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. అమెరికా, కెనడా నిపుణుల సూచన మేరకు కొత్త డయాఫ్రం వాల్.. సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు కూడా చేపట్టేందుకు ప్రాజెక్టు అధికారులు సిద్ధమయ్యారు. పోలవరాన్ని 2027 జూన్‌నాటికి పూర్తి చేయాలని చంద్రబాబు లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తరుణంలో 28న ప్రధాని సమీక్ష చేయనుండడం గమనార్హం. ఈ సందర్భంగా తెలంగాణ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ముంపుపై ఎలాంటి అభ్యంతరాలు లేవనెత్తుతాయో.. ఆయన వాటిపై ఎలా స్పందిస్తారోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న రాష్ట్రాలతో ఆయన సయోధ్య కుదురుస్తారని రాష్ట్ర జలవనరుల శాఖ ఆశాభావంతో ఉంది.

నేడు ప్రధానితో లోకేశ్ కుటుంబం భేటీ

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ కానున్నారు. శనివారం సాయంత్రం ప్రధాని అపాయింట్‌మెంట్ ఖరారు కావడంతో అనంతపురం జిల్లా పర్యటనలో ఉన్న ఆయన అర్థాంతరంగా పర్యటన ముగించుకుని శుక్రవారం హైదరాబాద్ వెళ్లిపోయారు. అక్కడి నుంచి శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలసి లోకేశ్ ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు.

కష్టపడేవారికి టీడీపీలో గుర్తింపు: పంచుమర్తి

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): 'కష్టపడే వారికి టీడీపీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుంది. ఏపీ విద్య మరియు సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్‌గా రాజశేఖర్ నియామకమే దానికి నిదర్శనం' అని మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. చైర్మన్‌గా నియమితులైన తర్వాత టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన రాజశేఖర్‌ను శుక్రవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రభుత్వంలో ఉన్నా పార్టీకి, ప్రభుత్వానికి సమానంగా సేవలందిస్తానని రాజశేఖర్ అన్నారు.

సచివాలయంలో ఆక్టోపస్ మాక్ డ్రిల్

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రవాద కార్యకలాపాల నిరోధానికి పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించి, వాటిని అమలుపరిచే విధంగా గురువారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో అక్టోపస్ బలగాలు ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ మాక్ డ్రిల్‌లో తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు. 40 మంది ఆక్టోపస్, ఎస్‌టీఎఫ్ బలగాలు ఈ కార్యక్రమంలో తమ శక్తిని ప్రదర్శించాయి.

జీఓ 57 ప్రకారమే సీనరేజీ ఫీజులు: గనుల శాఖ

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): అదనపు కాలపరిమితి పొందిన సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్టర్లు జీఓ 57ను అనుసరించి ఫీజులు వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు(జీఓ 75) జారీ చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం కరోనా కాలంలో మైన్స్‌పై విధించిన కన్సిడరేషన్ అమౌంట్‌ను ఇటీవల ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో సవరించిన ఫీజులు, వసూలు చేయాల్సిన ఫీజులను జీఓ 57 నిర్దేశిస్తుంది. దానిప్రకారమే కాంట్రాక్టర్లు సీనరేజీ వసూలు చేయాలని గనుల శాఖ ఆదేశించింది. అలాగే, పలు రకాల ఫీజులను సవరించిన నేపథ్యంలో ఆ ఫీజుల పునఃసమీక్ష, సర్దుబాటుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇదిలా ఉండగా, జాతీయ రహదారివర్క్‌లు, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ పనులకు సంబంధించిన ఫీజుల విషయంలో అమల్లో ఉన్న నిబంధనలు(జీఓ 57) పాటించాలని కాంట్రాక్ట్ సంస్థలకు గనుల శాఖ స్పష్టం చేసింది.

కూటమి ప్రభుత్వం మోసగించింది

- ఇచ్చిన హామీలను విస్మరించింది
- త్వరలో వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళన: బొత్స

కాకినాడ, మే 16(ఆంధ్రజ్యోతి): 'దేశ చరిత్రలో ఏ రాష్ట్రమూ రూ.1.59 లక్షల కోట్లను ఏడాదిలోపు ఖర్చు చేయలేదు. అలాంటిది ఏపీ ప్రభుత్వం ఎలా చేసింది?' అని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన కాకినాడలో మీడియాతో మాట్లాడారు. 'మేం అధికారంలో ఉన్నప్పుడు డీబీటీ ద్వారా కోట్లాది రూపాయలను ప్రజలకు నేరుగా అందించాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఏ సంక్షేమ పథకాలకూ ఇవ్వకుండా అంత మొత్తం దేనికి ఖర్చు చేశారో? ఏ గుత్తేదారుకు ఇచ్చారో చెప్పాలి. ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని రంగాల ప్రజలను మోసం చేసింది. సూపర్ సిక్స్, అమ్మ ఒడి, రైతు భరోసా, సింగిల్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు... ఇవేవీ ప్రజలకు కనిపించట్లేదు. ఎక్కడ చూసినా దోపిడీ, అవినీతే కనిపిస్తోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో వరి సాగు రైతులు క్షేత్రస్థాయిలో పడుతున్న ఇబ్బందులపై వైసీపీ పోరాడుతుంది. పండిన పంటకు రేటు ఇవ్వకపోగా, మిల్లర్లు, బియ్యం ఎగుమతుదారులు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పిన మాటలేవీ క్షేత్రస్థాయిలో అమలు కావట్లేదు. ఒంగోలు, ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి వైసీపీ త్వరలోనే పోరాటం చేస్తుంది. ఆక్వా రైతుల సమస్యలపైనా క్షేత్రస్థాయిలో చర్చించి ఆందోళన చేపడతాం. రాష్ట్రంలోని రైతులకు వైసీపీ అండగా ఉంటుంది. ఇది మా పార్టీ అధ్యక్షుడు జగన్ మాట' అని బొత్స తెలిపారు.

'గాలి'కి యావజ్జీవ శిక్ష విధించాలి

- ట్రంప్‌నకు మోదీ లొంగిపోయారు: రామకృష్ణ

అనంతపురం, మే 16(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ ఆదాయం, పర్యావరణాన్ని కొల్లగొట్టిన మైనింగ్ మాఫియా గాలి జనార్దన్‌రెడ్డికి ప్రస్తుతం న్యాయస్థానం విధించిన శిక్ష సరిపోదు. యావజ్జీవ శిక్ష విధించాలి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. 'గజ దొంగ గాలిజనార్దన్‌రెడ్డి అక్రమాల నిరూపణకు 14 ఏళ్లు పట్టింది. శిక్ష విధించడమే కాకుండా గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన బంధువులు, సన్నిహితుల ఆస్తులన్నీ జప్తు చేయాలి. దేశంలో నంబర్ వన్ మైనింగ్ మాఫియాగా ఎదిగిన గాలి జనార్దన్‌రెడ్డిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డ్రోనాల్డ్ ట్రంప్‌నకు లొంగిపోయాడు. భారత జాతిని అవమానించేలా ట్రంప్ వ్యాఖ్యలు చేస్తున్నా మోదీగాని, హోం మంత్రి అమిత్‌షాగాని నోరుమెదపకపోవడం సిగ్గుచేటు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు దేశమంతా ఏకం కావాలి' అని రామకృష్ణ పిలుపునిచ్చారు.



నంది లోగోతో పోస్టల్ కార్డులు విడుదల

లేపాక్షి, మే 16(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి నంది లోగోతో పోస్టల్ కార్డులు, పిక్చర్ కార్డులను చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఏపీ ప్రకాశ్ శుక్రవారం ఇక్కడ విడుదల చేశారు. లేపాక్షి ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, వేలాడే స్తంభం, సీతాదేవి పాదం వంటి చిత్రాలను పోస్టల్ పిక్చర్ కార్డుల్లో ముద్రించామని ప్రకాశ్ ఈ సందర్భంగా తెలిపారు. లేపాక్షి ఏక శిల నంది విగ్రహాన్ని పోస్టల్‌స్టాంప్‌లోనూ, ప్రత్యేకంగానూ ముద్రించామని తెలిపారు.

ట్రెండ్ సెట్ చేస్తున్నాం!

- భారీ పెట్టుబడులతో కలలు సాకారం: లోకేశ్
- అనంతపురం జిల్లాలో రూ.22 వేల కోట్లతో రెన్యూ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



ఎక్స్‌కవేటర్‌తో మట్టి తీసి రెన్యూ పవర్ సంస్థకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారా లోకేశ్, పక్కన రెన్యూ సంస్థ చైర్మన్ సుమంత్ సిన్హా

> ఐదేళ్ల తర్వాత రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ పునరుజ్జీవం పోసుకుంది. రెన్యూ ప్రాజెక్టుకు కాంక్రీట్ వేయడమే కాదు.. ఒక విజన్‌ను రూపొందిస్తున్నాం. క్లీనర్, గ్రీనర్, గ్రేటర్ ఏపీ మా విజన్.
> ఒక్క చాన్సు మాయలో పడి జగన్‌కు అవకాశం ఇచ్చినందుకు రాష్ట్రం దారితప్పింది. యువత తీవ్రంగా నష్టపోయింది.
> - మంత్రి లోకేశ్

అనంతపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): 'విజనరీ లీడర్ చంద్రబాబు కేవలం రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించడమే కాదు.. రేపటి తరం భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారు. ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలు చూశారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రం ట్రెండ్‌ను ఫాలో కావడం లేదు. ట్రెండ్ సెట్ చేస్తోంది' అని మంత్రి లోకేశ్ అన్నారు. అనంతపురం జిల్లాలో రెన్యూ పవర్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు తాము చేస్తున్న శంకుస్థాపన.. దేశ క్లీన్ ఎనర్జీ విప్లవానికి పునాది రాయిగా అభివర్ణించారు. గుత్తి మండలం బేతాపల్లి గ్రామ సమీపంలో రెన్యూ పవర్ సంస్థ రూ.22వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్న 4.8 గిగావాట్ల హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. స్వయంగా ఎక్స్‌కవేటర్‌తో మట్టి తీసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. రెన్యూ పవర్ సంస్థ పునరుత్పాదక ఇంధన సముదాయ ప్రారంభోత్సవం స్థిరమైన ప్రగతికి చిహ్నమని అన్నారు. ఈ చరిత్రాత్మక ఘట్టంలో భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ ప్రాజెక్టు గ్రిడ్లకు విద్యుత్ ఇవ్వడమే కాకుండా నిరుద్యోగ యువతకు, రేపటి వెలుగులకు దారి చూపుతుందని అన్నారు. ఇదొక పరిశ్రమ మాత్రమే కాదని, ఉద్యమమని.. యువత కలలకు, భావి తరాలకు వారధిలాంటిదని వ్యాఖ్యానించారు. రెన్యూలో ఉత్పత్తయ్యే ప్రతి మెగావాట్ విద్యుత్.. ప్రపంచానికి ఒక సందేశం ఇస్తుందన్నారు. గ్రీన్ పవర్ హౌస్‌గా మారుతున్న మన రాష్ట్రంలో నమ్మకంతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన రెన్యూ చైర్మన్-సీఈవో సుమంత్ సిన్హా, సంస్థ బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు. లోకేశ్ ఇంకా ఏమన్నారంటే..

పునరుత్పాదక ఇంధనంలో సరికొత్త మ్యాప్‌లు!

ఐదేళ్ల విరామం తర్వాత చంద్రబాబు నాయకత్వంలో సమర్థ పనితీరుకు ప్రతీకగా రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోంది. దేశ పునరుత్పాదక ఇంధన పటంలో తిరిగి చేరడమే కాదు.. అందులో సరికొత్త మ్యాప్‌లను రూపొందిస్తున్నాం. 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మేం కలలు కనడమే కాకుండా.. వాటిని సాకారం చేస్తున్నాం. 8 నెలల వ్యవధిలోనే క్లీన్ ఎనర్జీ దిగ్గజాలను రాష్ట్రానికి రప్పించగలిగాం. ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ రూ.1.86 లక్షల కోట్లు పెడుతోంది. టాటా పవర్ రూ.49 వేల కోట్లతో 7 వేల మెగావాట్లు, వేదాంత సేరెంటికా రూ.50 వేల కోట్లతో 10 వేల మెగావాట్లు, ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ రూ.6 వేల కోట్లతో 1,200 మెగావాట్లు, బ్లూకోఫీల్డ్ రూ.50 వేల కోట్లతో 8 వేల మెగావాట్ల ఉత్పత్తికి ముందుకొచ్చాయి. రాష్ట్రంపై ఈ కంపెనీల నమ్మకానికి, గ్రీన్ ఎనర్జీ లక్ష్యాల సాధనకు ఏపీ సిద్ధంగా ఉందనడానికి ఇదే నిదర్శనం. చంద్రబాబు బ్రాండ్ వల్లే రెన్యూ చైర్మన్ ఇంతదూరం వచ్చారు. టీసీఎస్ రాష్ట్రానికి రావడానికీ అదే కారణం. త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తాం. ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని రాయలసీమకు తీసుకొస్తాం.

విజనరీ సారథ్యంలో..: రెన్యూ చైర్మన్

పునరుత్పాదక ఇంధన రంగంలో కొత్త శకానికి నాంది పలికామని రెన్యూ సంస్థ చైర్మన్ సుమంత్ సిన్హా తెలిపారు. విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, ప్రగతిశీల పాలన, దృఢమైన సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా ముందుకు దూసుకెళ్తోందన్నారు. జగన్ పాలనలో ఒక్క మెగా వాట్ అదనపు విద్యుత్ ఉత్పత్తి కాలేదని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఇందుకు జగన్ సిగ్గుపడాలన్నారు.

ఉపాధ్యాయుల పోరుబాట!

విద్యా సంస్కరణలు అసంబద్ధమని ధ్వజం

- గత ప్రభుత్వంలో 6.. ఇప్పుడు 9రకాల బదులా?
- తెలుగు మీడియం లేకుండా చేయడం దారుణం
- అధికారులతో సమావేశం బహిష్కరణ
- 21, 23 తేదీల్లో కార్యాలయాల ముట్టడి
- విద్యామంత్రితో మాత్రమే చర్చలకు డిమాండ్



కమిషనరేట్‌లో సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చిన రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): జీవో 117కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన జీవో 21లోనూ అసంబద్ధ నిర్ణయాలున్నాయని, వాటిని తాము వ్యతిరేకించినా పాఠశాల విద్యాశాఖ ఏకపక్షంగా వాటిపై నిర్ణయం తీసుకుందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపించాయి. ఇటీవల హేతుబద్ధీకరణ జీవోలు జారీచేసిన నేపథ్యంలో శుక్రవారం పాఠశాల విద్యాశాఖ అధికారులు నిర్వహించదలచిన సమావేశాన్ని గుర్తింపు పొందిన సంఘాలు మూకుమ్మడిగా బహిష్కరించాయి. యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్-257, ఏపీటీఎఫ్-1938, పీఆర్‌టీయూ, ఏపీయూఎస్, ఆప్టా, వైఎస్ఆర్‌టీఏ, పీహెచ్ఎంఏ సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడి ఉమ్మడి కార్యాచరణ ప్రకటించాయి. నూతన సంస్కరణలకు నిరసనగా ఈనెల 21న ఉమ్మడి జిల్లాల డీఈవోల కార్యాలయాల ముట్టడి, 23న పాఠశాల విద్య డైరెక్టర్ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించాయి. ఆ తర్వాత మిగిలిన ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని వెళ్తూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపాయి. ఇకపై చర్చలంటూ నిర్వహిస్తే కేవలం మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి సమక్షంలోనే జరగాలని స్పష్టంచేశాయి. ఇక నుంచి ప్రతి శుక్రవారం జరిగే చర్చలకు హాజరుకాబోమని ఆ సంఘాల నాయకులు స్పష్టంచేశారు. గత 30 వారాలుగా సంఘాల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నా, తాము లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకోకుండా జీవోలను విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 వల్ల మూడు లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారని, ఈ ప్రభుత్వం కూడా అవే విధానాలను కొనసాగిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం ఆరు రకాల బడుల విధానం అమలుచేస్తే, ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల బడుల విధానం ప్రవేశపెట్టడం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడమేనన్నారు. తెలుగు రాష్ట్రంలో తెలుగు మీడియం లేకుండా చేయడం దారుణమన్నారు.

ఇవీ డిమాండ్లు

ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ ఏర్పాటుచేయాలి. మోడల్ ప్రైమరీ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించకూడదు. ఎస్జీటీలకు పదోన్నతి కల్పించి వారినే హెచ్ఎంలుగా నియమించాలి. ఇంగ్లీష్, తెలుగు మీడియంలను, మైనర్ మీడియంలను కొనసాగించాలి. ఆ మేరకు పోస్టులు కేటాయించాలి. ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో 40 మంది విద్యార్థులు దాటితే మూడో టీచర్ పోస్టు ఇవ్వాలి. ఒక్క పోస్టు కూడా బ్లాక్ చేయకుండా బదిలీలు చేపడతామని గతంలో హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు పోస్టులు బ్లాక్ చేస్తున్నారు. పోస్టులు బ్లాక్ చేయకుండా బదిలీలు చేపట్టాలి. ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలల్లో టీచర్లు, విద్యార్థుల నిష్పత్తి 1:20 అమలుచేయాలి. రెండు సార్లు రేషనలైజేషన్‌కు గురైన టీచర్లకు బదిలీల్లో అన్ని స్టేషన్ల పాయింట్లు ఇవ్వాలి. రేషనలైజేషన్‌లో సీనియర్ బదిలీకి విల్లింగ్ ఇస్తే పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలి. రేషనలైజేషన్ ప్రక్రియ ప్రతి సంవత్సరం చేపట్టకూడదు.

డీఎస్సీలో మహిళా అభ్యర్థులే ఎక్కువ

16,347 పోస్టులకు 3,35,401 మంది పోటీ

వారిలో మహిళా అభ్యర్థులు 2,03,647

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. దరఖాస్తుదారుల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. మొత్తం 16,347 పోస్టులకు.. 3,35,401 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,31,754 మంది పురుషులు, 2,03,647 మంది మహిళలు ఉన్నారు. అంటే పురుష అభ్యర్థుల కంటే మహిళలు 71,893 మంది అధికంగా ఉన్నారు. చాలా మంది ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయడంతో మొత్తం 5,77,417 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం పోస్టులు 16,347 కాగా డీఎస్సీని ఉమ్మడి జిల్లాల వారీగా ప్రకటించగా... కర్నూలు జిల్లాలో అత్యధికంగా 73,605 దరఖాస్తులు వచ్చాయి. ఈ జిల్లాలో పోస్టులు ఎక్కువ ఉన్నాయి. నెల్లూరు జిల్లాలో అత్యల్పంగా 28,772 దరఖాస్తులు వచ్చాయి. ఇతర రాష్ట్రాల కోటాలో 7,159 మంది అభ్యర్థుల నుంచి 10,143 దరఖాస్తులు వచ్చాయి.

తొలిసారి ఎస్సీ వర్గీకరణ అమలు

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాత తొలిసారి డీఎస్సీలోనే వర్గీకరణ ఆధారంగా పోస్టులు విభజించారు. నోటిఫికేషన్‌లో ఎస్సీ కేటగిరీ 1, 2, 3 పోస్టులు, అభ్యర్థులను వేర్వేరుగా చూపించారు. ఎస్సీ కేటగిరీ-1లో కొన్ని జిల్లాల్లో చాలా తక్కువ దరఖాస్తులు అందాయి. ఆ కేటగిరీలో ప్రకాశం జిల్లాలో ఇద్దరు, నెల్లూరులో ఇద్దరు, చిత్తూరులో నలుగురు, కడపలో ఒకరు, అనంతపురంలో ఒకరు, కర్నూలులో నలుగురు అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లాల వారీగా అభ్యర్థులు, దరఖాస్తులు

జిల్లా	అభ్యర్థులు	దరఖాస్తులు	పురుషులు	మహిళలు
శ్రీకాకుళం	22648	39235	9653	12995
విజయనగరం	18001	31038	7776	10225
విశాఖపట్నం	29779	49658	11773	18006
తూర్పుగోదావరి	38617	63004	14380	24237
పశ్చిమగోదావరి	25750	42466	9290	16460
కృష్ణా	19953	35220	6543	13410
గుంటూరు	25067	43570	8431	16636
ప్రకాశం	21046	35095	8487	12559
నెల్లూరు	15993	28772	6173	9820
చిత్తూరు	26501	45221	10153	16348
కడప	15812	29915	6214	9598
అనంతపురం	29078	50475	12008	17070
కర్నూలు	39997	73605	16535	23462
ఇతర రాష్ట్రాలు	7159	10143	4338	2821
మొత్తం	335401	577417	131754	203647



దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమంపై నిర్వహించిన సమావేశంలో మంత్రి డోలా, ఉన్నతాధికారులు

దివ్యాంగులకు ఇకపై యూడీఐడీ కార్డులు

- సదరం పోర్టల్‌తో కేంద్ర పోర్టల్ అనుసంధానం: మంత్రి డోలా

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చే యునిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు (యూడీఐడీ)లు ఇకపై రాష్ట్రంలోని దివ్యాంగులకు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్డుల జారీకి అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమంపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సదరం సర్టిఫికెట్లు, పీఎంజేఏవై వందన వయోవృద్ధుల హెల్త్ స్కీంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాలతో పాటు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సదరం పోర్టల్‌ను యూడీఐడీ పోర్టల్‌ను అనుసంధానం చేసి స్లాట్ బుకింగ్‌కి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్లాట్ బుక్ చేసుకున్నప్పటి నుంచి నెల రోజుల్లోపు దివ్యాంగులకు సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, రాష్ట్రంలోని దివ్యాంగులందరికీ మేలు చేసేందుకు యూడీఐడీ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా మనమిత్ర వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

మూడు రంగుల్లో కార్డులు

దివ్యాంగ శాతం 40 కన్నా తక్కువగా ఉంటే తెలుపు కార్డు, 40% నుంచి పైబడి 80%లోపు ఉన్న వారికి పసుపు రంగు కార్డు, దివ్యాంగ శాతం 80 లేదా అంతకన్నా ఎక్కువ ఉన్న వారికి నీలం రంగు కార్డును జారీ చేస్తారు.

జడ్పీ సీఈఓలు మార్గదర్శకాలు పాటించాలి

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మండల, జిల్లా పరిషత్‌లలో పనిచేస్తున్న మినిస్టీరియల్ సిబ్బందిని ఇతర శాఖలకు డిప్యూటేషన్‌పై పంపేందుకు ఉన్న మార్గదర్శకాలను పాటించాలని జిల్లా పరిషత్ సీఈఓలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలిచ్చారు. హెచ్ఓడీ అనుమతి లేకుండా జడ్పీ/ఎంపీపీ సిబ్బంది పలువురిని డిప్యూటేషన్‌పై ఇతర శాఖలకు అనుమతించినట్లు సమాచారం కమిషనరేట్‌కు చేరడంతో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇతర శాఖల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న జడ్పీ/ఎంపీపీ కార్యాలయం సిబ్బంది వివరాలను వెంటనే కమిషనరేట్‌కు పంపించాలని కమిషనర్ ఆదేశించారు. ఇక నుంచి ఒక్క ఉద్యోగిని కూడా హెచ్ఓడీ అనుమతి లేకుండా డిప్యూటేషన్‌కు అనుమతించరాదన్నారు.

ఉపాధి నిధులు విడుదల చేయండి

- సర్పంచ్‌ల సంక్షేమ సంఘం విజ్ఞప్తి

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): 'గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు వెంటనే చెల్లించాలి. ఉపాధి నిధులు గ్రామ సర్పంచ్‌ల ఖాతాల్లో జమచేసి చెల్లించేలా చర్యలు తీసుకోవాలి' అని పంచాయతీరాజ్ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఆ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను శుక్రవారం కలిశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని, గ్రామ పంచాయతీలకు రావాల్సిన రిజిస్ట్రేషన్ సర్‌చార్జీలు ఆయా ఖాతాల్లోకి జమ చేసేలా రిజిస్ట్రేషన్ విభాగానికి సిఫార్సు చేయాలని కోరారు. శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ... '15వ ఆర్థిక సంఘం నిధులు 15 రోజుల్లో విడుదలవుతాయి. త్వరలో జల్‌జీవన్ మిషన్ నిధులు కూడా కొంతమేరకు విడుదల అవుతాయి' అని తెలిపారు. సర్పంచ్‌ల గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచాలని, ఇతర స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకూ గౌరవ వేతనం పెంచాలని సర్పంచ్‌ల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు.

సైనికుల పోరాటానికి సెల్యూట్


విజయవాడ బందరు రోడ్‌లో శుక్రవారం నిర్వహించిన తిరంగా యాత్ర

దేశాభివృద్ధిని ఉగ్రవాదం అడ్డుకోలేదు: చంద్రబాబు

సూడో సెక్యులరిస్టులకు బుద్ధి చెప్పాలి: పవన్

సైనికులకు సంఘీభావంగా యాత్రలు: పురందేశ్వరి

విజయవాడలో ఘనంగా తిరంగా ర్యాలీ

అమరావతి/ విజయవాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి మన త్రివిధ దళాల సత్తా చాటాం. ఉగ్రవాదం పేరుతో దేశాభివృద్ధిని అడ్డుకునే కుట్రలు, కుతంత్రాలు దేశాన్ని ఏమీ చేయలేవు. ఉగ్రవాదం పేరుతో దేశంలోకి ఎవరు వచ్చినా వారికి అదే చివరి రోజు అవుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో విజయవాడలో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో చంద్రబాబు మాట్లాడుతూ.. భారత దేశం సైనిక శక్తిలోనే కాదు ఆర్థిక శక్తిలోనూ దూసుకుపోతోందని, 2047 నాటికి ప్రపంచంలో నంబర్ వన్ లేదా నంబర్ టు స్థానంలో నిలవడం ఖాయమన్నారు. పహల్గాం లాంటి సంఘటనలు పునరావృతం అయితే ఆపరేషన్ సిందూర్ లాంటివి పునరావృతం అవుతాయన్నారు. ఉగ్రవాదంపై మన రక్షణ దళాలు చేస్తున్న పోరాటానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. ప్రపంచం గర్వించదగ్గ త్రివిధ దళాలు మన సొంతమని చెప్పుకోవడానికి గర్విస్తున్నానన్నారు. 'పహల్గాం వంటి ఘటనలు చూస్తే రక్తం ఉడికిపోతుంది. రోషం వస్తుంది. భార్య ముందే భర్తను, కొడుకు ముందే తండ్రిని చంపేసిన ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలా వద్దా.. వారిని ప్రోత్సహిస్తున్న వారికి బుద్ధి చెప్పాలా వద్దా?' అని చంద్రబాబు ప్రశ్నించారు. మన ఆడబిడ్డల నుదుట తిలకాన్ని చెరిపేసిన ఉగ్రవాదులు ఈ భూమి మీద ఉండటానికి అనర్హులని భావించిన ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్‌కు శ్రీకారం చుట్టారన్నారు. ఉగ్రవాదులు మన దేశం వైపు కన్నెత్తి చూడకుండా చేయాలనే సంకల్పంతో త్రివిధ దళాలు వారిపై పోరాటం చేశాయన్నారు. 'ఈ పోరాటంలో మురళీ నాయక్ లాంటి వారు వీరమరణం పొందారు. 25 ఏళ్ల వయసున్న మురళీ నాయక్ దేశం కోసం ప్రాణాలు ఇచ్చారు. అలాంటి వారిని మనం గుర్తుపెట్టుకోవాలి. ప్రతి ఇంట్లో దేశ భక్తిపై చర్చ జరగాలి. యువతకు మురళీ నాయక్ లాంటి వారు స్ఫూర్తి కావాలి. త్రివిధ దళాల పోరాట స్ఫూర్తిని కీర్తిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో శుక్ర, శని, ఆదివారాల్లో తిరంగా ర్యాలీల పేరుతో ఓ పెద్ద కార్యక్రమానికి ప్రజలే శ్రీకారం చుట్టారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు నిమిత్తమాత్రులం. ఇది ప్రజా ఉద్యమం. మువ్వన్నెల జెండాను రూపొందించినది తెలుగువ్యక్తి పింగళి వెంకయ్య కావడం మనందరికీ గర్వకారణం' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

మోదీ సమర్థ నాయకుడు

'ఉగ్రవాదంపై పోరాడే ఏకైక దేశం భారతదేశం. ఉగ్రవాదంపై పోరాటం చేసే ఏకైక నాయకుడు మోదీ. భారతదేశం ఎవరి జోలికీ వెళ్లదు. మన జోలికి వస్తే వదిలే ప్రసక్తే లేదని ఆపరేషన్ సిందూర్‌తో రుజువు చేశాం. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు ప్రధాని మోదీ. సరైన నిర్ణయం సరైన సమయంలో తీసుకునే సరైన నాయకుడూ మోదీయే' అని చంద్రబాబు ప్రశంసించారు.

చనిపోతే మురళీనాయక్‌లా చనిపోవాలి: పవన్

చనిపోతే జవాన్ మురళీనాయక్‌లా చనిపోవాలని, దేశం కోసం వీరమరణం పొందిన ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుందామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తిరంగా ర్యాలీలో పవన్ మాట్లాడారు. '1947లో దేశ విభజన జరిగినప్పటి నుంచి మనం ఎప్పుడూ ప్రశాంతత చూడలేదు. విభజన జరిగిన రోజు లక్షలాది మందిని చంపేశారు. ఈ రోజు అభివృద్ధి చెందుతున్న దేశంగా మనం ముందుకెళుతుంటే పాకిస్థాన్ వారు మన అభివృద్ధిని నిరోధించేందుకు ఉగ్రవాదాన్ని మనపైకి ఉసిగొల్పుతున్నారు. కోయంబత్తూర్ బాంబుపేలుళ్లు, గోకుల్‌చాట్ పేలుళ్లు, లుంబినీ పార్కు పేలుళ్లు, ముంబైలో తాజ్ హోటల్‌పై ఉగ్రదాడి.. ఇలా ఏది చూసినా దాని వెనుక పాకిస్థాన్ ఉంటోంది. మనం ఇక్కడ ఇంత ప్రశాంతంగా ఉన్నామంటే అది సరిహద్దుల్లోని సైనికుల చలవే. సూడో సెక్యులరిస్టులు కొందరు సెక్యులరిస్టుల ముసుగులో మన త్రివిధ దళాల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు. అలాంటి వారికి బుద్ధి చెప్పడమే మన సైనికులకు మనమిచ్చే మద్దతు. సినిమా హీరోలు దేశాన్ని నడిపేవారు కాదు.. వారు ఎంటర్‌టైన్ చేసేవారు మాత్రమే. సెలబ్రిటీల నుంచి దేశభక్తిని ఆశించకుండా, దేశభక్తి కోసం మురళీ నాయక్ వంటి వారిని ఉదాహరణగా చూపండి. పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పిన ప్రధాని మోదీ లాంటి వారికి మద్దతు ఇద్దాం. సహనానికి హద్దు ఉంటుంది. పాకిస్థాన్‌కు ఒక్కటే చెప్పాలి.. మీరు మా దేశం మీదకు వస్తే మేం మీ ఇళ్లలోకి వచ్చి కొడతాం అని బలంగా చెప్పాలి' అని పవన్ అన్నారు.

మోదీ సందేశాలను గమనించాలి: పురందేశ్వరి

2014 నుంచి సమర్థ, దృఢమైన నాయకత్వం వచ్చాక దేశ భద్రతతో చెలగాటం ఆడేవారికి దీటైన జవాబు ఇస్తున్నారని పురందేశ్వరి అన్నారు. 'మన ప్రతిస్పందన ఎలా ఉంటుందో తాజాగా పాకిస్థాన్‌పై జరిపిన దాడులను అందరూ చూశారు. సైనికులకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా తిరంగా యాత్రలు చేపట్టారు. మురళీనాయక్ ప్రాణత్యాగంతో అందరూ అండగా నిలబడాలని పెద్ద సంఖ్యలో వచ్చి సంఘీభావం తెలిపారు. ఉగ్రవాదం, చర్చలు సమాంతరంగా సాగవని.. ఉగ్రవాదం, వ్యాపారం సమాంతరంగా నడవకూడదని.. నీరు, రక్తం సమాంతరంగా పారలేవన్న మోదీ సందేశాన్ని అందరూ గమనించాలి' అని అన్నారు.

బెజవాడలో త్రివర్ణ శోభ

బెజవాడలో జరిగిన భారత శౌర్య తిరంగా ర్యాలీ దేశ భక్తిని రగిలించింది. జనం భారీ సంఖ్యలో స్వచ్ఛందంగా తరలి వచ్చారు. బందరు రోడ్డు త్రివర్ణంతో ధగధగలాడిపోయింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి త్రివర్ణ పతాకాలు చేతబూని నడిచారు. చంద్రబాబు, పవన్ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ హుషారు నింపారు. ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు 2 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది. భారత్ మాతాకీ జై, వందేమాతరం అంటూ జనం నినాదాలు చేశారు. పవన్ కల్యాణ్ కూడా భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నవారిని ఉత్సాహపరిచారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు.

తప్పుదారి పట్టిస్తారా?



కాకాణిపై సుప్రీం ఆగ్రహం

- క్వార్ట్జ్ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది
- అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వలేం
- సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరణ
- ముందస్తు బెయిల్‌కు నిరాకరణ

న్యూఢిల్లీ, మే 16 (ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ ఖనిజం అక్రమ తవ్వకాల కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం నిరాకరించింది. తనపై కేసుల్లేవంటూ కోర్టునే తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. క్వార్ట్జ్ ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలించారంటూ నమోదు చేసిన కేసు, గిరిజనులను బెదిరించి ఊర్లు ఖాళీ చేయించారనే ఫిర్యాదుతో ఆయనపై నమోదైన ఎస్సీ ఎస్టీ కేసు కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం కాకాణి తీవ్రంగా ప్రయత్నించారు. చివరకు ఈ కేసులపై ఆయన ఈ నెల 13న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే, ఏపీ ప్రభుత్వం తరఫున ప్రేరణ హాజరయ్యారు. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పెట్టిన కేసేనని దవే తెలిపారు. హైకోర్టు డివిజన్ బెంచ్ వద్దే తేల్చుకోవచ్చు కదా.. ఇక్కడి వరకు ఎందుకు వచ్చారని ధర్మాసనం ప్రశ్నించింది. డివిజన్ బెంచ్ కేసును జూన్ 16కు వాయిదా వేసిందని, అందుకే ఇక్కడకు వచ్చామని దవే బదులిచ్చారు. తనపై గతంలో ఎటువంటి నేరారోపణలూ లేవని, అటువంటి కేసులేమీ తనపై నమోదు కాలేదని కాకాణి కోర్టును తప్పుదారి పట్టించేలా పిటిషన్‌లో పేర్కొన్నారని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది ప్రేరణ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేసులు ఉన్నాయని మీరెలా చెబుతున్నారని కోర్టు ప్రశ్నించింది. ఆయనే స్వయంగా 2024 ఎన్నికల అఫిడవిట్‌లో కేసుల వివరాలు స్పష్టం చేశారంటూ ప్రేరణ సదరు అఫిడవిట్‌ను ధర్మాసనం ముందుంచారు. దానిని పరిశీలించిన కోర్టు.. తమను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారంటూ కాకాణిపై మండిపడింది. కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, వాస్తవాలేమిటో స్పష్టత రావాల్సిన అవసరం ఉందని, ఈ నేపథ్యంలో అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు తెలిపింది. అయితే కొట్టివేయొద్దని.. ఉపసంహరించుకుంటామని దవే విజ్ఞప్తి చేయగా.. ధర్మాసనం అంగీకరించింది.

ఇకనైనా లొంగిపోతారా?

నెల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో క్వార్ట్జ్ కేసులో కాకాణికి అన్ని దారులూ మూసుకుపోయాయని పోలీసు వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే ఏడు వారాలుగా ఆయన అజ్ఞాతంలో ఉన్నారు. ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టుపై పెట్టుకున్న చివరి ఆశ కూడా ఆవిరవడంతో అజ్ఞాతం వీడి లొంగిపోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని నెల్లూరు పోలీసులు మూడు సార్లు నోటీసులిచ్చినా ఆయన రాలేదు. దీంతో దేశం వదిలి వెళ్లడానికి వీల్లేకుండా అన్ని విమానాశ్రయాలకూ పోలీసులు లుకవుట్ నోటీసులు పంపారు. ఇదే సమయంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఆయన కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

రేపే నింగిలోకి రీశాట్-1బీ

పీఎస్‌ఎల్వీ-సీ61 ద్వారా ప్రయోగం

నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం

సూళ్లూరుపేట, తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో నిఘా సామర్థ్యాన్ని పెంచి, దేశ భద్రతను పటిష్ఠం చేసే అత్యాధునిక రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం రీశాట్-1బీ ప్రయోగానికి ఇస్రో సర్వం సిద్ధం చేసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ వేదికగా ఆదివారం ఉదయం 5:59 గంటలకు పీఎస్‌ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనుంది. ఈ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ శనివారం ఉదయం 7:59 గంటలకు ప్రారంభించనున్నారు. 22 గంటలపాటు కొనసాగే ఈ కౌంట్‌డౌన్ ముగిసిన వెంటనే షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్‌ఎల్వీ-సీ61 రాకెట్ నింగిలోకి దూసుకెళ్తుంది. నాలుగు దశల అనుసంధాన పనులు పూర్తిచేసుకుని ప్రయోగ వేదికపైనున్న పీఎస్‌ఎల్వీ-సీ61 రాకెట్‌కు శాస్త్రవేత్తలు శుక్రవారం తుది పరీక్షలు నిర్వహించారు. ఇక, పీఎస్‌ఎల్వీ-సీ61 రాకెట్ నమూనాను ఇస్రో ఛైర్మన్ నారాయణన్... శ్రీవారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని నారాయణన్ శాస్త్రవేత్తలతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. పీఎస్‌ఎల్వీ-సీ61 ప్రయోగం విజయవంతం కావాలని అమ్మవారికి పూజలు చేశారు.


హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

పెద్దమంత్రి అవినీతి కూడా పెద్దదే

- వెలుగులోకి ప్రాజెక్టుల్లో అక్రమాలు... త్వరలోనే చర్యలు
- జూన్ నెలాఖరుకు హంద్రీనీవా మొదటి దశ పూర్తి: మంత్రి నిమ్మల

మదనపల్లె, పుట్టపర్తి, మే 16(ఆంధ్రజ్యోతి): అయిదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భారీగా అవినీతి జరిగింది. ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు రిజర్వాయర్ల నిర్మాణంలో అక్రమాలు చోటు చేసుకున్నాయి' అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెళ్తున్న హంద్రీ-నీవా ప్రాజెక్టు లైనింగ్ పనులను మంత్రి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం దొమ్మన్నబావి వద్ద హంద్రీ-నీవా కాంక్రీటు పనులను, శ్రీసత్యసాయి జిల్లా మలకవేముల వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులను పరిశీలించారు. అనంతరం కుప్పం పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో మదనపల్లె బైపాస్ రోడ్డు వద్ద మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వంలో ఆయన పెద్ద మంత్రేకాదు.. అవినీతి కూడా పెద్దదే. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ నిర్మాణంలో నిబంధనలు అతిక్రమించడమే కాదు.. భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న విజిలెన్స్ విచారణలో అక్రమాలు ఒక్కొక్కటీ బయటకు వస్తున్నాయి. త్వరలోనే పెద్దిరెడ్డిపై చర్యలు ఉంటాయి. ఈ మూడు ప్రాజెక్టులకూ అనుమతి తీసుకోకుండా నిర్మాణం చేపడుతున్నారంటూ గ్రీన్ ట్రిబ్యునల్‌కి రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో ట్రిబ్యునల్... ప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా విధించింది. అయితే వీటిని స్వలాభం కోసం నిర్మించి రూ.కోట్లు నొక్కేసిన పెద్దిరెడ్డి.. రూ.25 కోట్లు అపరాధం కూడా ప్రభుత్వం నుంచి చెల్లించారు. అది ఆయన సొంత డబ్బులు చెల్లించి ఉంటే బాగుండేది. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు మొదటి దశ పనులను జూన్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు పట్టుదలతో ఉన్నారు. కాలువ లైనింగ్, వెడల్పు పనులకు ప్రభుత్వం రూ.3,873 కోట్లు ఖర్చు చేస్తోంది. విస్తరణ పనులు పూర్తయితే కాలువ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరుగుతుంది. ఐదు నెలల్లో పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నాం. మొదటి దశ పనులు వచ్చే నెలలో పూర్తి చేస్తాం. పుంగనూరు ఉప కాలువ లైనింగ్ పనులను రూ.480 కోట్లతో ఈఏడాది జనవరిలో ప్రారంభించాం. హంద్రీనీవా ప్రాజెక్టుకు 2014-19లోనే టీడీపీ ప్రభుత్వం రూ.5 వేల కోట్లు ఖర్చు చేసింది. వైసీపీ ప్రభుత్వం రూ.500 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయనంత ద్రోహం, అన్యాయం జగన్ రాయలసీమకు చేశారు' అని నిమ్మల విమర్శించారు.

ధరలపై జగన్‌ది తప్పుడు ప్రచారం: మంత్రి అచ్చెన్న

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్యాలెస్ పెద్దలపై వస్తున్న ఆరోపణలను దారి మళ్లించేందుకు పంటలకు గిట్టుబాటు ధరలు రావట్లేదంటూ బెంగళూరు నుంచి జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నాడని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. మిర్చి, పొగాకు, కోకో ధరలు అంతర్జాతీయంగా తగ్గినా, రైతులకు నష్టం రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే.. జగన్ మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మంత్రి ఓ ప్రకటన చేస్తూ, బర్లీ పొగాకు క్వింటా కనీసం రూ.12,500కు కొనాలని, జీపీఐ, ఐటీసీ వంటి సంస్థలు తక్షణమే 20 మిలియన్ కిలోలు కొనుగోలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చి, రైతుకు అండగా నిలబడితే.. బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చున్న జగన్‌కి ఏం కనిపిస్తుందని నిలదీశారు. కోకో గింజలు కిలో రూ.500కు కొనాలని, తక్కువ ధరకు మిర్చిని అమ్మిన రైతులకు ప్రభుత్వ సాయం చేసేలా సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారు. జగన్ రాజకీయానికి రైతులు భయపడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు.

రైతులు నష్టపోకూడదు

- పంటలకు గిట్టుబాటు ధర రావాలి
- బర్లీ పొగాకు క్వింటా 12,500కు, కోకో కిలో 500కు కొనాలి
- రైతు దగ్గరున్న ధాన్యమంతా కొనుగోలు
- అధికారులకు చంద్రబాబు ఆదేశాలు



అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొగాకు రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకుండా, రేటు తగ్గకుండా, గిట్టుబాటు ధరకు వ్యాపారులు కొనుగోలు చేసేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కోకో రైతులను దోపిడీ చేయకుండా కిలో రూ.500కు కొనుగోలు చేసేలా చూడాలని, రైతుల దగ్గరున్న ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకు మిర్చిని అమ్మిన నిజమైన రైతుల జాబితాను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో పొగాకు, కోకో, మిర్చి ధరలు, ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులు, వ్యాపారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 'పొగాకు ధర పతనం కావడం సరికాదు. రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలి. పొగాకు కొనుగోళ్లు ఆపకుండా, రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం వెంటనే కొనుగోలు చేయాలి. రైతులు, ట్రేడర్లతో స్నేహపూరితంగా ఉంటాం. అలాగని రైతులకు అన్యాయం జరిగితే సహించం. ట్రేడర్లు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టులో పెట్టుకుని, ప్రస్తుతం పొగాకు కొనుగోళ్లపై తలెత్తిన సంక్షోభాన్ని నివారించకపోతే చర్యలు తీసుకోవటానికీ వెనుకాడేది లేదు' అని స్పష్టం చేశారు. పొగాకు ధర పతనం కాకుండా చర్యలు తీసుకోవడంలో పొగాకు బోర్డు విఫలమైందని, జీపీఐ, ఐటీసీ వంటి సంస్థలతో సరైన సమన్వయం లేదని సీఎం అసహనం వ్యక్తం చేశారు. అత్యధిక ధర ఆశ చూపి, రైతులు పొగాకు సాగు చేసేలా చేస్తున్న కంపెనీలు, పంట చేతికొచ్చాక కనీస మద్దతు ధర కూడా కల్పించకుండా ధరలు తగ్గించి, సంక్షోభాన్ని సృష్టించడం సరికాదన్నారు. 'హెచ్‌డీ బర్లీ పొగాకును నాణ్యత మేరకు క్వింటా రూ.12,500కు కంపెనీలు కొనాలి. జీపీఐ, ఐటీసీ తక్షణమే 20 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలును ప్రారంభించాలి. ఎంత ధరకు, ఏమేరకు కొనుగోళ్లు సాగుతున్నాయో ఈ నెల 12న నివేదిక ఇవ్వాలి. కంట్రోల్ రూమ్, వాట్సాప్ గ్రూప్ ద్వారా పొగాకు కొనుగోళ్లను పర్యవేక్షించి, రెండురోజులకోసారి అధికారులు నివేదిక ఇవ్వాలి. ప్రస్తుత సమస్యను అధిగమించేందుకు బై బ్యాక్ పాలసీ ఉండాలి. రైతులు ఇక నుంచి కంపెనీలతో బైబ్యాక్ ఒప్పందం చేసుకోవాలి' అని సీఎం అన్నారు. డిమాండ్-సప్లై ప్రకారం ధర నిర్ణయించి, గిట్టుబాటు ధర ఇవ్వకపోతే, రైతులు పూర్తిగా పొగాకు సాగు మానేసే పరిస్థితి వస్తే.. కంపెనీలన్నీ మూతపడతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తి, ప్రొసెసింగ్, ఎగుమతులను నియంత్రిస్తోందని, వైట్ బర్లీని 90% కంపెనీలు కొనుగోలు చేశాయని, మిగిలిన హెచ్‌డీ బర్లీని కంపెనీలతో ఒప్పందం లేకుండా సాగు చేస్తున్నారని పొగాకు బోర్డు అధికారులు చెప్పారు. ఇప్పటికే 15మిలియన్ కిలోలు కొనుగోలు చేయగా, మిగతా ఉత్పత్తికి ఎగుమతి ఆర్డర్ల కోసం చూస్తున్నామని తెలిపారు. అయితే ఎఫ్‌సీవీ, వైట్ బర్లీ, హెచ్‌డీ బర్లీ 2024-25లో 1.90.456 హెక్టార్లలో సాగైతే, 450 మిలియన్ కిలోల దిగుబడి వచ్చిందని, ఇతర పంటల నుంచి రైతులు పొగాకు సాగువైపు మొగ్గు చూపడంతో ఉత్పత్తి రెట్టింపైందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. వచ్చే సీజన్‌లో అంతర్జాతీయ డిమాండ్, ధరల ఆధారంగా హెచ్‌డీ బర్లీ పొగాకు విస్తీర్ణాన్ని నియంత్రించేలా రైతులకు జూన్ నుంచి అవగాహన కల్పించాలని సూచించారు. కోకో పంటకూ గిట్టుబాటు ధర ఉండాలని, కిలో రూ.500కు తగ్గకుండా కోకో గింజలు కొనాలని కొనుగోలు సంస్థకు సీఎం సూచించారు. కోకో కొనుగోలులో రైతులను దోపిడీ చేస్తే సహించేది లేదన్నారు.

తక్కువ ధరకు అమ్మిన మిర్చి రైతుల జాబితా సిద్ధం చేయండి..

మార్కెట్ యార్డుల్లో మిర్చిని అమ్మిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని సీఎం మార్కెటింగ్ శాఖను ఆదేశించారు. జాబితాలో దళారులను తొలగించి, నిజమైన రైతులు ఎంతమేరకు నష్టపోయారో గుర్తించి, వారిని మాత్రమే చేర్చాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇంకా రైతుల దగ్గర ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, సన్నరకాల ధాన్యం పండించేలా రైతుల్ని ప్రోత్సహించాలని సీఎం ఆదేశించారు.

బిల్లులపై 'సుప్రీం' తీర్పు ఆదర్శం

- వివాదాల సృష్టి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం
- ఎన్నికల సంస్కరణల కోసం యువత ఉద్యమించాలి
- ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో జస్టిస్ జాస్తి చలమేశ్వర్



తిరుపతి (విద్య), మే 16(ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన పది బిల్లులకు సమ్మతి తెలపకుండా ఆ రాష్ట్ర గవర్నర్ రాజ్యాంగ వ్యతిరేఖ వైఖరి అవలంబించారని, దానికి అడ్డుకట్ట వేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు స్వాగతించదగిందని మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో ఆయన 'ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం' తదితర అంశాలపై ప్రసంగించారు. భారత రాజ్యాంగాన్ని, ఫెడరల్ స్వభావాన్ని, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాపాడే విషయంలో సుప్రీం తీర్పు ఆదర్శవంతమైందని పేర్కొన్నారు. అలాంటి తీర్పులను స్వాగతించి, రాజ్యాంగబద్ధంగా అమలు చేయాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా వివాదాలు సృష్టించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాదని న్యాయవ్యవస్థపైనే రాష్ట్రపతి ప్రశ్నలు సంధిస్తున్న పరిస్థితులు నేడు దేశంలో ఉన్నాయన్నారు. ఎన్నికల సంస్కరణలు జరగకపోతే దేశానికి ప్రజాస్వామిక భవిష్యత్ ఉండబోదని జస్టిస్ చలమేశ్వర్ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత యువతదే అని, ఎన్నికలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎన్నికల నిర్వహణ ఖర్చులో కూడా మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. వీటిపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. పత్రికా స్వేచ్ఛకు సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేకంగా చట్టం లేనప్పటికీ, 19(1ఏ)లో పొందుపరిచిన స్వేచ్ఛను పత్రికా స్వేచ్ఛగా పరిగణించాలన్నారు.


ఐదు లక్షల మందితో యోగా డే

- విశాఖ కార్యక్రమానికి ప్రధాని మోదీ: సీఎం చంద్రబాబు

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): 'విశాఖపట్నంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా డేను రికార్డు సృష్టించేలా నిర్వహించాలి. యోగా డే ప్రకటించి 10 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జూన్ 21న యోగా డే కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రధాని స్వయంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో దీనిని చరిత్రలో నిలిపోయేలా చేపట్టాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. యోగా డే నిర్వహణపై సీఎం చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్ 'యోగా ఫర్ వన్ ఎర్త్... వన్ హెల్త్'. యోగా డే నాడు నిర్వహించే కార్యక్రమం రాష్ట్రంలో యోగ అభ్యాసానికి నాంది పలకాలి. కనీసం రెండు కోట్ల మందికి ఈ కార్యక్రమం చేరాలి. 'యోగాంధ్ర-2025' థీమ్‌తో రాష్ట్రంలో ప్రచారం చేపట్టాలి. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు 'యోగా మంత్' పాటించాలి. నెల రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారిని గుర్తిస్తూ సర్టిఫికెట్ ఇవ్వాలి. రాష్ట్రంలోని పాఠశాల, కళాశాల విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. 'ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు అన్ని చోట్లా ప్రజలు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సుమారు 2.5 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. యోగా చేసేందుకు 68 ప్రాంతాలు గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో 2,58,948 మంది యోగ సాధనకు అవకాశం కల్పిస్తున్నాం' అని అధికారులు వివరించారు. సీఎం మాట్లాడుతూ, 'ఆర్కే బీచ్ నుంచి శ్రీకాకుళం వరకు... బీచ్ పొడవునా అన్ని అనుకూల ప్రాంతాల్లో ప్రజలను ఆహ్వానించండి. ఐదు లక్షల మందితో కార్యక్రమాన్ని నిర్వహించండి' అని సీఎం చంద్రబాబు సూచించారు.

భూ రికార్డుల డిజిటలైజేషన్‌లో ఏపీ భేష్

- ప్రోత్సాహక నిధుల్లో రాష్ట్రానికి సింహభాగం: కేంద్రమంత్రి పెమ్మసాని
- గడువులోగా 10 మున్సిపాలిటీల్లో డిజిటలైజేషన్: మంత్రి నారాయణ



గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక విధానాలతోనే భారతదేశ అభివృద్ధి, ప్రగతి సాధ్యమవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు భూసర్వే డిజిటలైజేషన్‌లో ముందంజలో ఉన్నాయని చెప్పారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహక నిధుల్లో సింహభాగాన్ని దక్కించుకుందన్నారు. తొలి దశలో 15 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రణాళికలో భాగంగా 3 లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని పూర్తి చేశామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి కచ్చితమైన భూ రికార్డులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గుంటూరులో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భూ వనరుల విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునీకరణ కార్యక్రమంలో భాగంగా సర్వే, రీసర్వేపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని, రాష్ట్రమంత్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి పి నారాయణ మాట్లాడుతూ, పట్టణాల్లో రెవెన్యూ రికార్డులు పక్కాగా అమలు చేయడానికి, భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్(నక్షా) కార్యక్రమాన్ని కేంద్రం తీసుకువచ్చిందన్నారు. సమర్థ పాలన అందించేందుకు నక్షా ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. నక్షా పైలట్ ప్రోగ్రామ్ ద్వారా రాష్ట్రంలోని 10 మునిసిపాలిటీల్లో 524 చ.కి.మీ. విస్తీర్ణంలో 9.5 లక్షల ఆస్తులను నిర్దేశిత గడువులోగా సర్వే చేసి డిజిటలైజేషన్ చేయనున్నామని తెలిపారు.

తుర్కియే, అజర్‌బైజాన్‌కు పర్యటనలు రద్దు

- ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ బాయ్‌కాట్

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి తుర్కియే, అజర్‌బైజాన్ దేశాలకు పర్యాటకులను ఇకపై తీసుకెళ్లబోమని, ఆ దేశాలను బాయ్‌కాట్ చేస్తున్నామని టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(టీటీఏపీ) శుక్రవారం ప్రకటించింది. భారత్‌పై కాలు దువ్వుతున్న పాకిస్థాన్‌కు తుర్కియే అండగా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని టీటీఏపీ అధ్యక్షుడు కె.విజయమోహన్ తెలిపారు. రాష్ట్రం నుంచి ఏటా సుమారు ఎనిమిది వేల మంది పర్యాటకులు ఆ రెండు దేశాలకు వెళతారని తెలిపారు. వీరి ద్వారా ఆయా దేశాల్లో ఏడాదికి సుమారు రూ.700 కోట్ల వ్యాపారం జరుగుతోందన్నారు.

లిక్కర్ 'బాసులు' అరెస్టు!

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలు జారీచేసింది. లిక్కర్ కేసులో అరెస్టును తప్పించుకోవడానికి ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి హైకోర్టు, సుప్రీంకోర్టుల దాకా వెళ్లి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దీంతో సిట్ అధికారులు కీలక నిర్ణయం తీసుకుని వారిని అదుపులోకి తీసుకొన్నారు. ఐదేళ్ల పాటు తాడేపల్లి ప్యాలెస్ నుంచి రాష్ట్రమంతా చక్రం తిప్పిన వీరిని అదుపులోకి తీసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి కళ్లు, చెవుల్లాంటి ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ బంధించడంతో తాడేపల్లి ప్యాలెస్‌లో భూమి కంపించినట్లు అయింది.

సుప్రీంకోర్టు షాక్ ఇవ్వగానే..

మద్యం కుంభకోణంలో గుట్టుమట్లు లాగుతున్న సిట్ అధికారులు ఒక్కొక్క నిందితుడిని విచారించేక్రమంలో వెలికి వచ్చిన అంశాలు, లభించిన ఆధారాలతో ముందుకెళ్లారు. లిక్కర్ స్కామ్‌లో ప్రతి అడుగులో కీలక భూమిక పోషించినట్టు నిర్ధారించుకుని ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని ఈకేసులో నిందితులుగా చేర్చారు. మొత్తం కుట్రలో వీరు భాగస్వాములుగా మారారని సిట్ ఇప్పటికే కోర్టుకు తెలిపింది. స్కామ్‌లో కింగ్ పిన్ రాజ్ కసిరెడ్డి(ఏ1), వాసుదేవ రెడ్డి(ఏ2), విజయసాయి రెడ్డి(ఏ4), మిథున్ రెడ్డి(ఏ6)తో కలిసి అన్ని స్థాయిల్లోనూ సమావేశమై ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప (భారతి సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్, చార్టర్డ్ అకౌంటెంట్) చర్చలు జరిపారు. దీనిపై పక్కా ఆధారాలు సేకరించిన సిట్ అధికారులు వీరు ముగ్గురిని వరుసగా ఏ31, ఏ32, ఏ33గా నిందితుల జాబితాలో చేర్చారు. ఈ నెల 11న ఆదివారం ఉదయం విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాల్సిందిగా హైదరాబాద్‌లోని వీరి ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేశారు. అత్తాపూర్‌లోని ఉప్పరపల్లి సన్‌రైజ్ విల్లాలో ఉన్న కృష్ణమోహన్ రెడ్డి ఇంటికెళ్లి ఆయన లేకపోవడంతో కుమారుడు రోహిత్ రెడ్డి చేతికి ఇచ్చారు. ధనుంజయ్ రెడ్డి ఇంట్లో లేకపోవడంతో కుటుంబ సభ్యులకు, బాలాజీ గోవిందప్ప ఇంట్లోనూ అందజేసి వచ్చారు. అప్రమత్తమైన ముగ్గురూ మొదట హైకోర్టును ఆ తర్వాత సుప్రీం కోర్టును ఆశ్రయించినా ఎలాంటి ఉపశమనం లభించలేదు. దీంతో సిట్ అధికారులు ఎప్పుడైనా అరెస్టు చేస్తారనే అనుమానంతో ముందస్తు బెయిల్ పిటిషన్ హైకోర్టులో దాఖలు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నెల 11న విచారణకు వస్తారని ఎదురు చూసిన సిట్ అధికారులకు నిందితులు ముఖం చాటేశారు. ఈ నెల 13న సుప్రీం కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ ఉన్నందున ముగ్గురూ ప్రణాళిక ప్రకారమే మాయమైనట్లు గుర్తించిన సిట్ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో వెతికారు. టెక్నాలజీ సాయంతో బాలాజీ గోవిందప్పను కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాలోని బీఆర్ హిల్స్‌లో 13న పట్టుకున్నారు. ఆయనను 14న విజయవాడకు తీసుకొచ్చిన సిట్ అధికారులు కోర్టులో ప్రవేశ పెట్టారు. ఇదిలా ఉండగా ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు విన్న సుప్రీం కోర్టు తన నిర్ణయాన్ని శుక్రవారానికి వాయిదా వేసింది. అప్పటి వరకూ అరెస్టు చేయవద్దంటూ సిట్ అధికారులకు సూచించింది. ఇద్దరూ విచారణకు సహకరించాలని ఆదేశించింది. దీంతో అప్పటివరకూ అజ్ఞాతంలో ఉన్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి అనూహ్యంగా బుధవారం మధ్యాహ్నం విచారణకు వచ్చారు. గురువారం సుదీర్ఘంగా ప్రశ్నించినా 'మాకెలాంటి సంబంధం లేదు.. మాకేమీ తెలీదు..' అంటూ ఒకటే పాట పాడుతూ ఒక్క ప్రశ్నకూ సరైన సమాధానం ఇవ్వలేదు. అయితే శుక్రవారం నాడు సుప్రీం కోర్టులో ఇద్దరికీ ఎదురు దెబ్బ తగలడంతో సిట్ అధికారులు వీరిని అదుపులోకి తీసుకుంది. శనివారం వారిని కోర్టులో ప్రవేశపెట్టనుంది.

వైఎస్ నుంచి జగన్ దాకా..

నెల్లూరుకు చెందిన కృష్ణమోహన్ రెడ్డి....వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పులివెందుల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(పుడా) కమిషనర్‌గా నియమితులయ్యారు. అక్కడ ఉండగానే వైఎస్ కుటుంబానికి బాగా దగ్గరయ్యారు. జగన్ కుటుంబానికి కట్టప్పగా పేరున్న కృష్ణమోహన్ రెడ్డి వీఆర్ఎస్ తీసుకుని వైఎస్ కుటుంబంలో ఒకరిగా మెలిగారు. వైఎస్ మరణం తర్వాత జగన్ చెంతకు ఆయన చేరారు. అక్రమాస్తుల కేసులో సీబీఐ జగన్‌ను అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు వైఎస్ విజయమ్మ వద్ద కృష్ణమోహన్‌రెడ్డి ఓఎస్డీగా పనిచేశారు. 2019 మార్చి 15 వేకువజామున మాజీ మంత్రి వివేకానంద రెడ్డి మరణ వార్త జగన్మోహన్ రెడ్డికి చెప్పేందుకు ఎంపీ అవినాశ్‌రెడ్డి ఫోన్ చేసింది కృష్ణమోహన్ రెడ్డి నంబర్‌కే. కృష్ణమోహన్‌రెడ్డికి మద్యం ముడుపులు ఎక్కడికి చేరాయో తెలుసు. ఆ రహస్యాన్ని తెలుసుకోవడానికి సిట్ అధికారులు కస్టడీ పిటిషన్ వేయబోతున్నారు. కాగా, ధనుంజయ్‌రెడ్డికి జగన్ మనిషిగా పేరుంది. ఆయన మద్యం కుంభకోణంలో కీలకంగా వ్యవహరించారని సిట్ గుర్తించింది.

మద్యం స్కాంలో ఈడీ పిటిషన్‌పై

విచారణ 19కి వాయిదా

విజయవాడ, మే 16(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఈడీ దాఖలుచేసిన పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయన నుంచి వాంగ్మూలం తీసుకోవడానికి అనుమతివ్వాలని ఈడీ తరఫు న్యాయవాది జయప్రకాశ్ గురువారం ఈ పిటిషన్ వేయగా.. సాంకేతిక కారణాలతో న్యాయాధికారి పి.భాస్కరరావు తిరస్కరించారు. దీంతో శుక్రవారం ఉదయం మళ్లీ వ్యాజ్యం దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయాధికారి రాజశేఖర్‌రెడ్డికి నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

బాలాజీ గోవిందప్పను

కస్టడీకి ఇవ్వండి

▸ ఏసీబీ కోర్టులో సిట్ వ్యాజ్యం

విజయవాడ, మే 16(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బాలాజీ గోవిందప్పను వారంపాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండ్రోజుల క్రితం ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆయన్ను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందని సిట్ కోర్టుకు నివేదించింది.

సీఎంకు కార్యదర్శి అంటే ప్రభుత్వ పాలనలో సహకరించే అధికారి. కానీ ధనుంజయ్‌రెడ్డి అంతకన్నా ఎక్కువ. ఇటు వైసీపీలోనూ, అటు ప్రభుత్వంలోనూ అక్టోపస్‌లా విస్తరించారు. 'సీఎంతో పనిలేదు...ధనుంజయ్ ఒప్పుకొంటే చాలు' అన్నట్టు తన పరపతి పెంచుకున్నారు. ప్రభుత్వ పాలనకంటే, జగన్ సొంత పనుల పర్యవేక్షణ, అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దడంలో ధనుంజయ్‌రెడ్డి ఆరితేరారు. జగన్ కోసం ఆయన చేయని పనులు లేవని సీనియర్ అధికారులు చెబుతున్నారు. ఫలితంగానే వేలకోట్ల రూపాయల లిక్కర్ కుంభకోణం కేసులో అడ్డంగా దొరికిపోయారని వ్యాఖ్యానిస్తున్నారు.

అస్మదీయులు, తన సన్నిహితులు దేశంలోని ఏ సర్వీసులో ఉన్నా వారిని జగన్ ఏపీకి తీసుకొచ్చి ఆనాడు కీలక పదవులు కట్టబెట్టారు. వాసుదేవరెడ్డి, వెంకటరెడ్డి, దర్శా రెడ్డి తదితరులు అలా వచ్చినవారే. రాష్ట్ర సర్వీసుతో సంబంధం లేకున్నా ఏపీకి వచ్చి కీలక పోస్టుల్లో పనిచేశారు. ఇక.. ఏరికోరి సీఎంవోలోకి తెచ్చుకున్న ధనుంజయ్ రెడ్డి తొక్కని అడ్డదారి లేదు. ఆయన కోసం జగన్ ఏకంగా నిబంధనలకు పాతరేసి ఐఏఎస్ హోదా కట్టబెట్టారు.



జగన్ షాడో...

మీటింగ్స్, డీలింగ్స్‌లో ధనుంజయ్ దిట్ట

▸ సర్వాంతర్యామిలా ఎదిగిన అధికారి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర రాజకీయాల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డే ప్రత్యేకమైన మనిషి. పదవీకాంక్ష, సొంత ప్రయోజనాలు, స్వలాభం, స్వీయ రాజకీయ లబ్ధి ఉంటే తప్ప దేనిగురించీ ఆలోచించని వ్యక్తి. ఒక్క చాన్స్ అన్నందుకు ఐదేళ్ల రాష్ట్రానికి ఎంత నరకం చూపించారో అందరికీ తెలుసు. ఆ కోవలోని మరో మనిషే ధనుంజయ్‌రెడ్డి. ఉమ్మడి కడప జిల్లాకే చెందిన ఈ రిటైర్డ్ ఐఏఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు కార్యదర్శిగా పనిచేశారు. జగన్‌కు పక్కషాడోగా వ్యవహరించారు. రాజకీయ సేవ, పాలనా సేవలో సర్వాంతర్యామిలా ఎదిగారు. ఆయన వేలుపెట్టని రంగం లేదు. ఆయన అనుమతి లేకుండా చీమ కూడా సీఎంవోలోకి వెళ్లలేనంతగా తన హోదాను పెంచుకున్నారు. ఆ కింగ్‌పిన్ ఇప్పుడు దొరకడంతో లిక్కర్‌తో పాటు అనేక కొత్త విషయాలు బయటపడొచ్చని చర్చోపచర్చలు సాగుతున్నాయి.

జగన్ కోసం...

ధనుంజయరెడ్డి 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక తొలుత అదపు కార్యదర్శిగా చేరారు. ఆ తర్వాత కార్యదర్శిగా పనిచేశారు. అప్పుడే ఆయన అసలు విశ్వరూపం బయటపడింది. కడప జిల్లాకే సంబంధించి ఎంతోమంది అధికారులు, జగన్ సామాజికవర్గానికి చెందిన వారు ఎందరో ఉన్నా ఏరికోరి ఈయననే ఎందుకు తన పేషీలోకి తొలుత తీసుకున్నారని అంతా షాక్ అయ్యారు. ఆ తర్వాతే అసలు కారణాలు తెలిశాయి. జగన్‌లాగే ఆలోచించడం, మీటింగ్స్, డీలింగ్స్‌తో పాటు తక్కువ సమయంలో ఎక్కువ వ్యవహారాలు చక్కబెట్టడంలో ఈయనకు మంచి రికార్డు ఉందని, అందుకే పేషీలోకి తీసుకున్నారని అదేజిల్లాకు చెందిన ఓ సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ చెప్పారు. గ్రూపు, వర్గరాజకీయాలు, వ్యూహాలు నడపడంలో ఆయన దిట్ట అని వివరించారు. ఆచరణలోనూ అదే నిరూపితమైంది. జగన్ పేషీలో ఉంటూ మొదటి రెండేళ్లు అంటే, 2019, 2020లో జగన్ ఆలోచనావిధానం అర్థం చేసుకున్నారనీ, ఆ తర్వాత ఆయన షాడోగా మారారని అధికారులు చెబుతున్నారు. పరిపాలనా బాధ్యతల కన్నా జగన్ సొంత వ్యవహారాలను చక్కదిద్దడంపైనే దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. ఇసుక, మద్యం, కాంట్రాక్ట్‌లు, ఇతర కీలకమైన వాటిల్లో ధనుంజయ్‌రెడ్డికే జగన్ నిర్ణయాధికారాలు ఇచ్చినట్లు వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

సర్వాంతర్యామిలా...

జగన్‌కు కార్యదర్శిగా ప్రభుత్వ వ్యవహారాల్లో చేదోడుగా ఉండాల్సిన అధికారి కాలక్రమేణా మాజీ సీఎం సొంత వ్యవహారాలపై ఫోకస్‌పెట్టేలా ఎదిగారని వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. ధనుంజయ్‌రెడ్డి తనకిచ్చిన పనుల ఫలితాలను అద్భుతంగా చూపించాక ఈయనపైనే ఎక్కువ ఆధారపడేలా చేసుకున్నారని ఓ కీలక వైసీపీనేత చెబుతున్నారు. నిఘా నివేదికలు నేరుగా సీఎం చూడాలి. కానీ ఒక దశలో ఆ నివేదికలు కార్యదర్శికి వెళ్లేవని, వాటి ఆధారంగా ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు క్లాసులు తీసుకొనే వారని తెలిసింది. ఇద్దరు సీనియర్ మంత్రులు మినహా మిగతా మంత్రులు ఈయన నుంచి ఫోన్ అంటేనే హడలెత్తిపోయేవారని తెలిసింది. ఇక కొత్త ఎమ్మెల్యేల పరిస్థితి భయానకంగా ఉండేదని సీనియర్ నేత చెప్పారు. ఎమ్మెల్యేలు సీఎంను కలవాలంటే ముందు ధనుంజయ్ అనుమతి తీసుకోవాలని చెప్పేవారని, ఆయన అపాయింట్‌మెంట్ దక్కడమే గగనంగా ఉండేదని ఆ నేత పేర్కొన్నారు.

గుప్పిట్లో పాలనా వ్యవస్థ..

నాటి సీఎం జగన్‌కు పాలనా వ్యవస్థ గురించి అనుభవం లేదు. పట్టులేదు. పట్టంతా ధనుంజయ్‌రెడ్డిదే. అధికారుల పోస్టింగ్‌లు, బదిలీలు, క్రమశిక్షణా చర్యలు...ఇలా అన్నింటా ఆయనదే నిర్ణయాధికారంగా ఉండేదని సీనియర్ అధికారులు చెబుతున్నారు. తన సామాజికవర్గానికి చెందిన అధికారులతో ప్రత్యేక కోటరీ నడిపేవారని, తనకు నమ్మకంగా, విశ్వాసంగా ఉండేవారికి పిలిచి మరీ కీలక పోస్టింగ్‌లు ఇచ్చేవారని చెబుతున్నారు. తనను ప్రశ్నించేవారు సొంత సామాజికవర్గమయినా వారికి పోస్టింగ్‌లు ఉండేవి కావని, వెయిటింగ్‌లో ఉంచేవారని బాధిత అధికారులు చెబుతున్నారు. "సిస్టంతో పెట్టుకోవద్దు. సిస్టంలో మీరు ఉండాలా? వద్దా? అనేది మేం డిసైడ్‌చేస్తాం. మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యానికి ఏం జరిగిందో చూశారు కదా...మేం ఇచ్చిన పోస్టులో చేరండి. చెప్పిన పనిచేయండి." అని అధికారులను తీవ్రంగా మందలించడం, బెదిరించడం చేశారని ఓ బాధిత అధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. తనను ప్రశ్నిస్తే సీనియర్ అధికారులను కూడా అమర్యాదగా, అగౌరవంగా ధనుంజయ్‌రెడ్డి చూసేవారని వాపోయారు. "గత ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీచేసిన ఓ అధికారి ధనుంజయ్‌కి స్నేహితుడు. జగన్ పాలనలో ఆయనకు ఎనిమిది శాఖలు ఇచ్చారు. అర్హత లేకపోయినా అందలం ఎక్కించారు. ఓ స్పెషల్ సీఎస్ కేడర్ అధికారి మాట వినడం లేదని రెవెన్యూశాఖ నుంచి తప్పించారు. సెలవుపై వెళ్తే, సీసీఎల్ఏ పోస్టును కూడా తీసేయ్యాలని చూశారు" అని ఓ సీనియర్ ఐఏఎస్ చెప్పారు. నాణానికి ఇది ఒక కోణం. రెండోకోణంలో ఆయన వైసీపీకి రాజకీయ వ్యూహాలు అందించారన్న ఆరోపణలు ఉన్నాయి. నిఘా విభాగం, ఐప్యాక్ ఇచ్చిన నివేదికలను దగ్గరపెట్టుకొని ఎమ్మెల్యేలపై పెత్తనం చేసేవారని విమర్శలున్నాయి. ధనుంజయ్‌రెడ్డి వల్ల తాము జగన్‌ను కలవలేకపోతున్నామని, ఆయన వల్లే ఓడిపోయామని చాలా మంది మాజీలు బహిరంగంగా ఆరోపణలు చేశారు. ధనుంజయ్‌రెడ్డి తమకు ,జగన్‌కు మధ్య అడ్డుగోడలు కట్టారని, మాకు జగన్‌కు గ్యాప్ పెరిగేలా చేశారని మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు సైతం తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం కార్యదర్శి హోదాలో ధనుంజయ్‌రెడ్డిపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. ఏ ఒక్కదానిపైనా జగన్ స్పందించలేదు. ధనుంజయ్ కూడా దేనికీ బదులివ్వలేదు. పైగా, తనను మీడియా, రాజకీయ పక్షాలు టార్గెట్ చేస్తున్నాయని, వాటి చర్యలను ఖండించాలంటూ ఐఏఎస్ సంఘంపై ఒత్తిడిచేసేవారు. ఆయన పోరు భరించలేక ఐఏఎస్ సంఘం ప్రెస్‌మీట్‌పెట్టి లేని తలనొప్పులు తెచ్చుకుంది. ఇక, ఓ అధికారి భార్య బంగారంతో ఎయిర్‌పోర్టులో దొరికితే ఓ సీనియర్ జర్నలిస్టు అంకబాబు సోషల్‌మీడియాలో పోస్టుపెట్టారు. ధనుంజయ్‌రెడ్డి పోలీసులను అంకబాబుపైకి ఉసిగొల్పి తన ప్రతాపాన్ని ప్రదర్శించారు. ముందస్తు నోటీసు, సమాచారం ఇవ్వకుండా ఆ సీనియర్ జర్నలిస్టును పోలీసులు అరెస్ట్ చేసి తీవ్ర చిత్రహింసలకు గురిచేశారు.

ఎవరీ ధనుంజయ్‌రెడ్డి?

ఉమ్మడి కడప జిల్లా రాయచోటి ప్రాంతానికి చెందిన వ్యక్తి ధనుంజయ్‌రెడ్డి. రాయచోటి మండలం చెన్నెముక్కపల్లి సర్పంచిగా 1988లో ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎంఎస్సీ చదివారు. 1992లో ఢిల్లీ, అండమాన్, నికోబార్ సివిల్ సర్వీసెస్ (డానిప్)లో గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆయనను డిప్యుటేషన్‌పై ఏపీకి తీసుకొచ్చారు. ఒకే సామాజిక వర్గం, సొంత జిల్లా అన్న అభిమానంతో కీలక పోస్టింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ఆయన ఏపీ సర్వీసులో కలిసిపోయి ఇక్కడి నుంచే 2006లో నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్ హోదా పొందారు. ఆ తర్వాత అత్యంత కీలకమైన పోస్టింగ్‌లు దక్కించుకున్నారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా వచ్చాక ఆయన పరపతి, హవా ఒక్కసారిగా పెరిగిపోయాయి. స్నేహాలు, సర్కిల్స్ పెరిగాయి. వైఎస్ మరణం తర్వాత ఈయనకు పెద్దగా ప్రాధాన్య పోస్టింగులు రాలేదు. రాష్ట్ర విభజన తర్వాత నాటి టీడీపీ ప్రభుత్వమే ఆయనను వ్యవసాయశాఖ కమిషనర్‌గా నియమించింది. 2017లో శ్రీకాకుళం కలెక్టర్‌గా పంపింది. 2019 ఎన్నికల్లో జగన్ గెలిచాక అదనపు కార్యదర్శిగా నియామక ఉత్తర్వులు రాకముందే జగన్ కోసం సేవలు ప్రారంభించారు. అప్పటి నుంచి 2024 మే 31న రిటైర్ అయ్యేవరకు జగన్ సేవలో రాటుతేలిపోయారు.

పీఎస్ఆర్ బెయిల్ పిటిషన్ కొట్టివేత



విజయవాడ, మే 16(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షా పత్రాలను డిజిటల్ మూల్యాంకనం చేసిన కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు కోర్టు షాక్ ఇచ్చింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ఆయన ప్రధాన నిందితుడు కాగా, పమిడికాల్వ మధుసూదన్ రెండో నిందితుడు. ప్రస్తుతం వీరిద్దరూ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వీరు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సూర్యారావుపేట పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. పీఎస్ఆర్ తరఫున న్యాయవాది విష్ణువర్ధన్, ప్రాసిక్యూషన్ తరఫున సిద్ధిఖ్ వాదనలు వినిపించారు. ఇరు వర్గాల వాదనల అనంతరం న్యాయాధికారి దేవిక... పీఎస్ఆర్ బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పును చెప్పారు. మధుసూదన్ బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి పోలీసులు గడువు కోరడంతో విచారణను 19వ తేదీకి వాయిదా వేశారు.

యడ్లపాడు దాటి వెళ్లొద్దు!

▸ విడదల రజని మరిదికి షరతులతో బెయిల్

విజయవాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ వ్యాపారులను బెదిరించి అక్రమంగా ముడుపులు వసూలు చేశారన్న అభియోగాలతో అరెస్టయిన మాజీ మంత్రి విడదల రజని మరిది విడదల వేణుగోపీనాథ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. రూ.30 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, పాస్‌పోర్టును కోర్టుకు సమర్పించాలని.. యడ్లపాడు గ్రామం విడిచి వెళ్లకూడదని, ఈ కేసు గురించి మీడియాతో మాట్లాడవద్దని ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు స్పష్టంచేశారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రిమాండ్ రిపోర్టులో వారిద్దరి పేర్లు లేవు

▸ తప్పుడు కేసులతో అరెస్టులు: వైసీపీ

విజయవాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రిటైర్డ్ అధికారుల విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తోందని వైసీపీ నేతలు విమర్శించారు. మద్యం కుంభకోణం కేసులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టు విషయం తెలిసి ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, నేతలు దేవినేని అవినాష్, మల్లాది విష్ణు, సుదర్శన్‌రెడ్డి శుక్రవారం విజయవాడ పోలీసు కమిషనరేట్ వద్దకు వచ్చారు. అక్కడ మీడియాతో మాట్లాడారు. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి వరుసగా మూడ్రోజులు విచారణకు హాజరయ్యారని.. ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి రిమాండ్ రిపోర్టుల్లో ఎక్కడా వారిద్దరి పేర్లు లేవని చెప్పారు. లేని పాత్రధారులను ఉన్నట్లు, జరగని కుంభకోణాన్ని జరిగినట్లు చూపిస్తున్నారని విమర్శించారు. అరెస్టులు రాజకీయ కక్షలో భాగంగానే జరిగాయని.. తప్పుడు కేసులతో అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ వేధింపులకు వైసీపీ భయపడదన్నారు.

వారిద్దరికీ వ్యతిరేకంగా సాక్ష్యాలు!

న్యూఢిల్లీ, మే 16 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో మద్యం కుంభకోణం కేసులో సీఎంవో మాజీ కార్యదర్శి కె.ధనుంజయ్‌రెడ్డి, మాజీ సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. ఈ స్కాంలో వారిద్దరికీ వ్యతిరేకంగా ప్రాథమిక సాక్ష్యాలు ఉన్నట్లు అర్థమవుతోందని స్పష్టం చేసింది. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. వారి పిటిషన్లను కొట్టివేసింది. ఏపీ మద్యం కుంభకోణం కేసులో ధనుంజయ్‌రెడ్డి (ఏ-31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), భారతీ సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప (ఏ-33) నిందితులుగా ఉన్నారు. ముందస్తు బెయిల్ కోరుతూ ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు నిరాకరించింది. ఆ తీర్పును వారిద్దరూ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్.. కృష్ణమోహన్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ధనుంజయ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్, బాలాజీ గోవిందప్ప తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిన తర్వాత రాజకీయ నేతలు, అధికారులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సింఘ్వీ అన్నారు. నిందితులు దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నారని, ప్రభుత్వం రాజకీయ పక్షపాత ధోరణితో అసత్య కేసులు పెట్టిందని తెలిపారు. నిందితులు మద్యం వ్యాపారాన్ని ఉద్దేశపూర్వకంగానే కొందరికి కట్టబెట్టారని చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ఈ కేసు ఇప్పటికే కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) వరకు వెళ్లిందని, అక్కడ మూసివేశారని గుర్తుచేశారు. సింఘ్వీ వాదనలపై రోహత్గీ అభ్యంతరం తెలిపారు. దర్యాప్తు కీలక దశలో ఉందని.. ఈ సమయంలో ముందస్తు బెయిల్ ఇస్తే కేసుపై ప్రభావం పడుతుందని తెలిపారు. జరిగింది అతిపెద్ద కుంభకోణమని, ఖజానాకు రూ.3 వేల కోట్లకు పైగా నష్టం కలిగిందన్నారు. హైకోర్టు సుదీర్ఘంగా విచారించిందని.. అన్నీ పరిశీలించాకే ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిందని తెలిపారు. ఈ కేసులో లోతైన దర్యాప్తు చేయాలని.. నిందితులను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందన్నారు. వారిద్దరికీ వ్యతిరేకంగా సాక్ష్యాలు ఉన్నట్లు సుప్రీంకోర్టు కూడా అభిప్రాయపడింది. 'నిందితులపై మోపిన అభియోగాలు చాలా తీవ్రంగా ఉన్నాయి. హైకోర్టు అన్నింటినీ స్పష్టంగా పరిశీలించి ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిందని నమ్ముతున్నాం. ఈ సమయంలో దర్యాప్తు సంస్థకు అడ్డురాకూడదని భావిస్తున్నాం. రాజకీయ పక్షపాతం, దురుద్దేశం ఉందనే వాదనలను పక్కన పెడితే.. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాలు ఉన్నట్లు ప్రాథమికంగా అనిపిస్తోంది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని అర్థమవుతోంది. ఈ సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వడం సరికాదని అభిప్రాయపడుతున్నాం. అయితే వారిపై ఎటువంటి థర్డ్ డిగ్రీ పద్ధతులను ప్రయోగించకూడదు. దర్యాప్తు సంస్థ చట్టానికి అనుగుణంగా నిష్పక్షపాతంగా విచారణ కొనసాగించాలి. వారు కూడా సాక్షులు లేదా సహనిందితులపై ఎటువంటి ఒత్తిడీ చేయకూడదు' అని స్పష్టం చేసింది. నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపితే.. వారి బెయిల్ దరఖాస్తులను మెరిట్స్ ఆధారంగా సంబంధిత కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపింది. పిటిషనర్లు అవసరమని భావిస్తే హైకోర్టును ఆశ్రయించవచ్చనీ స్పష్టం చేసింది.

బాలాజీ గోవిందప్పను కస్టడీకి అప్పగించండి..

మద్యం కేసులో మరో నిందితుడు బాలాజీ గోవిందప్పను పోలీసు కస్టడీకి అప్పగించాలని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ అగర్వాల్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి పంపిన తర్వాత తిరిగి మళ్లీ పోలీసు కస్టడీకి ఎలా తీసుకుంటారని జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించారు. ఆయన్ను పోలీసు కస్టడీకి ఇస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అగర్వాల్ చెబుతుండగా.. జస్టిస్ పార్దీవాలా అసహనం వ్యక్తం చేశారు. 'ఈ కేసులో బాలాజీ గోవిందప్పను ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు మాకు సమాచారం అందింది. ఆ సందర్భంగా దర్యాప్తు అధికారి పోలీసు కస్టడీ కోసం ప్రార్థించలేదు. జ్యుడీషియల్ కస్టడీకి పంపాక.. కస్టడీ కోరుతూ దరఖాస్తు చేశారు. ఈ విషయంలో మేమేమీ చెప్పడం లేదు. ఎందుకంటే నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి పంపాక.. దర్యాప్తు అధికారి పోలీసు రిమాండ్ కోసం అడగవచ్చా లేదా అనేది సంబంధిత కోర్టు పరిగణనలోకి తీసుకుంటుంది. రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేస్తే.. చట్టానికి అనుగుణంగా బెయిల్ ఇవ్వాలా వద్దా అనేది నిర్ణయిస్తుంది' అని జస్టిస్ పార్దీవాలా తెలిపారు.

నకిలీ ఇళ్లపట్టాల కేసులో వంశీకి రిమాండ్

▸ అనారోగ్యం కారణంగా వైద్య పరీక్షలకు నూజివీడు కోర్టు ఆదేశం

▸ గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో బెయిల్ మంజూరు

▸ అయినా జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి

▸ తాజాగా మైనింగ్ కేసు నమోదు



వంశీని నూజివీడు కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

నూజివీడు/విజయవాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి నకిలీ ఇళ్లపట్టాల పంపిణీ కేసులో నూజివీడు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. అయితే గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మాత్రం ఆయనకు బెయిల్ మంజూరైంది. ఆయన 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున గన్నవరంలో పోటీచేశారు. విజయం కోసం బాపులపాడు మండలం కొయ్యూరు, పెరికీడు గ్రామాల్లో కొంతమందికి నకిలీ ఇళ్లస్థలాల కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారని ఆరోపిస్తూ 9 మందిపై ఆ ఏడాది అక్టోబరులో హనుమాన్ జంక్షన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వారిలో వంశీ పేరు లేదు. 2024లో టీడీపీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఫిర్యాదు మేరకు ఈ కేసు దర్యాప్తు వేగవంతమైంది. గతంలో వంశీ హయాంలో ఇచ్చిన ఇళ్లపట్టాలపై అధికార ముద్రలు నకిలీవని రెవెన్యూ అధికారులు తమ నివేదికలో పేర్కొనడంతో ఆయన్ను పదో నిందితుడిగా చేరుస్తూ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ నిమిత్తం శుక్రవారం పోలీసులు విజయవాడ జైల్లో ఉన్న వంశీని నూజివీడు 2వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శ్రావణి ముందు హాజరుపరిచారు. ఆయనతో పాటు అనుచరుడు ఓలుపల్లి మోహన్ రంగారావుకు న్యాయాధికారి 14రోజుల పాటు రిమాండ్ విధించారు. కాగా.. నూజివీడు కోర్టుకు వచ్చినప్పటి నుంచి వంశీ తీవ్రంగా దగ్గుతూ కనిపించారు. న్యాయాధికారికి తన అనారోగ్యం గురించి చెప్పడంతో.. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం అందించాలని ఆమె పోలీసులను ఆదేశించారు. వంశీ భార్య పంకజశ్రీ కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. వంశీ ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నదని చెప్పారు. ఇంకోవైపు.. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీకి బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడ 12వ అదనపు జిల్లా కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. అయితే నూజివీడు కోర్టు రిమాండ్‌తో ఆయన జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంశీపై తాజాగా మరో కేసు నమోదైంది. వైసీపీ హయాంలో గన్నవరం, బాపులపాడు మండలాల్లో అక్రమంగా మైనింగ్ చేశారని.. ఇందులో వంశీ, ఆయన అనుచరుడు ఓలుపల్లి మోహన రంగారావు కీలకంగా వ్యవహరించారని కృష్ణా జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులు గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు. వంశీ(ఏ-1) సహా 13 మందిని నిందితులుగా చేర్చారు. అక్రమ మైనింగ్ ద్వారా వంశీ రూ.192 కోట్ల అక్రమార్జన చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



కోనసీమ జిల్లా ఆలమూరు సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని శుభ్రం చేస్తున్న శిక్ష పడిన యువకులు

ఆకతాయిలకు శిక్ష.. ఆ వెంటనే అమలు!

ఆలమూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న పలువురు ఆకతాయిలకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ శిక్ష వేసి వెంటనే అమలు చేయించే విధంగా వినూత్న తీర్పును ఇచ్చారు. మండపేట టౌన్‌లో గురువారం రాత్రి మద్యం సేవించి అల్లరి చేస్తున్న పది మంది యువకులను మండపేట టౌన్ ఎస్ఐ చంటి అరెస్టు చేశారు. వీరిని శుక్రవారం ఆలమూరు కోర్టులో హాజరుపరచగా, ఒక్కొక్కరికీ రూ.100 జరిమానాతోపాటు వారితో పరిసరాలను పరిశుభ్రం చేయించాలని న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ తీర్పు చెప్పారు. దీంతో పోలీసులు వారికి చీపుర్లు ఇచ్చి, కోర్టుకు పక్కనే ఉన్న సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని శుభ్రం చేయించారు. శిక్షను తక్షణం అమలు చేయించడంతో అంతా ఆసక్తిగా తిలకించారు.

కల్తీ నెయ్యి కేసులో

హరిమోహన్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

▸ కేసు దర్యాప్తు గడువు మరో రెండు నెలలు పొడిగింపు!

▸ నేటి నుంచి టీటీడీలో పలువురిని విచారించనున్న సిట్

తిరుపతి, మే 16(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో నిందితుడు హరిమోహన్ రాణా బెయిల్ పిటిషన్‌ను నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. ఉత్తరాఖండ్ భగవాన్‌పూర్‌లోని భోలేబాబా డెయిరీ జనరల్ మేనేజర్ హరిమోహన్ ఈ కేసులో 12వ నిందితుడిగా ఉన్నారు. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ఇతనిది కీలక పాత్రగా తేలడంతో సిట్ అధికారులు మార్చి 20న అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని హరిమోహన్ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దానిపై ఈనెల 13న వాదనలు జరిగాయి. బెయిల్ ఇస్తే సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రమాదముందని సిట్ తరఫున ఏపీపీ జయశేఖర్ వాదించారు. దీంతో ఏకీభవించిన ఏసీబీ కోర్టు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ చేపట్టిన దర్యాప్తు గడువు పొడిగించారు. ఈనెల 15వ తేదీకి దర్యాప్తు ముగించి, తుది చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉండగా.. మరో 2 నెలలు గడువు పొడిగిస్తూ సీబీఐ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. జూలై 15 నాటికి దర్యాప్తు ముగిస్తారని తెలిసింది. ఇప్పటివరకు 80 శాతం దర్యాప్తు పూర్తయింది. మిగిలిన 20 శాతం దర్యాప్తు టీటీడీకి సంబంధించి జరుగుతుందని సిట్ వర్గాలు చెబుతున్నాయి. దర్యాప్తులో వేగం పెంచిన సిట్ అధికారులు శనివారం నుంచి పలువురు టీటీడీ ఉద్యోగులు, అధికారులను విచారించనున్నారు. రోజువారీ కొందరిని విచారించనున్నట్లు సమాచారం.

ఏఆర్ డెయిరీ ఫుడ్స్ లైసెన్స్ రద్దు నిలిపివేత

▸ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

చెన్నై, మే 16(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థ లైసెన్స్‌ను రద్దు చేస్తూ ఆహార భద్రతా నాణ్యతా సంస్థ గత ఫిబ్రవరిలో జారీచేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం నిలుపుదల చేసింది. లైసెన్స్ రద్దు వల్ల వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారంటూ ఆ సంస్థ యాజమాన్యం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.